ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

ఖమ్మం

: fb.com/vaartha Digital

Published from Khammam, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

27-5-2025 మంగళవారం సంపుటి: 31 సంచిక: 115 పేజీలు: 10+4 వెల: 6.50

కోటాలో మరో విద్యార్థిని ఆత్మహత్య 2

యూనస్‌ను దించేందుకు ఆర్మీ చీఫ్ కసరత్తు! 5

# మోడీని ఢీకొంటే ఫలితం చూపించాం



## గుజరాత్ పర్యటనలో పాక్‌పై ప్రధాని ఆగ్రహం

**దాహోద్(గుజరాత్),మే 26:** ప్రధాని నరేంద్ర మోడీ పాకిస్తాన్‌కు మరోసారి గట్టి వార్నింగ్ ఇచ్చారు. దాహోద్ సభలో పాకిస్తాన్ చర్యలను చీల్చిచెండాడారు. పహల్గామ్ దాడికి ప్రతీకారం తీర్చుకున్నామని అన్నారు. పిల్లల ముందు తండ్రిని దారుణంగా చంపి ఉగ్రవాదులు 140 కోట్ల మంది భారతీయులకు సవాల్ విసిరారని అన్నారు. మోడీతో పెట్టుకుంటే ఎలా ఉంటుందో పాకిస్తాన్‌కు చూపించామన్నారు. పహల్గామ్ దాడి దృశ్యాలు గుర్తుకు వస్తే ఇప్పటికి కూడా తన రక్తం మరిగిపోతోందని మోడీ పేర్కొన్నారు. భారత మహిళల సిందూరాన్ని తుడిచేసిన ఉగ్రవాదులను మట్టిలో కలిపేసినట్టు ప్రకటించారు. పహల్గామ్ దాడికి భారత ప్రజలు కోరుకున్న రీతిలో ప్రతీకారం తీర్చుకున్నామని అన్నారు. పాక్‌లో 9 ఉగ్రవాద శిబిరాలను ధ్వంసంచేశామన్నారు. భారత్ మహిళ >>2

# ఇప్పుడు వెళ్లి.. మళ్లీ రండి!

## కేబినెట్ విస్తరణ, పిసిసి కార్యవర్గం ఖరారు నాలుగు రోజులు వాయిదా

### 30న మళ్లీ ఢిల్లీకి రావాలని సిఎం రేవంత్, డి.సిఎం భట్టి, పిసిసి చీఫ్ మహేష్ గౌడ్, మంత్రి ఉత్తమ్‌ను ఆదేశించిన అధిష్ఠానం

### అందుబాటులో లేని పార్టీ చీఫ్ ఖర్గే

### రాహుల్‌తో సమావేశమైన మహేష్, ఢిల్లీ నుంచి తిరిగి వచ్చిన సిఎం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మే26:** తెలంగాణ కేబినెట్ విస్తరణనకు కాంగ్రెస్ అధిష్ఠానం ముహూర్తం ఫిక్స్ చేస్తున్నట్లు సమాచారం. ఇదే సమయంలో పిసిసి కార్యవర్గ కూర్పుపై కూడా తుది కూర్పు జరిగినట్లు సమాచారం.ఎఐసిసి జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే అందుబాటులో లేకపోవడంతో టిపిసిసి కార్యవర్గం ఖరారు వాయిదా పడినట్లు తెలుస్తోంది. ఈనెల 30న అధిష్ఠానంతో మరోసారి సమావేశం అయ్యేందుకు ఢిల్లీకి రావాలని సిఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క, సీనియర్ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి. పిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌లను అధిష్ఠానం ఆదేశించింది. గత మూడురోజులుగా ఢిల్లీ పర్యటనలో ఉన్న సిఎం రేవంత్ రెడ్డి ఇప్పటికే ఈ అంశాలపై కాంగ్రెస్ హైకమాండ్‌తో చర్చలు జరిపి తిరిగి హైదరాబాద్‌కు వచ్చేశారు.

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నర కావొస్తున్న ఇప్పటికీ ఇంకా కేబినెట్ విస్తరణ చేయలేదు. దీంతో పార్టీలోని పలువురు ఎమ్మెల్యేలు మంత్రి పదవుల కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు.అయితే ప్రస్తుతం కేబినెట్‌లో ఆరు మంత్రి పదవులు ఖాళీగా ఉండగా.. వాటి కోసం పోటీ కూడా గట్టిగానే ఉంది. ఈ క్రమంలో తాజాగా కేబినెట్ కూర్పుపై కాంగ్రెస్ హైకమాండ్ దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో తెలంగాణ కాంగ్రెస్ ముఖ్య నేతలను ఢిల్లీకి రావాలని పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో మూడు రోజుల క్రితమే హైకమాండ్ పిలుపుతో సీఎం రేవంత్‌రెడ్డితో పాటు తెలంగాణ పిసిసి చీఫ్ మహేష్ కుమాంౕగౌడ్, తదితర తెలంగాణ కాంగ్రెస్ నాయకులు ఢిల్లీ వెళ్లారు. ఈ



సోమవారం న్యూఢిల్లీలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌తో భేటీ అయిన పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్

క్రమంలోనే సిఎం రేవంత్ రెడ్డి, మహేష్ కుమార్ గౌడ్ ఆదివారం ఎఐసిసి ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్‌తో సమావేశమయ్యారు.

ఈ సమావేశంలో మంత్రివర్గ విస్తరణ, పిసిసి కార్యవర్గ కూర్పుపై చర్చలు జరిపారు. ఈచర్చల్లో మంత్రివర్గ విస్తరణపై చర్చలు >>2

# జూన్ 5న స్థానిక ఎన్నికల నోటిఫికేషన్?

### ప్రణాళిక సిద్ధం చేసిన అధికారులు

**హైదరాబాద్,మే 26, ప్రభాతవార్త :** రాష్ట్ర వ్యాప్తంగా ఆశావహులు సర్పంచ్ ఎన్నికల కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇప్పటికేస్థానిక సంస్థల పాలకవర్గాల పదవీ కాలం ముగిసి 15 నెలలు కావొస్తుంది. మరోవైపు కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థికసంఘం నిధులు విడుదల చేయకపోవడంతో గ్రామాల్లో అభివృద్ధి పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి.ప్రభుత్వం ఎన్నికల నిర్వహణపై ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో ప్రజలు కూడా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలోనే పంచాయతీ ఎన్నికల నిర్వహణపై ఓ కీలక అప్డేట్ బయటకు వచ్చింది. జూన్ 2, తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం రోజున లోకల్ ఎలక్షన్లపై సర్కార్ పెద్దలు లేదా సిఎం రేవంత్ రెడ్డే స్వయంగా కీలక ప్రకటన చేయనున్నట్లుగా తెలుస్తోంది. అదేవిధంగా జూన్ 5లోగా రాష్ట్ర ఎన్నికల సంఘం నుంచి అధికారిక ప్రకటనకూడా రావొచ్చని సమాచారం. అయితే, రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ సృజన, ఇతర ఉన్నతాధికారులతో తాజాగా సెక్రటేరియట్లో సిఎం రేవత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఆ సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై సమగ్రంగా చర్చించినట్లుగా తెలుస్తోంది. >>2



సోమవారం అచ్చంపేట బహిరంగసభలో డి.సిఎం భట్టి

### ఎన్నికల ముందే ప్రజలు ఆ దెయ్యాలను పంపించేశారు

### మరో రెండు దశాబ్దాల అభివృద్ధి ప్రణాళిక కాంగ్రెస్ రూపొందిస్తోంది

### మా ప్రతిపథకం ఓ రోల్ మోడల్

### అచ్చంపేటలో డి.సిఎం. భట్టి

# 'దెయ్యాల' నేత దేవుడెలా అవుతాడు?

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మే 26 ప్రభాతవార్త:** దెయ్యాలకు నాయకత్వం వహించిన కెసిఆర్ దేవుడు ఎలా అవుతాడు? దెయ్యాలను రాష్ట్ర పొలిమేరల నుంచి తరిమికొట్టాల్సిన సమయం ఆసన్నమైందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, విద్యుత్, ఆర్థిక, ప్రణాళిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. సోమవారం అచ్చంపేటలో పలు విద్యుత్ సబ్ స్టేషన్లు ప్రారంభించి, మరి కొన్ని సబ్ స్టేషన్లుకు శంకుస్థాపన చేసిన అనంతరం స్థానికంగా ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క ప్రసంగించారు. కెసిఆర్ చుట్టూ దెయ్యాలు ఉన్నాయని ఆయన కూతురు కవిత ఇప్పుడు చెబుతుంది.. కానీ ఎన్నికల ముందే రాష్ట్ర ప్రజలు ఈ దెయ్యాలను వదిలించుకొని ప్రజా ప్రభుత్వాన్ని తెచ్చుకున్నారని అన్నారు. మరో రెండు దశాబ్దాల పాటు ఈ రాష్ట్ర అభివృద్ధికి కావాల్సిన ప్రణాళికలను ప్రజా ప్రభుత్వం చేస్తుందని తెలిపారు. రాష్ట్ర ప్రజలు వరుస సంక్షేమ పథకాలు, ఉద్యోగ, స్వయం ఉపాధి కార్యక్రమాలతో బాగుపడుతున్నారని, తన దగ్గరకు ఎవరూ రావడం లేదని కెసిఆర్ దుఃఖపడుతున్నాడని, వారు రాష్ట్రాన్ని లూటీ చేశారు అని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మేం తీసుకొచ్చిన ప్రతి పథకం దేశానికి రోల్ మోడల్‌గా నిలుస్తుందని, వందమంది కెసిఆర్లు అడ్డం వచ్చినా తెలంగాణ రాష్ట్ర ప్రగతి ఆగదని డిప్యూటీ సిఎం వివరించారు. 10 సంవత్సరాలు పాలించిన కెసిఆర్ ఉద్యోగులకు 10 వేల కోట్ల బకాయిలు పెడితే... మేము రాగానే అందులో 8 వేల కోట్ల ఉద్యోగుల బకాయిలు క్లియర్‌చేశాం. ఇంకా కొన్ని మిగిలిపోతే ప్రజాసంక్షేమ పథకాలు ఉన్నాయి కాబట్టి దశలవారీగా పూర్తి చేస్తామని ఉద్యోగులను ఒప్పించామని తెలిపారు. >>2



మాజీమంత్రి కెటిఆర్



అర్వింద్ కుమార్

# రేపు విచారణ!


### ఫార్ములా రేస్ కేసులో కెటిఆర్‌కు నోటీసులు

### హాజరుకాలేనన్న మాజీ మంత్రి

### త్వరలో అరవింద్ కుమార్‌కు కూడా..

**హైదరాబాద్, మే26, ప్రభాతవార్త:** ఫార్ముల ఈ-కారు రేసు వ్యవహారంపై ఎసిబి మరింత వేగవంతం చేసింది. ఏ1గా ఉన్న అప్పటి మున్సిపల్ శాఖ మంత్రిగా ఉన్న కెటిఆర్‌కు మరోసారి ఎసిబి నోటీసులు పంపింది. ఇప్పటికే ఇచ్చిన నోటీసులకు వాయిదాలు కోరడంతో సోమవారం రెండోసారి పంపించారు.ఈ నెల 28న విచారణకు రావాలని స్పష్టంచేసింది. దీంతో ఆయన ఎక్స్ వేదికగా స్పందించిముందస్తుగా ఏర్పాటుచేసుకున్న లండన్, అమెరికా కార్యక్రమాలకు వెళ్లాల్సి ఉండడంతో తిరిగొచ్చాక హాజరవుతానని బదులిచ్చారు.

కేసు రాజకీయ వేధింపులతో కూడుకున్నదని, చట్టాన్ని గౌరవించే పౌరుడిగా, ఖచ్చితంగా ఏజన్సీలకు పూర్తిగా సహకరిస్తానని వెల్లడించారు. సిఎం రేవంత్‌రెడ్డి చౌకబారు ప్రతీకారచర్యలకు ఈ నోటీసులు నిదర్శనమని, బిఆర్‌ఎస్‌ను చూసి భయపడుతున్నారని వివరించారు. అదేవిధంగా నలభైఎనిమిది గంటల క్రితం మనీలాండ >>2



# విజృంభిస్తున్న కొవిడ్

## వెయ్యి దాటిన కేసులు, కేరళలో ఎక్కువ వ్యాప్తి

**న్యూఢిల్లీ, మే 26:** కరోనావైరస్ కొత్త రూపంలో పంజా విసురుతోంది. భారత్‌లో కరోనా వైరస్ మళ్లీ వేగంగా వ్యాప్తి చెందుతుండటం జనంలో గుబులు పుట్టిస్తోంది. దేశంలో కోవిడ్ 19 పాజిటివ్ కేసుల సంఖ్య రోజురోజుకి పెరుగుతోంది.. కరోనాతో ఇప్పటివరకు ఏడుగురు మృతి చెందారు. యాక్టివ్ కేసుల సంఖ్య కూడా బాగా పెరిగింది.. చాప కింద నీరులా చల్లగా పాకేస్తోన్న కరోనా యాక్టివ్ కేసులసంఖ్య దేశంలో వెయ్యి దాటిపోయింది. మొత్తం పాజిటివ్‌కేసులు 1009కి చేరాయని ఆరోగ్యశాఖప్రకటించింది. ఈ సంవత్సరంలో దేశంలో కరోనా కేసులు 1000 దాటడం ఇదే తొలిసారి కావడం విశేషం.తమిళనాడు, మహారాష్ట్ర, కర్నాటక, ఢిల్లీలో బాధితులు పెరుగుతున్నట్లుగా తెలుస్తోంది. దీంతో అక్కడి వైద్య, ఆరోగ్యశాఖ అప్రమత్తమై కోవిడ్ నిబంధనల్ని, టెస్టులను చేయడం మొదలుపెట్టింది. దేశవ్యాప్తంగా యాక్టివ్ కేసుల సంఖ్య 1,009కి పైగా ఉంది. కేరళలో 403, మహారాష్ట్రలో 209, ఢిల్లీలో 104, గుజరాత్‌లో 83, కర్నాటకలో 47, ఉత్తరప్రదేశ్ 15, పశ్చిమ బెంగాల్ లో 12 కరోనా కేసులు నమోదయ్యాయి. కోవిడ్ కారణంగా మహారాష్ట్రలో నలుగురు, కేరళలో ఇద్దరు, కర్ణాటకలో ఒకరు మరణించారు. దేశంలోని కోవిడ్ కొత్త వేరియంట్ తీవ్రత అధికంగా ఉంది. దేశ రాజధాని ఢిల్లీలోనే వందకు చేరింది. దేశంలో గత వారం రోజులలో 752 కొత్త కోవిడ్ కేసులు నమోదయ్యాయని ఆరోగ్య శాఖ తెలిపింది. కేరళ, మహారాష్ట్ర, ఢిల్లీ రాష్ట్రాల్లోనే అధిక సంఖ్యలో కొత్త కేసులు నమోదవుతున్నాయి. కేరళలో 335 కొత్త కేసులు మహారాష్ట్రలో 153 కేసులు, ఢిల్లీలో 104 కొత్త కేసులు వెలుగుచూశాయి. తాజా కేసులపరంగాచూస్తే కేరళలో అత్యధిక సంఖ్యలో కొత్త కేసులునమోదయ్యాయి. ఇక్కడ అత్యధికంగా 430 యాక్టివ్ కేసులు నమోదయ్యాయి. దీంతో భారతదేశంలో మొత్తం యాక్టివ్ కేసుల సంఖ్య 1009కి చేరుకుంది. అండమాన్ నికోబార్, అరుణాచల్ ప్రదేశ్, అసోం, బీహార్, హిమాచల్ ప్రదేశ్, జమ్మూ కశ్మీర్ >>2

## ద్రోహులిచ్చిన సమాచారంతోనే ఎన్‌కౌంటర్ కేశవరావుని పట్టుకుని కాల్చి చంపారు

## మావోయిస్టుల సంచలన లేఖ విడుదల

## ఎన్‌కౌంటర్ మృతుల అంత్యక్రియలు పూర్తి

7లో



ఎఫ్‌డిసి ఛైర్మన్ దిల్ రాజు

# పవన్ సినిమాలు ఆపే దమ్మెవరికి?

### థియేటర్లు మూసివేయడం జరగని పని

### ఎపి మంత్రి దుర్గేష్‌కు కృతజ్ఞతలు

### తెలంగాణ ఎఫ్‌డిసి ఛైర్మన్ దిల్‌రాజు వివరణ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,మే26:** రెండు తెలుగు రాష్ట్రాల్లో థియేటర్ల యాజమాన్య సమస్యలు, బంద్ ప్రకటనల నేపథ్యంలో నెలకొన్న గందరగోళంపై ప్రముఖ నిర్మాతలు ఒక్కొక్కరుగా స్పందిస్తున్నారు. తమపై వస్తున్న ఆరోపణలకు వివరణ ఇచ్చే ప్రయత్నం చేస్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లో సినిమా థియేటర్ల బంద్ విషయమై జరుగుతున్న చర్చపై ప్రముఖ నిర్మాత, పంపిణీ దారుడు, ఎగ్జిబిటర్, తెలంగాణ ఎఫ్‌డిసి ఛైర్మన్ దిల్ రాజు వివరణ ఇచ్చారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సినిమా రంగానికి అండగా ఉంటామని ప్రకటించిన ఎపి సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ వివాదానికి ఆయన ఓ రకంగా ఫుల్ స్టాప్ పెట్టారని అన్నారు. తొమ్మిది రోజులుగా జరుగుతున్న ఓ ఇష్యూని కన్ క్లూజ్ చేయడం ఆనందంగా ఉందని, మినిస్టర్ ఇచ్చిన స్టేట్ మెంట్‌తో ఫుల్‌స్టాప్ పడిందని అనుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఏప్రిల్ 19న తూర్పు గోదావరి >>2



### ఆమె లేఖను పాటిజివ్‌గానే తీసుకున్న మాజీ సిఎం కెసిఆర్

### కెటిఆర్‌కు నోటీసులపై తీవ్రంగా స్పందించిన కవిత

# ఎంపి దామోదర్‌రావు కవితతో భేటీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మే26:** బిఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఇటీవల తన తండ్రి, బిఆర్‌ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావుకు రాసిన లేఖ బయట పడటంతో రాష్ట్రంలో రాజకీయ దుమారం రేగింది. నాలుగైదు రోజులుగా ఇదే హాట్ టాపిక్‌గా మారింది. తాజా పరిణామాల నేపథ్యంలో బిఆర్‌ఎస్ రాజ్యసభ సభ్యుడు దామోదర్‌రావు సోమవారం కల్వకుంట్ల కవితతో భేటీ అయ్యారు. ఆయనతో పాటు బిఆర్‌ఎస్ లీగల్ సెల్ ఇంచార్జ్ గండ్ర మోహన్‌రావు కూడా కవితతో సమావేశమయ్యారు. సుమారు మూడు గంటల పాటు ఈ భేటీ కొనసాగింది. కాగా కవిత రాసిన లేఖను పార్టీ అధినేత కెసిఆర్ పాజిటీవ్‌గానే తీసుకున్నారని వారు కవితకు సమాచారం ఇచ్చారని తెలుస్తోంది. బిఆర్‌ఎస్‌కు దూరం కావొద్దని, కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటు ఆలోచనను విరమించుకోవాలని వారు కవితను సూచించినట్లు తెలుస్తోంది. కెసిఆర్ >>2

# వానొచ్చె.. వరదొచ్చె..



భారీ వర్షాలకు ముంబయిలో ఏరులైన వరద

### నాలుగు రాష్ట్రాల్లో కుంభవృష్టి

### మహారాష్ట్ర, కేరళ, కర్ణాటక, తమిళనాడులో స్తంభించిన జనజీవనం

### ముంబయలో రెడ్ అలర్ట్, 'మెట్రో' స్టేషన్ నీట మునక



కేరళలో దట్టంగా కమ్ముకున్న కారుమబ్బులు

**ముంబయి, మే26:** మహారాష్ట్రలోని తీరప్రాంత జిల్లాలతోపాటు అర్బన్ జిల్లాలను కూడా భారీ వర్షాలు ముంచెత్తాయి. ఉరుములు మెరుపులతోపాటు తీవ్రస్థాయిలో ఈదురుగాలులు మహారాష్ట్ర ప్రజలను అతలాకుతలంచేస్తున్నాయి. సోమవారం ఉదయం నుంచి కొనసాగుతున్న వర్షాలు మహారాష్ట్ర రాజధాని ముంబయిని వరదలతోముంచెత్తాయి. ఇప్పటికే థాణె, రత్నగిరి, రాయ్‌గఢ్ జిల్లాలకు రెడ్‌అలర్ట్ జారీచేసింది. రాత్రికిరాత్రే కురిసిన భారీ వర్షం ముంబయిలోని లోతట్టుప్రాంతాలను ముంచివేసింది.



నీట మునిగిన ముంబయిలోని మెట్రో స్టేషన్

కొన్ని సబర్బన్‌రైళ్ల రాకపోకలు నిలిచిపోయాయి. ఛత్రపతి శివాజి మహారాజ్ ఎయిర్ పోర్టునుంచివెళ్లే విమానసర్వీసులనుకూడా నిలిపివేసారు. స్పైస్ >>2


సోమవారం కర్ణాటకలో భారీ వర్షం


సోమవారం తమిళనాడులోని నీలగిరి జిల్లాలో ఎడతెరిపిలేని వాన దృశ్యం

# వానొచ్చె.. వరదొచ్చె..

>> జెట్, ఇండిగో సంస్థలు తమతమ ప్రయాణీకులకు సందేశాలు పంపించాయి. నారిమన్ పాయింట్‌నుంచి లోతట్టుప్రాంతాల్లో భారీ ఎత్తున వర్షం నీరునిలిచిపోయింది. ఆరునుంచి ఏడు గంటలకే 40 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. గ్రాంట్‌రోడ్‌లో 36 మిల్లీమీటర్లు, కొలాబాలో 31 మిల్లీమీటర్లు, బైకుల్లాలో 21 మిల్లీమీటర్లు వర్షంకురిసింది. ముంబయి, కొంకణ్ ప్రాంతాల్లో మరింత భారీ ఎత్తున వర్షం కురుస్తోంది. వొర్లిలోని భూగర్భ మెట్రోప్రాంతం మొత్తం వర్షపునీటితో నిండిపోయింది. గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు కూడా చుట్టుముట్టాయి. రానురాను ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసింది. గంటకు 50నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు కొన్ని జిల్లాలను చుట్టుముట్టాయి. పూణె, సతారా, సింధుదుర్గ్, పాల్ఘర్, థాణె, రాయ్‌గడ్, రత్నగిరిజిల్లాల్లో భారీవర్షాలు కురిసాయి. అలిహియానగర్, కొల్హాపూర్, సాంగ్లి, సోలాపూర్, లాతూర్‌జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీచేసారు. గత 75 సంవత్సరాల్లో ఎన్నడూలేని విధంగా నైరుతి రుతుపవనాలు ముందస్తుగా ప్రవేశించాయి. ఈ క్రమంలో భారీవర్షం కురిసింది. ఫలితంగా 107 సంవత్సరాల రికార్డు బద్దలయ్యింది. మే మాసంలో 107 సంవత్సరాల తర్వాత ఈ స్థాయిలో భారీ వర్షం కురిసింది. ముంబయికి నైరుతి రుతుపవనాలు చేరాయని వాతావరణశాఖ తెలిపింది. సాధారణంగా జూన్ 11 వరకు వస్తుందగా.. ఈ సారి మాత్రం 16 రోజుల ముందుగానే వచ్చాయని తెలిపింది. భారత వాతావరణ శాఖ (ఐఎండి) శాస్త్రవేత్త సుష్మా నాయర్ మాట్లాడుతూ.. గతంలో నైరుతి రుతుపవనాలు తొలిసారిగా 1956 మే 29న ముంబయికి ముందస్తుగా చేరాయని.. ఆతర్వాత 1962, 1971లో ఆదే రోజుల్లో వచ్చినట్లుగా పేర్కొంది. ఇకపోతే కర్ణాటక కోస్తా జిల్లాల్లో కూడా భారీ వర్షం కురిసింది. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలను రంగంలోకి దించింది. ఉడుపిదక్షిణకన్నడ కర్ణాటక కోస్తా జిల్లాలకు రెడ్ అలర్ట్ అమలులో ఉంటుందని ప్రభుత్వం ప్రకటించింది. ఇక తమిళనాడులోని వాతావరణకేంద్రం ఇప్పటికే నీలగిరి హిల్స్‌కు రెడ్ అలర్ట్ జారీచేసింది. కోయంబత్తూర్ ప్రాంతంలో కూడా ఇదే విధంగా భారీ వర్షాలు కురుస్తాయి. 28వ తేదీవరకూ ఇదే తీరు ఉంటుందని పశ్చిమఘాట్ ప్రాంతాల్లో అక్కడక్కడ వరదలు సంభవించినట్లు వాతావరణకేంద్రం తెలిపింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరం అయితే తప్ప ఇళ్లనుంచి బయటికి రావద్దని ప్రభుత్వ హెచ్చరికలు జారీచేసింది. అదేవిధంగా కేరళలోని 11 జిల్లాల్లోకూడా రెడ్ అలర్ట్ జారీ అయింది. కొట్టాయం, ఎర్నాకుళం, ఇడుక్కి, త్రిశూర్, పాలక్కాడ్, మలప్పురం, కోజికోడ్, వాయనాడు, కన్నూర్, కాసరగోడ్ జిల్లాలకు రెడ్‌అలర్ట్‌జారీచేసారు. తిరువనంతపురం, కొల్లం, అలప్పుజ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీచేసారు. దక్షిణాసియా ప్రాంతం ఈ వేసవిలో అత్యంత వేడి, గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదుచేసింది. రానురాను వాతావరణంలో మార్పులు సంభవించాయి. దీనితో ఈప్రాంతంలో ఇప్పటికే సగటు వార్షిక వర్షపాతంలో 80శాతం నమోదయినట్లు వాతావరణశాస్త్రజ్ఞులు పేర్కొంటున్నారు.

# మళ్లీ రండి!

>> కొలిక్కి రాగా.. పిసిసి కార్యవర్గ కూర్పుపై మాత్రం ఇంకా స్పష్టత రానట్టు తెలుస్తోంది. అయితే ఎమ్మెల్యేల నుంచి వచ్చిన వినతులను సీఎం రేవంత్ రెడ్డి అధిష్టానం దృష్టికి తీసుకెళ్లగా వాటిని పరిశీలించిన అధిష్టానం సామాజికవర్గం, జిల్లాల వారీగా పేర్లను ఎంపిక చేసినట్టు సమాచారం. అయితే ఈ జాబితాను సోమవారం మధ్యాహ్నం సిఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ అగ్రనాయకులు ఖర్గే, రాహల్, కేసి వేణుగోపాల్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమావేశం తర్వాత మంత్రివర్గంలోని పేర్లను అధికారికంగా ప్రకటించే అవకాశం ఉందని ప్రచారం అయింది. కానీ ప్రకటించలేదు. సిఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీ నుంచి తిరిగి హైదరాబాద్‌కు వచ్చేశారు. కేబినెట్ విస్తరణ కొలిక్కి వచ్చినా పిసిసి కార్యవర్గంపై మాత్రం ఇంకా చర్చలు జరుగుతున్నట్టు సమాచారం. పీసీసీ కార్యవర్గ కూర్పులో సామాజిక సమీకరణాలకు కాంగ్రెస్ పెద్దపీట వేసున్నట్టు తెలుస్తోంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు సుమారు 70 శాతం అవకాశం కల్పించేందుకు అధిష్ఠానం కసరత్తు చేస్తోంది. కాగా, మంత్రి పదవులకు ఎక్కువ మంది పోటీపడుతుండటంతో అందులో సర్దుబాటు చేయలేని ఎమ్మెల్యేలకు కార్యనిర్వహక అధ్యక్ష పదవి ఇవ్వడంపై చర్చలు సాగుతున్నాయి. జిల్లాల వారీగా 2017 నుంచి కాంగ్రెస్‌లో ఉంటూ, పార్టీ కోసం పని చేసిన ముఖ్యనేతల పేర్లు, వారి వివరాలను ఇప్పటికే ఏఐసీసీ సేకరించింది. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రుల అభిప్రాయాలను సైతం తీసుకుంది. ఎవరికి ఏ పదవి ఇవ్వాలనే అంశంపై అధిష్ఠానానికి ఇప్పటికే స్పష్టత ఉందని సీనియర్ నేతలు తెలిపారు. ఒక్కో పదవికి ముగ్గురి పేర్లను పిసిసి ప్రతిపాదించినట్లు సమాచారం. ఏ ఒక్క సామాజికవర్గానికి రెండు పదవులు ఇవ్వకూడదనే విధానం అనుసరించనున్నారు. మంత్రి పదవులకు ఒకే సామాజికవర్గానికి చెందిన పలువురు పోటీపడుతుండటంతో ఆ విషయంలో ఏంచేయాలనే దానిపై పార్టీ పరిశీలిస్తోంది. రాష్ట్రంలో మాదిగల జనాభా ఎక్కువగా ఉన్నా, పదవులు తక్కువగా వచ్చాయని మంత్రివర్గ విస్తరణలో తప్పనిసరిగా అవకాశం ఇవ్వాలని కోరుతూ ఆ సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యేలు ఇటీవల ముఖ్యమంత్రికి వినతిపత్రం అందజేశారు. ఎస్సీ వర్గీకరణను దేశంలోనే తొలిసారిగా తెలంగాణలో అమలు చేస్తున్నందు వల్ల మాదిగలకు మంత్రి పదవులు దక్కాలని వారు విన్నవించినట్లు తెలుస్తోంది. ఎంపీ, ఎమ్మెల్సీ టికెట్ల కేటాయింపులో తమ వర్గానికి న్యాయం జరగలేదని, మంత్రివర్గ విస్తరణలోనైనాసర్దుబాటు చేయాలని కోరినట్లు తెలుస్తోంది. మంత్రివర్గ విస్తరణ చేపడితే బీసీ, ఎస్సీ, ఓసీ, మైనార్టీలకు ఒక్కో పదవి ఇచ్చే అవకాశాలను అధిష్ఠానం పరిశీలిస్తోంది. అయితే, ఒక సామాజికవర్గం నుంచే ఎక్కువ మంది పోటీపడుతుండటంతో వారిలో ఎవరికివ్వాలనే దానిపైనే చర్చలు సాగుతున్నట్లు పార్టీ వర్గాలు వివరించాయి. మొత్తం శాసన సభ్యుల సంఖ్యలో 15 శాతం మాత్రమే మంత్రి వర్గంలోకి తీసుకునేందుకు అవకాశం ఉంటుంది. ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డితోపాటు 12 మంది మంత్రి వర్గంలో ఉన్నారు. మరో ఆరుగురికి మాత్రమే మంత్రి వర్గంలో చోటు దక్కుతుంది. అయితే మంత్రివర్గంలో చోటు కోసం పోటీ పడుతున్న ఎమ్మెల్యేల సంఖ్య చాంతాడంత ఉంది. అందులో ప్రధానంగా బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్, మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమసాగర్ రావు, మక్తల్ ఎమ్మెల్యే వాకటి శ్రీహరి ముదిరాజ్, దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్,డోర్నకల్ ఎమ్మెల్యే రామచంద్రునాయక్ ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్,బీర్ల ఐలయ్య, మంత్రి పదవుల కోసం పోటీ పడుతున్న వారిలో ముఖ్యులుగా ఉన్నారు. పార్టీ వర్గాల నుంచి అందుతున్న సమాచారం మేరకు రెడ్డి సామాజిక వర్గానికి చెంది బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డికి మంత్రి పదవి ఖాయమని చెబుతున్నారు. అదేవిధంగా బిసి సామాజిక వర్గానికి చెందిన మక్తల్ ఎమ్మెల్యే వాకాటి శ్రీహరి ముదిరాజ్‌కు మంత్రి వర్గంలో చోటు గ్యారంటీ అని చెబుతున్నారు. అదిలాబాద్ జిల్లాకు ఒక్క మంత్రి కూడా లేకపోవడంతో మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమసాగర్ రావుకు మంత్రి పదవి ఇవ్వాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కూడా గట్టిగా పట్టుబడుతున్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్‌లో చేరే సమయంలోనూ భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని గెలిపించే సందర్భంలోనూ మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రిని ఇస్తామని ఎఐసిసి హామీ ఇచ్చిందని ప్రచారం. కాగా, సోమవారంసాయంత్రం కాంగ్రెస్‌అగ్రనేత,లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీని మహేశ్‌కుమార్‌గౌడ్ కుటుంబ సమేతంగా కలిశారు. తర్వాత ఆయన మీడియాతో మాట్లాడుతూ రాహుల్‌గాంధీని కుటుంబ సమేతంగా మర్యాదపూర్వకంగా కలిశానని తెలిపారు. తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన కొన్ని అంశాలపై రాహుల్‌కు వివరించినట్లు పేర్కొన్నారు. అయితే వీలైనంత త్వరగా రాష్ట్ర కేబినెట్ విస్తరణ చేయాలని మనవి చేసినట్లు తెలిపారు. త్వరలోనే పూర్తి చేస్తామని రాహుల్‌గాంధీ హామీ ఇచ్చారు... మంత్రివర్గ విస్తరణతో పాటు త్వరలోనే పిసిసి కార్యవర్గ కమిటీల ప్రకటన ఉంటుందని పేర్కొన్నారు.

# 'దెయ్యాల' నేత దేవుడెలా అవుతాడు?

>> ప్రత్యేక రాష్ట్రం వస్తే ఉద్యోగం వస్తుందని, ఫలితంగా గౌరవం కూడా వస్తుందని కోరి కొట్లాడి రాష్ట్ర యువత ప్రత్యేక రాష్ట్రాన్ని తెచ్చుకున్నారని డిప్యూటీ సిఎం తెలిపారు. కోరి తెచ్చుకున్న రాష్ట్రంలో 10 సంవత్సరాల పాటు పాలించిన కెసిఆర్ ఒక్కసారి కూడా గ్రూప్-1 పరీక్ష నిర్వహించలేకపోయారని డిప్యూటీ సిఎం ఎద్దేవా చేశారు. మేము అధికారంలోకి వచ్చిన ఒక్క ఏడాదిలోనే లక్ష ప్రభుత్వ ఉద్యోగాల కలను సాకారం చేశామన్నారు. 57 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని, మరో 30,000 ఉద్యోగాలు ప్రాసెస్లో ఉన్నాయని తెలిపారు. అర్హత ఉండి ఉద్యోగం రాని యువత కోసం 9,000 కోట్లతో రాజీవ్ యువ వికాసం స్వయం ఉపాధి పథకాన్ని తీసుకొని రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. కెసిఆర్ నీకు దుఃఖం ఎందుకు రైతులు పండించిన ధాన్యానికి మద్దతు ధర ఇస్తున్నందుకా, సన్నధాన్యం రైతులకు రూ.500 బోనస్ ఇస్తున్నందుకా అని ప్రశ్నించారు. లక్ష రూపాయల రైతు రుణమాఫీని 10 సంవత్సరాల కాలంలో వాయిదాల పద్ధతిన మాఫీ చేస్తే అది ఆనాడు బ్యాంకు వడ్డీలకే సరిపోయిందని, ఇందిరమ్మ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరంభంలోనే ఒకేసారి 22 వేల కోట్ల రైతు రుణమాఫీ విజయవంతంగా పూర్తి చేశామన్నారు. రైతులే కాదు భూమిలేని కుటుంబాలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పేరిట ప్రతి సంవత్సరం 12 వేల రూపాయలు అందిస్తున్నామని, 2,000 అదనంగా పెంచి రైతు భరోసా ఇస్తున్నందుకు చూడలేక ఫామ్ హౌస్‌లో పడుకున్న కేసీఆర్ కన్నీరు పెడుతున్నారని ఇదెక్కడి న్యాయమని డిప్యూటీ సీఎం ప్రశ్నించారు. ప్రజలు ఆర్థికంగా నిలబడేలా ప్రతి కార్యక్రమం చేపడుతున్నామని, ఇటీవల అచ్చంపేటలో 12,600 కోట్లతో నల్లమల డిక్లరేషన్ చేశామని, ఈ దేశ చరిత్రలో ఎవరు ఇప్పటివరకు ఈ ఆలోచన చేయలేదని డిప్యూటీ సిఎం అన్నారు. అభివృద్ధి పనుల కోసం విచ్చేసిన ఉప ముఖ్యమంత్రిని పలువురు నాయకులు గజమాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఎస్పిడిసిఎల్ సిఎండి ముషారఫ్ అలీ ఫరూఖీ, ట్రాన్స్కో సిఎండి కృష్ణ భాస్కర్, నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్,రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు,నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవి,అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి, వనపర్తి ఎమ్మెల్యే తూడి మెగా రెడ్డి, రాష్ట్ర మైనారిటీ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్, గ్రంథాలయ చైర్మన్ రవీందర్, చైర్మన్, వ్యవసాయ మార్కెటింగ్ చైర్మన్, అచ్చంపేట మున్సిపల్ చైర్మన్, విద్యుత్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పవన్ సినిమాలు ఆపే దమ్మెవరికి?

>> లోని పంపిణీదారులు, ఎగ్జిబిటర్స్ ఏర్పాటు చేసుకున్న మీటింగ్ లో పర్సెంటేజ్ విధానంలో ఆడితే తమకు బాగుంటుందని థియేటర్ ఓనర్స్ చెప్పారు. ఇవాళ యేడాదికి 150 సినిమాలు విడుదలైతే, 90 శాతం పర్సంటేజ్ సిస్టమ్‌లోనే ప్రదర్శితమౌతున్నాయి. కొన్ని సినిమాలే రెంట్ లేదా పర్సంటేజ్‌కు ఆడుతున్నాయన్నారు. ఆ విషయంలోనే ఎగ్జిబిటర్స్ అభ్యంతరం చెబుతున్నారు. ఈస్ట్ గోదావరి ఎగ్జిబిటర్స్ తమ నిర్ణయాన్ని హైదరాబాద్‌లోని ఎగ్జిబిటర్స్‌కు తెలిపారు. దీనిపై ఏప్రిల్ 26న జరిగిన గిల్డ్ మీటింగ్‌లో మేం చర్చించాం. ఆరు నెలల పాటు వారి ఆదాయ వ్యయాలకు సంబంధించిన వివరాలను తెలుసుకుని నిజంగా నష్టం వస్తోందనిపిస్తే, తప్పకుండా వారికి సాయం చేద్దామని మేం అనుకున్నాం. సహజంగా పెద్ద సినిమాలకు మొదటివారం రెంట్ ఇస్తున్నాం. ఆ తర్వాత పర్సెంటేజ్ ఇస్తున్నాం. ఇది కొందరు ఎగ్జిబిటర్స్‌కు నచ్చడం లేదు. మేం ఈ విషయాల గురించి గిల్డ్‌లో మాట్లాడే సమయానికి 'హరిహర వీరమల్లు' రిలీజ్ డేట్ ఫిక్స్ కాలేదు. కాబట్టి ఇది ఆ సినిమా వ్యతిరేకంగా జరిగిన నిర్ణయం అనేది కరెక్ట్ కాదు. ఇక థియేటర్ల విషయానికి వస్తే... నైజాంలో 370 సింగిల్ స్క్రీన్ ఉంటే మాకు, మా మిత్రులకు కలిపి 30 థియేటర్లు ఉన్నాయి. ఏసియన్ ఫిలిమ్స్ సునీల్ నారంగ్, సురేశ్ బాబుకు వాళ్లకు 90 ఉన్నాయి. మిగిలిన వాటిని ఓనర్స్ లేదా వారి సంబంధీకులు నడుపుతున్నారు. మా గిల్డ్ మీటింగ్ తర్వాత తెలంగాణలోని సింగిల్ థియేటర్స్ ఓనర్స్ కూడా పర్సంటేజ్ గురించి శిరీష్‌ను అడిగారు. అతను నా దృష్టికి తీసుకొచ్చారు. ఇదిలా ఉంటే... మే 18న ఎపి, తెలంగాణ ఎగ్జిబిటర్స్ మీటింగ్ పెట్టుకున్నారు. ఆ మీటింగ్ చివరిలో నేను వెళ్లాను. ఆ రోజున మీటింగ్‌లో ఏం జరిగిందో పూర్తిగా తెలుసుకోకుండానే 'జూన్ 1 నుండి థియేటర్స్ బంద్' అనే ప్రచారం మీడియాలో మొదలు పెట్టారు. నిజానికి ఆ సమస్యను ఫిల్మ్ ఛాంబర్ దృష్టికి తీసుకెళ్లమని చెప్పాను. ఎగ్జిబిటర్స్ కూడా త్వరలో జరుగబోయే జాయింట్ కమిటీ మీటింగ్‌లో తమకు అనుకూలంగా నిర్ణయం రాకపోతేనే థియేటర్లు బంద్ చేస్తామని చెప్పారు. కానీ అప్పటికే ఓ నిర్ణయం తీసుకున్నట్టుగా తప్పుడు ప్రచారం అంతటా జరిగిపోయింది. అయితే ఆ తర్వాత నిర్మాతలు, పంపిణీ దారులు జరుపుకున్న మీటింగ్‌లో థియేటర్ల బంద్ చేయకూడదనే నిర్ణయం తీసుకున్నారు. ఎగ్జిబిటర్స్‌తో చర్చలు జరిపి సానుకూల నిర్ణయం తీసుకుందామని భావించారు. ఈ నెల 30న జరిగే ఛాంబర్ ఇసి మీటింగ్ ఓ కమిటీని ఏర్పాటు చేసి తుది నిర్ణయం తీసుకుంటారు' అని దిల్ రాజు తెలిపారు. ఈ మొత్తం వ్యవహారంలో అనవసరంగా 'హరిహర వీరమల్లు' మూవీని లాగారని దిల్ రాజు వాపోయారు. కల్యాణ్ సినిమాను ఆపే దమ్ము ధైర్యం ఎవరికీ లేదని తెలిపారు. సినిమా వాళ్లకు రెండు ప్రభుత్వాలతో పని ఉంటుందని, ఎపిలో ప్రభుత్వం మారిన తర్వాత సినిమా వాళ్లకు చాలా చక్కని యాక్సెస్ లభించిందని ఆయన అన్నారు. ఉత్తరాంధ్రలోనూ తనకు ఇరవై థియేటర్లు ఉన్నాయని చెప్పారు. సినిమా రంగానికి ప్రభుత్వాలతో ఖచ్చితంగా పని ఉంటుందని, రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు మాకు అండగా ఉండాలని కోరుకుంటామని అన్నారు. కొందరు ఆయనకు సరైన సమాచారం ఇవ్వకపోవడం వల్లే పవన్ కల్యాణ్ కోపానికి గురయ్యారని అన్నారు. ఒకవేళ ఆయన తిట్టినా పడతామని, పెద్దన్న స్థానంలో ఉన్న ఆయనకు ఆ హక్కు ఉందని తెలిపారు. సినిమా ఇండస్ట్రీలో ఏకాభిప్రాయం లేని కారణంగానే చాలా సమస్యలు వస్తున్నాయని, తమ గిల్డ్ లోనే కాకుండా... ప్రతి చోట ఈ సమస్య ఉందని దిల్ రాజు ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు నిర్మాతలు సైతం గేమ్ ఛేంజర్ పైరసీని నేనే చేశానంటూ పిచ్చి ప్రేలాపనలు చేశారని, ఎవరైనా తమ సినిమాను తాము చంపుకుంటారా అని దిల్ రాజు అన్నారు.

**ఆస్కార్ నటులు అంటూ బండ్ల గణేశ్ సెటైర్**

అయితే, దిల్ రాజు మీడియా సమావేశం జరుగుతున్న సమయంలోనే మరో ప్రముఖ నిర్మాత బండ్ల గణేశ్ చేసిన ఒక ట్వీట్ ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. 'ఆస్కార్ నటులు, కమలహాసన్లు ఎక్కువైపోయారు. వీళ్ల నటన చూడలేకపోతున్నాం' అంటూ బండ్ల గణేశ్ తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. ఆయన ఈ వ్యాఖ్యలు ఎవరిని ఉద్దేశించి చేశారనే దానిపై స్పష్టత లేనప్పటికీ, దిల్ రాజు ప్రెస్ మీట్ జరుగుతున్న తరుణంలో ఈ ట్వీట్ రావడం ప్రాధాన్యతను సంతరించుకుంది. దీంతో నెటిజన్లు పలు రకాలుగా స్పందిస్తున్నారు. బండ్ల గణేశ్ వ్యాఖ్యలు దిల్ రాజును ఉద్దేశించే కావొచ్చని పలువురు సామాజిక మాధ్యమాల్లో కామెంట్స్ చేస్తున్నారు.

# నోటిఫికేషన్

>> మరోవైపు పంచాయతీ ఎన్నికల నిర్వహణపై సొంత పార్టీ ఎమ్మెల్యేల నుంచి ఒత్తిడి వస్తున్న నేపథ్యంలోఎన్నికల నిర్వహణకు అంతా సిద్ధం చేసి ఉంచాలని సంబంధిత అధికారులకు సిఎం సూచించనట్లుగా సమాచారం. మరోవైపు కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, సన్నబియ్యం, రాజీవ్ యువ వికాసం లాంటి పథకాలు సర్పంచ్ ఎన్నికల్లో కలిసి వస్తాయని అధికార పార్టీ నేతలు భావిస్తున్నారు.

# కవితతో భేటీ

>> సూచన మేరకే వారు కవితతో సమావేశమైనట్లు సమాచారం. కవిత రాసిన లేఖ బయట పడటంతో బిఆర్ఎస్‌లో అంతర్గత విభేదాలు ఉన్నాయన్న విషయం తేటతెల్లమైందని ఇతర రాజకీయ పార్టీల నేతలు విమర్శలు చేశారు. ఆ తర్వాత కెసిఆర్‌తో కెటిఆర్ సమావేశం కావడం ప్రాధాన్యతను సంతరించుకుంది.పార్టీలో కవిత లేఖ అంశంపై ఎవ్వరూమాట్లాడకూడదని కెసిఆర్ ఆదేశాలు ఇచ్చారు. అయినప్పటికీ ఇక కవిత కొత్త పార్టీ పెడుతున్నారన్న ప్రచారం ఊపందుకుంది. కెసిఆర్ దేవుడేఅయినా ఆయన చుట్టూ దయ్యాలున్నాయని, పార్టీలో కోవర్టులు ఉన్నారని ఆమె వ్యాఖ్యలు చేయడంతో ఆమె ఎవరిని ఉద్దేశించి అన్నారన్న విషయం చర్చనీయాంశమైంది. కవిత లేఖ లీక్ కావడంతో కెసిఆర్ కుటుంబంలో విభేదాలు ఏర్పడ్డాయన్న ప్రచారాన్ని బలహీన పరిచేందుకు కెసిఆర్ యత్నిస్తున్నారని తెలుస్తోంది. కుటుంబంలో ఏ విభేదాలు లేవని ఆయన స్పష్టం చేసేందుకే కెసిఆర్ ఎంపీ దామోదరరావును కవిత వద్దకు పంపారని తెలుస్తోంది. సోదరుడు కెటిఆర్, సోదరి కవిత మధ్య ఎలాంటి విభేదాలు లేవని తెలియజేసేందుకు యత్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, తనసోదరుడు కెటిఆర్‌కు ఎసిబి నోటీసులు జారీ చేయడంపై ఆపార్టీ ఎమ్మెల్సీ కవిత తీవ్రంగా స్పందించారు. ఈ నోటీసులను ఆమె తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి, ప్రజా సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికే ఇటువంటి చర్యలకు పాల్పడుతోందని ఆమె ఆరోపించారు.

# విజృంభిస్తున్న కొవిడ్

>> వంటి కొన్ని రాష్ట్రాల్లో ప్రస్తుతం ఎటువంటి కరోనా యాక్టివ్ కేసులు నమోదు కాలేదు. ఆరోగ్య మంత్రిత్వ శాఖ అధికారిక వర్గాలనుంచి అందిన సమాచారం ప్రకారం ఇటీవల పలుశాఖలు వీటి గురించి చర్చించాయి. వాటిలో నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్, ఎమర్జెన్సీ మెడికల్ రిలీఫ్ డివిజన్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ సెల్, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్, సెంట్రల్ గవర్నమెంట్ హాస్పిటల్స్ నిపుణులు ఉన్నారు. డైరెక్టర్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ అధ్యక్షతన ఈ భేటీ జరిగింది. ప్రధానంగా కరోనా వ్యాప్తి గురించి వీరు చర్చించారు. రాష్ట్రాలవారీ డేటా గురించి మాట్లాడుకుంటే ప్రస్తుతం కేరళ అత్యంత కరోనా ప్రభావిత రాష్ట్రంగా ఉంది. కేరళలో 430 యాక్టివ్ కరోనా కేసులు నమోదయ్యాయి. ఈ రాష్ట్రాల్లో ఆరోగ్య శాఖ పర్యవేక్షణ, చికిత్స ప్రక్రియ కొనసాగుతోంది.

## వారం - వర్జ్యం

తేది : 27-05-2025, మంగళవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
వైశాఖ మాసం, ఉత్తరాయణం,
వసంత ఋతువు,
అమావాస్య ఉ.8.33
శుక్ల పాడ్యమి తె.5.03
రోహిణి రా.2.51
వర్జ్యం ఉ.7.55-9.21
దు.ఉ.8.11-9.03, 2) రా.11.48-12.40
రాహుకాలం - మ.3.00-4.30

## వార్తాఫలం

**మేషం :** వ్యవహారాలలో విజయం సాధిస్తారు. సభలు, సమావేశాలలో చురుకుగా పాల్గొంటారు. వస్తు సేకరణ.

**వృషభం :** సంఘంలో మీ మాటకు విలువ పెరుగుతుంది. విందు వినోదాలలో చురుకుగా పాల్గొంటారు. వాహనసౌఖ్యం.

**మిథునం:** ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది. వ్యవహారాలలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి.

**కర్కాటకం:**అనుకోని ఖర్చులు పెరుగుతాయి. మిత్రులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు. సోదరుల కలయిక.

**సింహం:** ఆర్థిక ఇబ్బందులు ఎదురై చికాకులు పెడుతాయి. ఋణబాధలు తప్పవు. ఆరోగ్యంపట్ల మెలుకువ అవసరం.

**కన్య :** ప్రయాణాలు లాభిస్తాయి. ప్రముఖుల నుండి కీలక సమాచారం అందుకుంటారు. వస్తు సేకరణ.

**తుల :** ఆస్తి వివాదాలు తీరి నూతన ఒప్పందాలు కుదురుతాయి. దూరప్రాంతాల నుండి శుభ ఆహ్వానాలు అందుతాయి.

**వృశ్చికం:** ఆకస్మిక ప్రయాణాలలో నూతన పరిచయాలు పెరుగుతాయి. వ్యవహారాలలో నిదానం అవసరం.

**ధనుస్సు:** గృహనిర్మాణ ఆలోచనలు నిదానంగా కార్యరూపం దాలుస్తాయి. కొత్త మిత్రుల పరిచయాలు పెరుగుతాయి.

**మకరం:** సంఘంలో ఆదరణ పొందుతారు. బాకీలు వసూలవుతాయి. వృత్తి, వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి.

**కుంభం:** అనుకోకుండా వచ్చిన అవకాశాలు చేజారతాయి. ఖర్చులు పెరుగుతాయి. ఋణవత్తిడులు తప్పవు.

**మీనం :** భూవివాదాలు తీరిన తన ఒప్పందాలు కుదురుతాయి. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్


సోమవారం రాష్ట్రపతి భవన్‌లో ఏర్పాటైన చిత్రకళల ప్రదర్శన తిలకిస్తున్న రాష్ట్రపతి ముర్ము

# రేపు విచారణకు రండి

>> రింగ్ ద్వారా రేవంత్‌రెడ్డి పేరును ఇడి ఛార్జిషీట్‌లో నమోదు చేసిందని, 24గంటల తర్వాత ప్రధాని మోదీతో సన్నిహితంగా కనిపించారని వెల్లడించారు. బిజెపి నేత ఏం మాట్లాడకపోవడంతోనే రెండు పార్టీల నడుమ అవగాహన, అనైతిక సంబంధానికి నిదర్శమన్నారు. అయితే త్వరలోనే ఏ2గా ఉన్న అప్పటి మున్సిపల్ శాఖ ప్రభుత్వ ప్రత్యేక ప్రధానకార్యదర్శిగా ఉన్న అర్వింద్‌కుమార్‌కు రెండోసారి ఇచ్చేందుకు సన్నద్ధం చేసినట్లు తెలుస్తుంది. తాను ఎలాంటి ఉల్లంఘనలకు పాల్పడలేదని, కెటిఆర్ ఆదేశాల మేరకే నిధులు చెల్లింపులు జరిగాయని గతంలో పేర్కొన్నారు. ఇవన్నీ తెలిసిన ఆయన సూచనల మేరకు విధులు నిర్వహించామని, తన భాగస్వామ్యమేమి లేదని అధికారులకు చెప్పినట్లు తెలుస్తోంది. ఈయనకు రెండోసారి నోటీసు పంపించనున్నారు. ఈ-కారు రేసులో నిబంధనలకు విరుద్ధంగా విదేశీ సంస్థకు రూ.54.88 కోట్ల నిధులు మళ్లించడంతో ప్రభుత్వానికి కోట్లలో నష్టంవాటిల్లిందని గతేడాది ఓ ప్రభుత్వ అధికారి ఫిర్యాదు చేసింది తెలిసిందే. దీంతో ఏసీబీ రంగంలోకి దిగి విచారణ ప్రారంభించింది. ప్రధాన నిందితుడిగా కేటీఆర్ పేరును చేర్చగా ఏ2గా అర్వింద్‌కుమార్, ఏ3గా హెచ్‌ఎండిఎ అప్పటి చీఫ్ బీఎల్ఎన్‌రెడ్డిలు ఉన్నారు. మాజీ మంత్రి ప్రతిపాదనలతో నిర్వహణ జరగడంతో ఆయనకు మరోసారి నోటీసులు ఇచ్చారు.

# మధ్యప్రదేశ్‌కు గిడుగు రుద్రరాజు, ప్రసాద్, సంపత్ కుమార్ , హర్యానాకు వంశీచంద్ నియామకం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మే26:** ఎఐసిసి పరిశీలకులుగా ఎపి, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన కాంగ్రెస్ నేతలకు అవకాశం దక్కింది. మధ్యప్రదేశ్, హర్యానాలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుల ఎంపికకు ఏఐసీసీ పరిశీలకులుగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ నుంచి నలుగురిని నియమించారు. ఆంధ్రప్రదేశ్ నుంచి గిడుగు రుద్రరాజు, సిరివెళ్ళ ప్రసాద్, తెలంగాణ నుంచి సంపత్ కుమార్, వంశీచంద్ రెడ్డిని పరిశీలకులుగా నియమిస్తూ ప్రకటనను వెల్లడించారు. మధ్యప్రదేశ్‌కు 50 మంది, హర్యానాకు 21 మంది ఏఐసీసీ పరిశీలకులను నియమించగా.. ఇందులో ఏపీ, తెలంగాణ నుంచి మధ్యప్రదేశ్‌కు ముగ్గురు, హర్యానాకు ఒక్కరు పరిశీలకులుగా అవకాశం దక్కింది.ఏపీ నుంచి సీడబ్ల్యూసీ సభ్యులుగా ఉన్న గిడుగు రుద్రరాజు, సిరివెల్ల ప్రసాద్‌లను మధ్యప్రదేశ్‌కు పరిశీలకులుగా ఎంపిక చేయగా, తెలంగాణ నుంచి ఏఐసీసీ కార్యదర్శిగా ఉన్న సంపత్ కుమార్‌కు అవకాశం లభించింది.అలాగే హర్యానాకు తెలంగాణ నుంచి వంశీ చంద్ రెడ్డిని పరిశీలకులుగా నియామించారు.

# కెటిఆర్‌కు అండగా నిలుస్తాం: హరీశ్‌రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మే26:** బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌కు ఎసిబి నోటీసులు ఇవ్వడంపై మాజీ మంత్రి హరీశ్‌రావు సైతం స్పందించారు. ప్రతీకార రాజకీయాలు రేవంత్‌రెడ్డి అభద్రతా భావానికి స్పష్టమైన సంకేతాలని.. కల్పిత కేసులు న్యాయస్థానాల్లో నిలువవు.. ప్రజామోదాన్ని పొందవని హరీశ్‌రావు పేర్కొన్నారు. కెటిఆర్‌కు అండగా నిలుస్తామని ట్విట్ చేశారు.

# రాష్ట్రంలోకి నైరుతి ఎంట్రీ.. నేటి నుండి భారీ వర్షాలు

**హైదరాబాద్, మే 26, ప్రభాతవార్త:** తెలంగాణలోని కొన్ని ప్రాంతాల్లో నైరుతి రుతుపవనాలు ప్రవేశించాయి. రాబోయే రెండు రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రాంతాలకు రుతుపవనాలు విస్తరించ నున్నాయి. దీంతో ఈ నెల 27 పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో అల్పపడనం ఏర్పడి, నైరుతి రుతు పవనాలు చురుగ్గా కదులుతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. పలు జిల్లాలకు హెచ్చరికలు జారీ అయ్యాయి. ప్రస్తుతం ఉత్తర తెలంగాణ వరకు కొనసాగుతున్న ద్రోణి కారణంగా వర్షాలు కురుస్తున్నాయని వెల్లడించింది.

# మళ్లీ బిఆర్ఎస్‌లోకి వెళ్తా..

## కాంగ్రెస్‌కు మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప షాక్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మే26:** కాంగ్రెస్ పార్టీకి సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప షాకిచ్చాడు. కాంగ్రెస్ పార్టీతో కోనప్ప తెగతెంపులు చేసుకున్నారు. కాంగ్రెస్‌కు దూరంగానే ఉన్నానని.. దూరంగానే ఉంటానని, రాజీనామా చేయాల్సిన అవసరం లేదని ఆయన చెప్పారు. ఈ మేరకు మీడియాతో మాట్లాడుతూ.. ఏ పార్టీ లోకైనా వెళ్తా కానీ.. కాంగ్రెస్‌లోకి మాత్రం పోనని స్పష్టం చేశారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం కాంగ్రెస్‌లో చేరానని.. కానీ, కాంగ్రెస్ 16 నెలల పాలనలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని విమర్శించారు. మాజీ సిఎం కెసిఆర్ దేవుడు అని ఇదివరకే తాను చెప్పానని, ఆయనకు పాదాభివందనాలని కాంగ్రెస్ పార్టీలో చేరిన రోజే చెప్పానని కోనప్ప అన్నారు. తనను వ్యక్తిగతంగా దూషించిన వ్యక్తిని పార్టీలో తీసుకునేటప్పుడు చెప్పలేదనే బిఆర్ఎస్ నుంచి బయటికి వచ్చానని, రాజకీయంగా బిఆర్ఎస్, కెసిఆర్ కుటుంబంతో తనకు ఎలాంటి విభేదాలు లేవని అన్నారు. తాను మళ్లీ బిఆర్ఎస్ పార్టీలోకి వెళ్తాను కానీ కాంగ్రెస్ పార్టీలోకి మాత్రం వెళ్లను కోనప్ప చెప్పారు.

# కోటాలో మరో విద్యార్థిని ఆత్మహత్య

**హైదరాబాద్, మే 26, ప్రభాతవార్త:** రాజస్థాన్‌లోని కోటాలో నీట్‌కి కోచింగ్ తీసుకుంటున్న మరో విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. దీంతో ఈ ఏడాది ఇప్పటి వరకు సుమారు 15 మంది విద్యార్థులు కోటాలో ఆత్మహత్యకు పాల్పడ్డారు. జమ్ముకశ్మీర్‌కు చెందిన జీషన్ అనే విద్యార్థిని కోటాలోని ప్రతాప్ చౌరహా అనే ప్రాంతంలోని హాస్టల్‌లో పేయింగ్ గెస్ట్‌గా ఉంటూ వైద్య విద్య ప్రవేశ పరీక్ష అయిన నీట్‌కు ప్రిపేర్ అవుతుంది. ఆదివారం సాయంత్రం తానుంటున్న రూమ్‌లోనే ఉరివేసుకుని బలవన్మరణం చెందింది. అంతకుముందు తన బంధువులతో ఫోన్‌లో మాట్లాడిందని, తాను చనిపోతున్నానని చెప్పిందని పోలీసులు వెల్లడించారు. బంధువులతో మాట్లాడిన విషయాన్ని అదే బిల్డింగ్‌లో పైఅంతస్తులో ఉంటున్న మమత అనే మరో విద్యార్థినికి విషయం చెప్పారని తెలిపారు. ఆమె జీషన్ గదికి వెళ్లి చూడగా అప్పటికే తలుపులు లాక్ చేసుకుందని.. మమత గట్టిగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి వాటిని బద్దలుకొట్టారని, అయితే అప్పటికే ఆమె సీలింగ్ ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించిందని పోలీసులు వెల్లడించారు. దీంతో వారు జీషన్‌ను హుటాహుటిన హాస్పిటల్‌కి తరలించారని అప్పటికే మరణించినట్లు డాక్టర్లు చెప్పారని తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. ఈ ఏడాదిలో ఇప్పటివరకు కోటాలో 15 మంది విద్యార్థులు చనిపోగా, ఈ నెలలోనే ఇది రెండో మరణం కావడం విషాదం.

# మోడీని ఢీకొంటే ఫలితం చూపించాం

>> లకు హాని కలిగించేవారు లేదా ఉగ్రవాదాన్ని వ్యాప్తి చేసేవారు మట్టిలో కలవాల్సిందేనని వార్నింగ్ ఇచ్చారు. పహల్గామ్ ఘటన దేశాన్ని కదిలించింది. కఠినమైన చర్య తీసుకోవాలని అంతా డిమాండ్ చేశారని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఏప్రిల్ 22న, దాడి చేసిన వారిని ఆపరేషన్ సిందూర్‌తో మట్టిలో కలిపేశామన్నారు. సైన్యానికి స్వేచ్ఛా హస్తం ఇచ్చామని, దశాబ్దాలుగా ప్రపంచం చూడనిది తాము సాధించి చూపించామన్నారు. మహిళల సిందూరాన్ని తొలగించే ధైర్యం చేయండి, ఇక మీ పరిస్థితి ఎలా ఉంటుందో చూపిస్తాం అంటూ, ప్రధాని మోడీ పాకిస్తాన్, ఉగ్రవాదులను హెచ్చరించారు. పాకిస్తాన్ ఏకైక లక్ష్యం భారత్‌ను ద్వేషించడం. మనకు హానికలిగించాలన్న మార్గాలపైనే ఆలోచిస్తోందని మండిపడ్డారు. కానీ మన దేశం మాత్రం దేశంలోని పేదరికాన్ని నిర్మూలించి ఆర్థికవృద్ధి సాధించే లక్ష్యంతోముందుకువెళుతున్నదన్నారు. దహోద్‌లో రూ.24వేలకోట్ల విలువైన అభివృద్ధిపనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసారు. అనంతరం జరిగిన సభలో ప్రధాని మాట్లాడారు. దేశవిభజన తర్వాత ఏర్పాటయిన పాకిస్థాన్ భారత్‌పట్ల ద్వేషంలో బతుకుతోందని, మనకు హానిచేయాలనే నిరంతరం తపనపడుతోందన్నారు.

**మే 26.. చాలా ముఖ్యమైన రోజు**

11 ఏళ్ల క్రితం 2014లో ఇదే రోజు ప్రధాని పగ్గాలు చేపట్టానని ప్రధాని మోదీ పేర్కొన్నారు. తన రాజకీయ ప్రయాణంలో మే 26ని ఒక ముఖ్యమైన రోజని పేర్కొన్నారు. 2014లో ఇదే తేదీన తాను తొలిసారి ప్రధానమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశానని ఆయన గుర్తు చేసుకున్నారు. ఈ రోజు మే 26. 2014లో ఇదే తేదీన, నేను మొదటిసారి ప్రధానమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశానని మొదట, గుజరాత్ ప్రజలు నన్ను ఆశీర్వదించారు, తరువాత కోట్లాది మంది భారతీయులు నన్ను ఆశీర్వదించారు. అంటూ మోడీ పేర్కొన్నారు. వడోదర తర్వాత దాహోద్‌కు వెళ్లిన ప్రధాని, భారతీయ రైల్వేలకు కొత్త గిఫ్ట్ ఇచ్చారు. దాహోద్‌లో రైలు ఇంజిన్ల తయారీ కర్మాగారాన్నిదేశానికి అంకితం చేశారు ప్రధాని మోడీ. ఈ ప్లాంట్‌లో తయారైన తొలి ఎలక్ట్రిక్ రైల్ ఇంజిన్‌కు ప్రధాని పచ్చజెండా ఊపారు.



సమావేశంలో మాట్లాడుతున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

# సంస్కృతి, సంప్రదాయాలు దేశ గొప్పతనాన్ని చాటుతాయి

**ఐఐటి హైదరాబాద్‌లో స్పిక్ మకాయ్‌లో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ**

**కంది, మే 26, ప్రభాతవార్త:** భారతదేశంలో ఉన్న సంస్కృతి, సంప్రదాయాలు ప్రపంచానికి తమ గొప్పతనాన్ని చాటేలా చేస్తున్నాయని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. సోమవారం సంగారెడ్డి జిల్లా మండల కేంద్రమైన కందిలోని కంది ఐఐటి హైద్రాబాద్‌లో స్పిక్ మకాయ్ 10వ అంతర్జాతీయ సాంస్కృతిక, సంగీత సదస్సు ని (ఈ నెల 26 నుంచి జూన్ 1 వరకు కొనసాగే) ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర గవర్నర్ ప్రారంభించి ప్రసంగించారు. శాస్త్రీయ నృత్యాలు, సంగీత, క్రమ శిక్షణకు మారుపేరుగా నిలిచే యువత బాగోగులకు దోహద పడతాయ న్నారు. దేశ సంస్కృతిలో భాగంగా ఉన్న వేదాలు, ఉపనిషత్తులు, శాస్త్రీయ విలువల మేళవింపు తోనే వన దేశం ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందుతుందన్నారు. ఒక్కో సంస్కృతికి ఒక ప్రాధాన్యత సంతరించుకుని ఉంటుందని, ఏ కళా వృత్తిలోనైనా గురు శిష్య సంబంధాలు కీలకంగా మారుతాయన్నారు. ఒక శాస్త్రీయ సంగతం కాని, ఇతర శాస్త్రీయ నృత్యాలు కానీ నేర్చుకోవాలంటే గురుతర బోధన చాలా అవసరమని గుర్తు చేశారు.

హిందుస్తానీ సంగీతానికి ప్రపంచ వ్యాప్తంగా ఎంతో కీర్తి కలిగి ఉండటం గొప్ప విషయం అన్నారు. తన సొంత ప్రాంతమైన త్రిపురకు చెందిన హోజాగిరి నృత్య ప్రదర్శన ఇక్కడ చేయడం తనను ఎంతగానో ఆకట్టుకుందని సంబరపడ్డారు. ఇంతటి గొప్ప సాంస్కృతిక కార్యక్రమాన్ని ఐఐటీ హైద్రాబాద్ వేదికగా స్పిక్ మోకా యి ఆధ్వర్యంలో నిర్వహిం చడం అభినందనీయమన్నారు. యువ తను సంప్రదాయ సంగీతం వైపు అడుగులు వేసేలా కృషి చేస్తున్న స్పిక్ మేకాయి సంస్థను గవర్నర్ అభినందనలు తెలిపారు.

**ఒదిగి ఉండే స్వభావాన్ని నేర్పుతుంది: కలెక్టర్ క్రాంతి**

క్రమశిక్షణ ఉంటే ఎంత ఎత్తు ఎదిగినా ఒదిగి ఉండే స్వభావాన్ని అలవర్చు కునే వీలు కల్గుతుందని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అన్నారు. కరీంనగరలో మున్సిపల్ కమీషనర్‌గా విధులు నిర్వహిస్తున్న తరుణంలో తను కూచిపూడి నృత్యాన్ని నేర్చుకున్నానని, కూచి పూడి నృత్యం నేర్చుకోవడం తోనే తను ఎంత ఎత్తుకు ఎదిగినా (జిల్లా కలెక్టర్‌గా విధులు నిర్వహి స్తున్నా) ఒదిగి ఉండే స్వభావం అలవడిందని గుర్తు చేసుకున్నారు. శాస్త్రీయ, సంస్కృతి విలువల ద్వారా గురువలకు, దేవుడికి భూమతకు కృతజ్ఞతలు తెలుపు కునే అవకాశం పరోక్షంగానే కలు గుతుందని కలెక్టర్ వల్లూరు క్రాంతి వివరించారు. ఐఐటీ హైద్రా బాద్ డైరెక్టర్ బీఎస్ మూర్తి, పద్మ విభూషణ్ పండిట్ హరిప్రసాద్ చౌరాసియా, పద్మభూషణ్ డాక్టర్ రాజంలతోపాటు 200 మంది సంగీత ప్రముఖులు పాల్గొన్నారు.

# అణ్వాయుధాలను పెంచుతున్న చైనా

## భారత్‌కు పొంచి ఉన్న అణుముప్పు

**న్యూఢిల్లీ, మే 26:** భారత్, తైవాన్‌లతో తరచూ కయ్యానికి కాలుదువ్వుతున్న చైనా తన సైనిక ఆధునీకరణను వేగంగా పెంచుతోందని అమెరికా రక్షణ గూఢచార సంస్థ నివేదిక వెల్లడించింది. ఇందులో భాగంగానే 2030 నాటికి కనీసం 1000 అణ్వా యుధాలను కలిగి ఉంటుందని ఈ నివేదిక తెలిపింది. ఈ నివేదిక ప్రకారం భారత్ చైనాను ప్రాథమిక ప్రత్యర్థిగా చూస్తోందని వివరించింది. అయితే చైనాకు దీటుగా భారత్ కూడా బలోపేతం కావడంపై దృష్టి పెట్టింది. చైనాను ఎదుర్కోవడానికి, తన సొంత సైనిక శక్తిని పెంచుకోవడానికి భారత్ తన రక్షణ ప్రాధాన్యతలపై దృష్టి సారించిందని ఆ నివేదిక పేర్కొంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రక్షణ ప్రాధాన్యతలు ప్రపంచ నాయకత్వాన్ని చాటడం చైనాను ఎదుర్కోవడం, భారత సైనిక శక్తిని పెంచుకోవడంపై దృష్టి సారించాయని తెలిపింది. అదే సమయంలో పాకిస్థాన్‌ను అనుబంధ భద్రతా సమస్యగా భారత్ పరిగణిస్తున్నట్లు నివేదిక వెల్లడించింది. తైవాన్‌ను బలవంతంగానా స్వాధీనం చేసుకోవడానికి చైనా తన సామర్థ్యాలను మరింత అభివృద్ధి చేస్తోంది.. అమెరికా నివేదిక తెలిపింది. తైవాన్, ఫిలిప్పీన్స్ వంటి దేశాలపై అన్ని రకాలుగా ఒత్తిడి తీసుకువచ్చేందుకు చైనా ముమ్మరంగా పనిచేస్తోందని నివేదిక పేర్కొంది. భారత్‌చైనా సరిహద్దులోని తూర్పు లడఖ్ వాస్తవాధీన రేఖ వెంబడి గత ఏడాది బలగాల ఉపసంహరణ ప్రక్రియ జరిగింది. అయితే ఇది సరిహద్దు వివాదాన్ని పూర్తిగా పరిష్కరించలేదని.. కాని 2020లో జరిగిన గల్వాన్ ఘర్షణల ఉద్రిక్తతలను మాత్రమే తగ్గించిందని నివేదిక పేర్కొంది. చైనా అణు వార్‌హెడ్ల నిల్వ 600కి పైగా పెరిగిందని.. ఇది 2030 నాటికి 1000కి పైగా అణ్వాయుధాలు ఉంటాయని అమెరికా నివేదిక అంచనా వేసింది.

తక్కువ దిగుబడి, కచ్చితమైన స్ట్రైక్ క్షిపణులు, మల్టీ మెగాటన్ దిగుబడులతో కూడిన ఖండాంతర బాలిస్టిక్ క్షిపణులతో పాటు మరింత వైవిధ్యమైన అణు శక్తిని సాధించడమే చైనా సైన్యం లక్ష్యమని నివేదిక వివరించింది. అదే సమయంలో తైవాన్‌పై సైనికచర్య చేపట్టి.. బలవంతంగా చైనాలో కలిపేసుకోవడం.. దానికి స్వాతంత్ర్యం ఇవ్వకుండా అడ్డుకోవడం, తైవాన్ రక్షణ పట్ల అమెరికా నిబద్ధతను పరీక్షించడం వంటి దీర్ఘకాలిక లక్ష్యాలను సాధించడానికి తైవాన్‌పై దౌత్య, సమాచార, సైనిక, ఆర్థిక ఒత్తిడి ప్రచారాలను కొనసాగించే అవకాశం ఉందని అమెరికా నివేదిక తేల్చి చెప్పింది.



# ఎస్ఐబి మాజీ చీఫ్ ప్రభాకర్‌రావుకు అమెరికాలో చుక్కెదురు

## రాజకీయ ఆశ్రయం అభ్యర్థనను తిరస్కరించిన అమెరికా

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 26:** తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసు కుంది. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న ఎస్ఐబి మాజీ చీఫ్ ప్రభాకర్‌రావుకు అమెరికాలో చుక్కెదురైంది. ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక సూత్రధారైన ప్రభాకర్ రావు అమెరికాలో ఉంటున్న సంగతి తెలిసిందే. దీంతో అతన్ని ఇండియాకు రప్పించేందుకు తెలంగాణ పోలీసులు ప్రయత్నిస్తున్నారు. ఇందులో భాగంగా కేంద్ర సహకారం తీసుకున్న రాష్ట్ర పోలీసులు.. ప్రభాకర్ రావును రప్పించేందుకు ఇప్పటికే రెడ్ కార్నర్ నోటీసులు జారీ చేశారు. ఈ క్రమంలో ప్రభాకర్ రావు అమెరికా కోర్టును ఆశ్రయించాడు. రాజకీయ కక్షలో భాగంగా తనపై కేసులు పెట్టారని.. కాబట్టి, తనను రాజకీయ శరణార్థిగా గుర్తించాలని వేసిన పిటిషన్‌ను కోర్టు తోసిపుచ్చింది. ఇదిలా ఉండగా, ఈ కేసు విచారణలో భాగంగా జూన్ 20వ తేదీలోగా తమ ఎదుట హాజరుకావాలని తెలంగాణ పోలీసులు ప్రభాకర్‌రావుకు గతంలోనే నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఆయన పోలీసుల విచారణకు సహకరించక పోవడంతో, ఆయన్ను పరారీలో ఉన్న నేరస్థుడిగా (ప్రకటిత నేరస్థుడు) ప్రకటించాలని కోరుతూ సిట్ అధికారులు నాంపల్లి కోర్టును ఆశ్రయించారు. దీనికి న్యాయస్థానం కూడా సానుకూలంగా స్పందించింది. జూన్ 20వ తేదీలోగా దర్యాప్తు అధికారి ముందు హాజరుకావాలని న్యాయస్థానం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు పోలీసులు ఆయన ఇంటి గోడకు నోటీసులు కూడా అంటించారు. నిర్దేశిత గడువులోగా హాజరుకాని పక్షంలో, ఆయన్ను పరారీలో ఉన్న నేరస్థుడిగా ప్రకటిస్తామని నాంపల్లి కోర్టు హెచ్చరించింది. ఒకవేళ అలా ప్రకటిస్తే, ప్రభాకర్‌రావుకు సంబంధించిన ఆస్తులను జప్తు చేసే అధికారం దర్యాప్తు సంస్థలకు లభిస్తుంది. ప్రస్తుతం అమెరికాలో ఉన్న ప్రభాకర్‌రావును తిరిగి భారతదేశానికి రప్పించేందుకు పోలీసులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఇందుకోసం అమెరికాకు చెందిన హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ అధికారుల సహాయం తీసుకుంటున్నారు. ప్రభాకర్‌రావును విచారిస్తే ఈ కేసులో మరిన్ని కీలక విషయాలు వెలుగులోకి వస్తాయని దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు.

# ప్రెస్ కౌన్సిల్ పేరును ఉపయోగించ వద్దు

## ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సెక్రటరీ శుభాగుప్తా

**హైదరాబాద్, మే 26, ప్రభాతవార్త :** ప్రెస్ కౌన్సిల్ పేరును వ్యక్తులు, సంస్థలు ఉపయోగించ కూడదని ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సెక్రెటరీ శుభా గుప్త ఒక ప్రకటనలో తెలిపారు. ఉల్లంఘనలు జరగకుండా చూడాలని ఈ మేరకు అన్ని రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులకు లేఖ రాశారు. ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా కార్యాలయం న్యూ ఢిల్లీ లోని లోధి రోడ్, సిజివో కాంప్లెక్స్‌లోని సోచా భవన్‌లో ఉందన్నారు. ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు ఏ రాష్ట్రంలో కూడా బ్రాంచ్ లేదన్నారు. అంతే కాకుండా ప్రెస్ కౌన్సిల్ సూచించే పేరును వినియోగించుకునేందుకు కూడా ఎవరికి అనుమతి లేదని. దీనికి సంబంధించి ఎటువంటి ఉత్తర్వులు జారీ చేయలేదన్నారు. ప్రెస్ కౌన్సిల్ (ప్రెస్ పరిషత్) పదాన్ని, పేరును , దానిని సూచించే విధంగా గాని వ్యక్తులు, ఇతర ప్రెస్ సంస్థలు వాడకూడదన్నారు. ప్రెస్ కౌన్సిల్‌ను సూచించే పదాన్ని కేంద్ర ప్రభుత్వ అనుమతి లేకుండా ఏ ఇతర సంస్థ కూడా వినియోగించ కూడదని, కేంద్ర న్యాయ వ్యవహారాల మంత్రిత్వ శాఖ కూడా అభిప్రాయ పడినట్లు తెలిపారు. ఒక వేళ ఎవరైనా ప్రెస్ కౌన్సిల్ పదాన్ని వినియోగిస్తే ప్రివెన్షన్ ఆఫ్ ఇమ్‌ప్రాపర్ యాక్ట్ 1950ని ఉల్లంఘించినట్లు అవుతుందన్నారు. అంతే కాకుండా ప్రెస్ కౌన్సిల్ పేరును ఇతర సంస్థలు, వ్యక్తులు వినియోగిస్తే ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ప్రతిష్టకు భంగం వాటిల్లుతుందన్నారు. అంతే కాకుండా ప్రెస్ కౌన్సిల్ పేరుతో స్థానిక సంస్థలు, ప్రభుత్వ అసోసియేషన్లలో రిజిస్ట్రేషన్ జరగకుండా నిషేదం విధిస్తూ తగు ఉత్తర్వులు జారీ చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులకు ఆయన సూచించారు.

# పిల్లల కళ్లముందే తల్లి దుర్మరణం

## కదులుతున్న రైలు ఎక్కబోతుండగా ప్రమాదం





**హైదరాబాద్, మే 26, ప్రభాతవార్త:** రైలు బోగీ మారేందుకు యత్నించిన ఓ మహిళ ప్రమాదవశాత్తూ రైలు, ప్లాట్‌ఫాం మధ్య పడిపోయి ప్రాణాలు కోల్పో యింది. చర్లపల్లి రైల్వేస్టేషన్‌లో కన్నపిల్లల కళ్ల ముందే ఆ తల్లి రైలు బోగీ నుంచి ప్రమాదవశాత్తూ జారిపడి మృతి చెందిన ఘటన ఆదివారం చర్లపల్లి రైల్వేస్టేషన్లో విషాదాన్ని నింపింది. సికిందరాబాద్ రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపిలోని అనకాపల్లి జిల్లా దొండపూడికి చెందిన మట్ట వెంకటేశ్, శ్వేత (33) దంపతులు. నగరంలో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్న వెంకటేశ్ తన భార్య శ్వేత, ఇద్దరు పిల్లలతో కలిసి లింగంపల్లి హెచ్ఎంటీ టౌన్‌షిప్ చింతల్ చంద్రానగర్‌లో నివాసం ఉంటున్నారు. వేసవి సెలవులు పూర్తవుతున్న క్రమంలో కొద్దిరోజులు శ్వేత తన ఇద్దరు పిల్లలతో దొండ పూడిలో గడిపి రావాలనుకుంది. ఇందుకోసం భర్త వెంకటేశ్ ఆన్‌లైన్ టికెట్ కొనుగోలు చేశాడు. ఆదివారం ఉదయం భార్య, పిల్లలను లింగంపల్లి రైల్వే స్టేషన్ తీసుకువచ్చిన వెంకటేశ్ జన్మభూమి ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కించి డీ-3 బోగీలోని సీట్లలో కూర్చోబెట్టాడు. సీట్ నంబర్ సరిగా ప్రింట్ కాక పోవడంతో.. వీరు డి-8 బోగిలో ఎక్కాల్సి ఉండగా పొరపాటుగా డి-3లో ఎక్కారు. రైలు లింగంపల్లి స్టేషన్‌కు చేరాక..వేరే ప్రయాణికులు వచ్చి తమ సీట్లు అని చెప్పడంతో ఆమె విషయాన్ని గుర్తించారు.

తన వద్ద ఉన్న టికె టును మరోసారి సరిచూసుకోగా తన బోగీ డి-8గా గుర్తించింది శ్వేత. రైలులో రద్దీ ఎక్కువగా ఉండడంతో 3-డి నంబరు బోగీ నుంచి 8-డి నంబర్ బోగీ వరకు బోగీల మార్గం నుంచి వెళ్లడం సాధ్యం కాలేదు. బోగిలో రద్దీ ఉండటంతో ఆమె చర్లపల్లి స్టేషన్‌లో రైలు దిగి ఇద్దరు పిల్లలతో పాటు డి-8 బోగీ వద్దకు చేరుకున్నారు. పిల్లల ను, లగేజీని హుటా హుటిన బోగీ లోకి ఎక్కించి తాను ఎక్కేందుకు ఉపక్రమి స్తున్న సమయంలోనే రైలు కదులుతూ వేగం పుంజుకుంది. దీంతో కాలుజారి కిందపడిన శ్వేత బోగీకి ప్లాట్‌ఫామ్ మధ్యలో ఇరుక్కుపోయి తీవ్ర గాయాలపాలై పట్టాల పక్కన పడిపోయింది. ప్రమాదాన్ని గుర్తించిన ప్రయాణికులు, పోలీసులు ఆమెను రక్షించే ప్రయత్నం చేస్తుండగానే అప్పటికే మృతి చెందింది. తమ కళ్లెదుటే తల్లి చనిపోవడంతో పిల్లలు బోరున విలపిస్తూ తల్లడిల్లిపోయారు. సమాచారం అందుకుని ఘటన స్థలానికి చేరు కున్న భర్త వెంకటేశ్ కన్నీరుమున్నీరుగా విలపించాడు. ఆన్లైన్ టికెట్లో ప్రింట్ సరిగా పడని కారణంతోనే తన భార్య రైలు ప్రమాదానికి బలైందన్నాడు. శ్వేత మృతదేహానికి గాంధీ మార్చురీలో పోస్టుమార్టం నిర్వహించారు.

# పంచాయతీ కార్యదర్శుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలం

## పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్క

**హైదరాబాద్, మే 26, ప్రభాతవార్త:** పంచాయతీ కార్యదర్శులు సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా ఉందని పంచాయితీరాజ్‌శాఖ మంత్రి సీతక్క అన్నారు. సోమవారం ఆమె సచివాలయంలో పంచాయితీరాజ్ కార్యదర్శుల సంఘం నేతలతో ఆమె సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వం అవలంభించిన విధానాలతో కార్యాదర్శులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని ఆమె అన్నారు. 2019లో పంచాయితీ కార్యదర్శుల నియమించేటప్పుడే మొదట 3 సంవత్సరాలు ప్రొహిబిషన్ అన్నారని, తర్వాత మరో ఏడాది పెంచినట్లు తెలిపారు. మీరు జాయిన్ అయిన మొదటి రోజు నుంచే సర్వీసును పరిగణలోకి తీసుకోవాలంటే ఏన్నో న్యాయపరమైన సమస్యలు ఉన్నాయని, అయినా మీకు న్యాయం చేసేందుకు ప్రభుత్వం సిద్దంగా ఉన్నట్లు తెలిపారు. ముందస్తు అనుమతి లేకుండా కొంత మంది పంచాయితీ కార్యదర్శులు నెలల తరబడి గైర్హాజరు అవుతున్నారని, ఆయిన కూడా వారిని సర్వీసు నుంచి తొలగించలేదన్నారు. 1038 మంది ఔట్ సోర్సింగ్ పంచాయితీ సెక్రట రీ లను జూనియర్ పంచా యతీ సెక్రటరీలను చేయాలన్న ప్రతిపాదన తదితర అంశాలు కోర్టు పరిధిలో ఉన్నాయన్నారు. గ్రామాల్లో సర్పంచ్‌లు లేక పోవడంతో అత్య వసర పనులు కోసం పంచాయతీ కార్యదర్శులు సొంత నిధులు వెచ్చిం చారని వాటిని కూడా త్వరలో విడుదల చేస్తామన్నారు.

# అసోం పిసిసి చీఫ్‌గా గౌరవ్‌గగోయ్

**న్యూఢిల్లీ, మే 26:** అస్సాం ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (పిసి) అధ్యక్షుడిగా ఆ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి గౌరవ్ గొగోయ్ నియమితులయ్యారు. అస్సాం పీసీసీ అధ్యక్షుడు, వర్కింగ్ ప్రెసిడెంట్‌లు, ఇతర కమిటీల అధ్యక్షులను నియమిస్తూ కాంగ్రెస్ పార్టీ ఒక ప్రకటన విడుదల చేసింది. కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ పేరుతో ప్రకటన విడుదలైంది. పీసీసీ అధ్యక్షుడిగా గౌరవ్ గొగోయ్ నియమితులు కాగా.. వర్కింగ్ ప్రెసిడెంట్‌లుగా జాకీర్ హుస్సేన్ సిక్దర్, రోజ్‌లినా టిర్కీ, ప్రదీప్ సర్కార్‌లను నియమించారు. ఇప్పటివరకు పీసీసీ అధ్యక్షుడిగా భూపేన్ కుమార్ బోరా చేసిన సేవలను ఆ ప్రకటనలో పార్టీ మెచ్చుకుంది. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితురాలైన రోజ్‌లినా టిర్కీని ఏఐసీసీ సెక్రెటరీ పదవి నుంచి తప్పించారు. పై నియామకాలతోపాటు వివిధ కమిటీ ఛైర్‌పర్సన్‌ల నియామకాలకు కూడా పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఆమోదం తెలిపారని ప్రకటనలో కేసీ వేణుగోపాల్ వెల్లడించారు. క్యాంపెయిన్ కమిటీ ఛైర్మన్‌గా భూపేన్ కుమార్ బోరా, కోఆర్డినేషన్ కమిటీ ఛైర్మన్‌గా దేవవ్రత సైకియా, మ్యానిఫెస్టో కమిటీ ఛైర్మన్‌గా ప్రద్యుత్ బర్దోలోయ్, పబ్లిసిటీ కమిటీ ఛైర్మన్‌గా రకీబుల్ హుస్సేన్‌ను నియమించారు.



# లక్ష టన్నుల సామర్థ్య గొడౌన్లకు కేంద్రం ఆమోదం

**హైదరాబాద్, మే 26, ప్రభాతవార్త :** తెలంగాణలో గోడౌన్ల మరో లక్ష టన్నుల సామర్థ్యం కలిగిన గోదాముల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ గోదాములను జాతీయ వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి బ్యాంక్ (నాబార్డ్), గ్రామీణాభివృద్ధి ఫండ్స్ (ఆర్ఐడీఎఫ్)తో మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో గోడౌన్లు, కోల్డ్ స్టోరేజీల నిర్మాణం చేపట్టనున్నారు. దీనికి సంబంధించి వేర్‌హౌసింగ్ విభాగం తయారుచేసిన ప్రతిపాదనలను (డీపీఆర్) కేంద్రానికి పంపించగా ఆమోదం లభించింది. దీంతో రాష్ట్రంలో కొత్తగా గోడౌన్లు, కోల్డ్ స్టోరేజీల నిర్మాణానికి మార్గం సుగమమైంది. ఈ మేరకు అధికారులు సన్నాహాలు చేసేందుకు సిద్ధమయ్యారు. ప్రస్తుతం తెలంగాణలో వేర్‌హౌసింగ్ విభాగం ఆధ్వర్యంలో 7.2 లక్షల టన్నుల సామర్థ్యం కలిగిన గోదాములు ఉన్నాయి.

# గురుకులాలలకు అద్దె, ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడంతో విద్యాసంస్థలు మూత

## బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి ఎన్.వి. సుభాష్

**హైదరాబాద్, మే 26, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని దాదాపు 1800 ప్రభుత్వ పాఠశాలలు మూత పడుతున్నాయని బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి ఎన్.వి. సుభాష్ అన్నారు. సోమవారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో గత 11 సంవత్సరాలుగా అనూహ్యమైన అభివృద్ధి సాధించిందన్నారు. యూపిఏ హయాంలో భారత ఆర్థిక వ్యవస్థ 12వ స్థానం నుంచి 14వ స్థానానికి పడిపోయిందని, కానీ నేడు మోడీ పాలనలో జపాన్‌ను దాటి, భారత్ నాలుగవ అతిపెద్ద ఆర్థిక శక్తిగా ఎదిగిందన్నారు. మన ముందు ఉన్నవి కేవలం జర్మనీ, అమెరికా, చైనా మాత్రమే అన్నారు. అంచనాల ప్రకారం, రాబోయే రెండున్నర సంవత్సరాల్లో భారత్ మూడో స్థానానికి చేరుకుంటుందన్నారు. ఈ నేపథ్యంలో వికసిత్ భారత్ లక్ష్యంగా ముందుకు సాగాలని, దేశ అభివృద్ధిలో అన్ని రాష్ట్రాలు భాగస్వామ్యులు కావాలన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యా విధానం, న్యూ ఎడ్యుకేషన్ పాలసీ-2020 దేశం మొత్తానికి మార్గదర్శకంగా నిలుస్తోంది. దీనిని మనం గుర్తు పెట్టుకోవాల న్నారు. కానీ తెలంగాణలో పరిస్థితి భిన్నంగా ఉంది.

కాంగ్రెస్ అధికారం చేపట్టకముందు, రేవంత్ రెడ్డి పిసిసి అధ్యక్షుడిగా ఉన్నప్పుడు విద్యార్థులకు అనేక హామీలు ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక, అవన్నీ నెరవేరుతాయని పదే పదే అన్నారు. కానీ ఇప్పుడు ఆ హామీలన్నీ అమలు చేయకుండా మోసంగా మారాయన్నారు. రాష్ట్రంలో 600కి పైగా గురుకుల పాఠశాలలకు గత 10 నెలలుగా అద్దె చెల్లింపులు జరగలేదు. యజమానులు అద్దె రాకపోవడంతో పాఠశాల భవనాలకు తాళాలు వేసారు. దీనికి పూర్తి బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 660 గురుకుల పాఠశాలలు అద్దె భవనాల్లో నడుస్తున్నాయని, వీటిలో 7 లక్షల మంది విద్యార్థులు చదువు తున్నారు. 63 గురుకులాల యజమానులు భవ నాలు ఖాళీ చేయాలని నోటీసులు జారీ చేశారన్నారు. ఈ పరిస్థితుల్లో 7 లక్షల మంది విద్యార్థుల చదువు ప్రమాదంలో పడింది. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం గురుకులాల అద్దె బకాయిలను వెంటనే చెల్లించాలని, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని, మూసివేసిన ప్రభుత్వ పాఠశాలలను తిరిగి ప్రారంభించాలన్నారు.

# ప్రైవేటు పాఠశాలల అనుమతులు, అప్‌గ్రేడ్ కోసం రెండు వారాల గడువు

## ఉత్తర్వులిచ్చిన పాఠశాల విద్య అధికారులు.. ట్రస్మా కృతజ్ఞతలు

**హైదరాబాద్, మే 26, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కొత్త ప్రైవేటు పాఠశాలల అనుమతి కోసం, అలాగే ఇప్పటికే కొనసాగుతున్న స్కూల్స్‌లో పై తరగతుల అప్‌గ్రేడేషన్ కోసం దరఖాస్తు చేసుకోవడానికి పాఠశాల విద్య శాఖ అధికారులు గడువును ఇస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను పాఠశాల విద్య డైరక్టర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆర్‌జేడీతోపాటు డిఈవోలు రెండు వారాల్లోగా 2025-26 విద్యా సంవత్సరంలో కొత్తగా పాఠశాలలు ప్రారంభించడానికి అలాగే అప్‌గ్రేడేషన్ కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించి పూర్తి చేయాలని ఉత్తర్వుల్లో సూచించారు. కొత్త పాఠశాలలకు పర్మిషన్ ఇవ్వడానికి, అప్‌గ్రేడేషన్‌కు అనుమతించడానికి 2 వారాల గడువును ఇచ్చినందుకు తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ ప్రభుత్వానికి, విద్య శాఖ అధికారులకు కృతజ్ఞతలు తెలిపింది.

రాష్ట్రంలో నూతన పాఠశాల ప్రారంభ ప్రక్రియతోపాటు ప్రస్తుత పాఠశాలల తరగతుల అప్‌గ్రేడేషన్ కోసం సుమారు 500 పాఠశాలలు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉండగా, ప్రభుత్వం ఆన్‌లైన్ సైట్ మూసివేయడంతో చాలా మంది ఆందోళన గురయ్యారని ట్రస్మా రాష్ట్ర గౌరవాధ్యక్షులు యాదగిరి శేఖర్‌రావు, రాష్ట్ర అధ్యక్షులు శివరాత్రి యాదగిరి, సిరిపురం సత్యనారాయణ ఆధ్వర్యంలో ట్రస్మా బృందం మంత్రులు దుద్దిల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను కలిసి వారి ద్వారా విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణాకి సమస్యను వివరించడం జరిగిందని యాదగిరి శేఖర్‌రావు తెలిపారు. సానుకూలంగా స్పందించిన విద్యా శాఖ కార్యదర్శి నూతనంగా పాఠ శాలలను ప్రారంభించుకునే వారి కోసం, తరగతులను అప్‌గ్రేడ్ చేసుకునే వారికోసం ఆన్‌లైన్‌లో రెండు వారాలు అవకాశం కల్పించారని తెలిపారు. ట్రస్మా రాష్ట్ర శాఖ విన్నపాన్ని మన్నించి రెండు వారాలపాటు అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు దుద్దుల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, విద్యాశాఖ కార్యదర్శి యోగితా రానాకి ట్రస్మా తరపున కృతజ్ఞతలు తెలిపారు.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు చురుగ్గా సాగుతున్నాయి

## వారి గృహప్రవేశాలకు వెళ్తా

## లబ్ధిదారులతో విడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**హైదరాబాద్, మే 26, ప్రభాతవార్త :** పేదవాడి సొంతింటికలను సాకారం చేయాలన్న లక్ష్యంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు చురుకుగ్గా సాగు తున్నాయని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం సచివాలయంలోని తన కార్యాలయం నుంచి ఇందిరమ్మ లబ్దిదారులతో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గంటన్నర పాటు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఇందిరమ్మ లబ్దిదారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా పలువురు మంత్రి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ లబ్దిదారులు త్వరలో గృహ ప్రవేశాలు కూడా చేసుకుంటారని పేదింటి ఆడపడుచుల ఆహ్వానాన్ని స్వీకరించి వీలైన చోట్ల గృహ ప్రవేశానికి వెళ్తానని అన్నారు. ఈనెల 19వ తేదీ నుంచి ఈ వారానికి సంబంధించి లబ్దిదారులకు 14.44 కోట్ల రూపాయిలను ఈ సందర్భంగా విడుదల చేశారు. ఈ ఇంది రమ్మ ఇండ్ల పథకానికి సంబం ధించి పైలట్ ప్రాజెక్ట్ కింద 47,335 ఇండ్లు మంజూరు చేయగా ఇప్పటి వరకు ఇందులో 7,824 ఇండ్లు బేస్‌మెంట్, 895 ఇండ్లు గోడల నిర్మాణం కాగా మరో 64 ఇండ్లు శ్లాబ్‌లవరకు పూర్తయ్యాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు ఉన్నా కూడా పేదవానికి ఇచ్చిన మాట ప్రకారం తల తాకట్టుపెట్టయినా సరే ప్రతి సోమవారం లబ్దిదారులకు నిధులను విడుదల చేస్తామన్నారు. ఒక్క రోజుకూడా ఇందిరమ్మ లబ్దిదారుడు నిధులకోసం ఎదురు చూడకుండా నేరుగా వారి బ్యాంకు ఖాతాలోనే జమచేస్తామన్నారు. రాష్ట్రంలో ఇంతవరకు బేస్మెంట్ పూర్తి అయిన 5,682 ఇండ్లకు లక్ష చొప్పున రూ.56.82 కోట్లు, గోడలు పూర్తి అయిన 497 ఇండ్లకు రూ. 2లక్షల చొప్పున రూ. 9.94 కోట్లు, స్లాబు పూర్తయిన 33 ఇండ్లకు 4లక్షల చొప్పున రూ. 1.32 కోట్లు విడుదల చేశామ న్నారు. ఇప్పటివరకు ఇందిరమ్మ ఇండ్ల కోసం రూ.68.08 కోట్లు అందజేశామన్నారు. గత సోమవారం మే 19 తేదీనాటికి బేస్మెంట్ పూర్తయిన 5140 ఇండ్లకు రూ. 51.40 కోట్లు అందజేశామని, ఈరోజున 1072 ఇండ్లకు రూ.10.72 కోట్లు విడుదల చేశామన్నారు. దీంతో ఇంతవరకు బేస్మెంట్ పూర్తయిన 6212 ఇండ్లకు రూ.62.12 కోట్ల రూపాయిలను లబ్దిదారులకు అందజేశామన్నారు. గోడలు పూర్తయిన ఇండ్లకు సంబంధించి గత సోమవారం వరకు 224 ఇండ్లకు రూ.2.24 కోట్లు విడుదల చేయగా సోమవారం306 ఇండ్లకు రూ.3.06 కోట్లు విడుదల చేశామన్నారు. స్లాబులు పూర్తయిన 33ఇండ్లకు సోమవారం రూ.0.66 కోట్లు విడుదల చేశామన్నారు. ఇంది రమ్మ గృహాల నిర్మాణంలో ప్రభుత్వ పర్యవేక్షణ ఉంటుందేతప్ప నిర్మాణ బాధ్యతలను ప్రభుత్వం చేపట్టదన్నారు. లబ్దిదారులు తమ స్థలానికి అనుగుణంగా తమకు ఇష్టమైన రీతిలో 400 చదరపు అడుగులకు తగ్గకుండా, 600 చదరపు అడుగులకు మించకుండా నిర్మించుకునే సౌలభ్యాన్ని కల్పించామన్నారు. రాష్ట్రంలో దాదాపు 250 మండలాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ జరుగుతోందని, లబ్దిదారులకు ఇంజనీర్లు నిర్మాణ పనుల్లో తగు సహకారాన్ని అందించి, వర్షాకాలంలోఇబ్బంది పడకుండా లబ్దిదారులను ప్రోత్సహించాలని మంత్రి పొంగులేటి సూచించారు.



# కవిత లేఖతో ఒరిగేది ఏమి లేదు

## మాజీ ఎంపి రవీంద్రనాయక్


**హైదరాబాద్, మే 26, ప్రభాతవార్త:** ఎమ్మెల్సీ కవిత లేఖతో ఒరిగేది ఏమి లేదని మాజీ ఎంపి రవీంద్ర నాయక్ అన్నారు. సోమవారం గాంధీభవన్‌లో మీడి యాతో మాట్లాడారు. ఆరోజు మీ నాన్న కెసిఆర్ అవినీతి చేస్తుంటే ఫూలే, సామాజిక న్యాయం నీకు గుర్తు రాలేదా కవిత అంటూ ప్రశ్నించారు. కెసిఆర్ పచ్చి మోసగాడు అంటూ లేఖ కవిత రాసిందో కెసిఆరే కవితతో లేఖ రాయిం చాడో అనుమానం వస్తుందన్నారు. ఎందుకంటే కెసిఆర్ పాపాలు ఒక్కో క్కోటిగా బయటకు వస్తున్నాయని వాటిని కప్పి పుచ్చుకోవడానికి కవితతో రాయించవచ్చు అన్నారు. కెసిఆర్ గురించి నాకు బాగా తెలుసునని, నా లాంటి ఎంతోమంది తెలంగాణ ఉద్యమకారులను అణగదొక్కిన వ్యక్తి కెసిఆర్ అన్నారు. మోడీ తెలంగాణకు వచ్చినప్పుడల్లా కెసిఆర్ అవినీతి పరుడు జైల్‌కు పోవడం ఖాయం అంటాడు, ఇప్పటి వరకు ఆయన మీద చర్యలు తీసుకోలేదన్నారు. మోడీ చర్యలు తీసుకోక పోయిన ప్రకృతి మాత్రం కెసిఆర్ మీద చర్యలు తీసుకుంటుందన్నారు.

మంచి కథ కల్పించినట్లుగా కాక
నిజంగా జరిగినట్లుగా ఉండాలి.
చదివే వారికి కథ అనే శంక కలిగితే అది కథ కాదు.
-చలం

# కబళిస్తున్న మత్తు రక్కసి


మాదక ద్రవ్యాల వ్యసనం జాతి వినాశనానికి దారితీస్తుందని, దానిని సమష్టిగా నిర్మూలించాల్సిన అవసరం ఉందని ఎంతో కాలంగా ప్రపంచవ్యాప్తంగా దేశాధినేతలు చెప్తూనే ఉన్నారు. ఆ రాక్షసిని ఉక్కుపాదంతో అణచివేయాలని కూడా పిలుపునిస్తున్నారు. కానీ అంతకు రెట్టింపుస్థాయిలో ఈ మహమ్మారి యేడాది యేడాదికి విస్తరిస్తుండడం ఆందోళన కలిగించే విషయం. ముఖ్యంగా ఈ వ్యసనం ఇరవైఏళ్ల లోపు పిల్లలపై తీవ్ర ప్రభావం చూపుతున్నది. మరోవైపు నేరాల సంఖ్య అదుపు లేకుండాపోతున్నది. మాదకద్రవ్యాల మత్తులో వారు ఏంచేస్తున్నారో వారికే తెలియని పరిస్థితుల్లో చేయరాని, చేయకూడని పనులకు పాల్పడుతూ అవి కప్పిపుచ్చుకోవడానికి హత్యలు చేయడానికి కూడా వెనుకాడడం లేదు. ప్రపంచవ్యాప్తంగా డార్క్‌నెట్ ద్వారా జరిగిన మత్తుమందుల కొనుగోళ్లలో ఆసియా ఖండం వాటా పద్నాలుగు శాతానికి పెరిగిపోయింది. అందులో చైనా తర్వాత భారత్‌దే అగ్రస్థానం. 2004 దశకంలో భారత్‌లో కోటి డెబ్బైలక్షల మందికిపైగా మత్తువాడకందార్లు ఉండగా ప్రస్తుతం మద్యం, ఇతర మత్తు పదార్థాలు సేవించే వారిసంఖ్య దాదాపు నలభై కోట్లకు చేరుకుందని చెబుతున్నారు. ముఖ్యంగా అస్సాం,హర్యానా, గుజరాత్, ఛత్తీస్‌గఢ్, పంజాబ్, మధ్యప్రదేశ్, ఢిల్లీ, రాజస్థాన్, యుపి, పశ్చిమబెంగాల్‌తోపాటు తెలుగు రాష్ట్రాల్లో కూడా ఈ మత్తు పదార్థాల వినియోగం పెరిగిపోతున్నది. కేంద్ర సామాజిక న్యాయ సాధికార వ్యవహారాల పార్లమెంటరీ స్థాయీ సంఘం గతంలో వెల్లడించిన గణాంకాలు విస్తుపోయేలా చేస్తున్నాయి. మత్తుమందులు వాడకంలో ఉత్తరాది రాష్ట్రాలతో దక్షిణాది రాష్ట్రాలు కూడా పోటీ పడుతున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో కూడా పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. నిత్యం ఎక్కడో ఒక చోట పట్టుబడుతున్నాయి. దీనికితోడు గంజాయి సాగు ఊహించని రీతిలో పెరిగిపోయింది. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖ ఏజెన్సీలోనూ, ఇటు తెలంగాణ ఖమ్మం, వరంగల్ తదితర జిల్లాల్లోనూ అటవీ ప్రాంతాల్లో గంజాయి సాగు విస్తరిస్తున్నట్లువార్తలు అందుతున్నాయి. గతంలో గంజాయి సాగు రవాణా, వినియోగాన్ని నియంత్రించేందుకు చర్యలు తీసుకునేవారు. ఎందుకోఏమోకానీ నిఘా తగ్గిపోతున్నది. 2021అక్టోబరు మూడో వారంలో ఆంధ్ర, ఒడిశా సరిహద్దుల్లో నల్గొండ జిల్లా పోలీసులు చేపట్టిన 'ఆపరేషన్ గంజా' తనిఖీల్లో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఈ విష యంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాజకీయ నేతల మధ్య మాటల యుద్ధానికి దారితీసింది. ఈ అక్రమదారులను ప్రోత్స హిస్తున్నది మీరంటే మీరని పరస్పర ఆరోపణ చేసుకున్నారు. ఆ తర్వాత ఎందుకో ఆ ఆపరేషన్ ఆగి పోయిందనే చెప్పొచ్చు. దీనికితోడు విదేశాల నుండి భారీ ఎత్తున డ్రగ్స్ అటు ఆంధ్రప్రదేశ్, ఇటు తెలంగాణకు చేరుకుంటున్నట్లు పట్టుబడుతున్న సంఘటనలు రుజువు చేస్తున్నాయి. గతంలో గుజరాత్‌లోని ముంద్రాపోర్టులో ఇరవై ఒక్కవేల కోట్ల విలువైన మూడువేల కిలోల హెరా యిన్ పట్టుబడినట్లు విజయవాడ లింకులు వెలుగు చూశాయి. మత్తు మందు సరఫరాలో కోట్లాది డాలర్లలోఅధిక శాతం ఉగ్రవాదుల సంస్థలకే చేరుకుంటుందని దర్యాప్తు సంస్థలు చెబుతున్నాయి. అన్నింటికంటే ప్రధానంగా అత్యంత లాభదాయకం కావడం వల్ల ప్రపంచవ్యాప్తంగా పెద్దపెద్ద నేరముఠాలు మాదకద్రవ్యాల ఉత్పత్తి, రవాణాను వ్యాపారంగా మార్చుకుంటున్నాయి. ఈ మత్తు ముఠాలు సొంతంగా ఒక పెద్ద నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసుకుంటున్నాయి. అందుబాటులో ఉన్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం కూడా ఈ మత్తుమందు వ్యాపారులు ఉప యోగించుకుంటున్నారు. ఇతర వ్యవస్థలతో సంబంధం లేకుండా సరాసరి ఒకరి ఖాతా నుంచి మరొకరి ఖాతాకు బదలీ చేయగలిగే 'క్రిప్టోకరెన్సీ' వాడకం సైతం జరగడంతో ఈ లావాదేవీలకు అదుపులేకుండా పోతున్నది. గతంలో మత్తు మందులు కొనేవారు తెలిసినా, వాడకం దారులు వారికి నమ్మకం ఉన్న వ్యాపారినే సంప్రదించేవారు. మత్తు మందును తీసుకొని డబ్బు చేతిలో పెట్టేవారు.ఆ వ్యాపారి కూడా అత్యంత రహస్యంగా మూడోకంటికి తెలియకుండా మత్తుమందు తెప్పించి అప్పగించేవాడు. అయితే అత్యంత పకడ్బందీగా జరుగుతున్నా నిఘా విభాగం అధికారులు కన్నువేయడంతో ఎక్కడో ఒక దగ్గర దొరికిపోయేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఇండియాలో మారుమూల ప్రాంతాల్లో కూర్చొని ఎక్కడో విదేశాల్లో ఉన్నమత్తుమందు వ్యాపారికి ఆర్డరు ఇవ్వొచ్చు. మత్తుమందు రవాణా, చెల్లింపులు సులభం కావడంతో విక్రయాలు విపరీతంగా పెరిగిపోతు న్నాయి. ప్రపంచమంతా విస్తరించిపోతున్నది. పట్టుబడిన కేసుల్లో కూడా పటిష్టంగా వ్యవహరించలేకపోవడం వల్లనో లేక చట్టంలో ఉన్న లొసుగులేమోకానీ జైళ్ల నుంచి బయటకు వచ్చి అదే వ్యాపారంలో కొనసాగుతున్నారు. ఇంకొక పక్క సమర్థవంతంగా దర్యాప్తు జరిపి రుజువు చేయడంలో సంబంధిత అధికారులు విఫలం కావడంతో అధికశాతం కేసులు న్యాయస్థానాల్లో వీగిపోతున్నాయనే ఆరోపణలను కొట్టివేయలేం. ఏదోఒక రాష్ట్రం చర్యలు తీసుకుంటే నియంత్రించడం సాధ్యం కాదనేది కొంతవరకు నిజమే కావొచ్చు. అటు కేంద్రం, ఇటు రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడి కార్యాచరణరూపొందించి అమలు చేయాలి. ఏదిఏమైనా మానవ జీవనంతో ఆటలాడుకుంటున్న ఈ మాదకద్రవ్యాలను నిరోధించే విషయంలో మాటలకే పరిమితం కాకుండా ఆచరణలోచూపాల్సిన తరుణమిది. ఈ బాధ్యతంతా పాలకులపై వదిలి పెట్టకుండా స్వచ్ఛంద సంస్థలు,ప్రజాస్వామ్యవాదులు అందరు కలిసికట్టుగా పోరాటం చేయాల్సిన సమయమిది.

మీరు గౌరవాన్ని కోరుకుంటే ముందు మిమ్మల్ని మీరు గౌరవించుకోవాలి. మీ అనుమతి లేనిదే మిమ్మల్నెవరూ చిన్నచూపు చూడరు.



శామ్యూల్

వయసు మీరిన తర్వాత మనకు అవసరమైన ఆశ్రయాన్ని ఇవ్వగలిగింది విజ్ఞానమే.



చెస్టర్ ఫీల్డ్

# జీవన గమనాన్ని మార్చుతున్న సాంకేతిక రంగం

***సాంకేతిక రంగం లేనిదే పూట గడవని పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో భవిష్యత్తులో ఎలాంటి పరిణామాలు చోటు చేసుకుంటాయో ఊహించడానికే భయంగా ఉంది. భువన గగనాల్లో ఆధిపత్యం కోసం పోరాటం జరుగుతున్నది. ఇందులో సాంకేతికత ప్రముఖ భూమిక పోషిస్తున్నది. యుద్ధాలు కూడా టెక్నాలజీ ఆధారంగా జరుగుతున్నాయి. అణ్వస్త్రాల్వు, ఇతర యుద్ధ పరికరాలు, యుద్ధవిమానాలు ఆధునికత సంతరించుకున్నాయి. అన్నింటా టెక్నాలజీ దే అగ్రస్థానం. ఇలాంటి పరిస్థితుల్లో సాంకేతిక పరిజ్ఞానం విషయంలో తగు జాగరూకత వహించాలి. నిర్మాణాత్మకమైన కార్యక్రమాలకు మాత్రమే సాంకేతిక పరిజ్ఞానం వినియోగపడేటట్లు తగిన యంత్రాంగం నెలకొల్పాలి. విధ్వంసానికి, విద్వేషాలకు సాంకేతికతను దుర్వినియోగపరచకూడదు. సాంకేతిక పరిజ్ఞానమంటే యుద్ధాలకో, విధ్వంసానికో కాదు ఉద్యోగ కల్పన కోసం, మెరుగైన జీవన శైలికోసమనే భావన ఏర్పడింది.***

**సుంకవల్లి సత్తిరాజు**


సాంకేతిక పరిజ్ఞానం ఇంతగా ప్రపంచాన్ని పెను మార్పులకు గురి చేస్తుందని ఎవరూ ఊహించలేదు. రాబోయే కొద్ది సంవత్సరాల్లో ప్రపంచాన్ని ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ పూర్తిగా ఆవహించే అవకాశాలు మెండుగాఉన్నాయి. వచ్చే ఏడాది నాటికి 50శాతం కోడింగ్ ఏఐ చేస్తుందని మెటాప్లాట్‌ఫామ్స్ సిఇఒ మార్క్ జుకర్‌బర్గ్ చెబుతుంటే, మైక్రోసాఫ్ట్‌లో ఇప్పటికే 30 శాతం కోడింగ్ ఎఐ చేతుల్లోకి వెళ్ళిందని ఆ సంస్థ సిఇఒ సత్య నాదెళ్ల పేర్కొనగా, హేమాహేమీల కందని కోడింగ్ ఏఐ సొంతమని స్పేస్ఎక్స్, ఎక్స్,టెస్లా అధినేత ఎలాన్ మస్క్ ప్రకటించడాన్ని బట్టి చూస్తే భవిష్యత్తులో ఏఐ ప్రాధాన్యత ఎలా ఉండగలదో ఊహించగలం. భవిష్యత్తులో ఎఐ మీద పట్టుగల వారికే ఉద్యోగాలు దక్కుతాయి. సాఫ్ట్‌వేర్ రంగం సాఫ్ట్‌నెస్ కోల్పోయింది. కష్టించి పనిచేసి, అప్పగించిన పనులు విజయవంతంగా పూర్తి చేయగలిగితేనే కొంతకాలం ఉద్యోగాల్లో కొనసాగగలరు.నేటి చదువులు,మార్కులు సాఫ్ట్‌వేర్ రంగంలో రాణించడానికి ఉపకరించగలవా? అనే సంశయం కలగడం సహజం. మారుతున్న టెక్నాలజీని ఎప్పటికప్పుడు ఒడిసిపట్టుకుని, ఉద్యోగాలు సంపాదించాలి. ఉద్యోగార్థులు విపరీతంగా పెరిగిపోతున్న నేపథ్యంలో తక్కువ వేతనాలతో పని చేసే వారికే టెక్ కంపెనీలు ప్రాధాన్యత నిచ్చే అవకాశాలున్నాయి. ఇప్పటికే అరకొర జీతాలతో గొడ్డుచాకిరీ చేస్తున్నవారిని చూస్తున్నాం. మానసికంగా నలిగిపోతూ, ఉంటుందో, ఊడుతుందో తెలియని భద్రత లేని ఉద్యోగాల కోసం మనశ్శాంతి కోల్పోవడం కంటే ప్రత్యామ్నాయ ఉపాధిని అన్వేషించుకోవడం మంచిది. మార్కులతో, బట్టీ చదువులతో తమ పిల్లల భవిష్యత్తు బాగుపడుతుందని భ్రమపడే తల్లిదండ్రుల ధోరణి మారాలి. బోధనా పద్ధతులు కూడా మారాలి.అన్ని రంగాలు సాంకేతికతతో మేళవించిన కారణంగా ఎక్కడ ఏచిన్న పొరపాటు జరిగినా యావత్ ప్రపంచం స్తంభించిపోయే ప్రమాదముంది.సాఫ్ట్‌వేర్ రంగానికి చెందిన నిపుణులు, ఉద్యోగులు, టెక్ కంపెనీలు సాంకేతిక వ్యవస్థలు దుర్వినియోగంకాకుండా ప్రపంచ జీవన గమనం సాఫీగాసాగడానికి నిరంతరం అప్రమత్తంగా ఉండాలి. సైబర్ నేరాలు పెరిగి పోతున్నాయి. వర్తమాన ప్రపంచంలో చోటుచేసుకుంటున్ననేరాల్లో అత్యంత ఆధునిక నేరంగా 'సైబర్ క్రైమ్' పేరుగాంచింది. ఈ మాట వింటుంటే ముచ్చెమటలు పట్టక మానవు. ఒకప్పటి సినిమాల్లో భయంకరమైన రౌడీ వేషాల్లోవచ్చి,కిడ్నాపులు చేయడం,దోపిడీలకు పాల్పడడం వంటి సన్నివేశాలు కనిపించేవి. అయితే ఈ ఆధునిక సమాజంలో నిజంగా నిర్లజ్జగాక్షణాల్లో మోసాలు జరిగిపోతున్నాయి. కాలు బయటకు కదపకుండా, కోట్లు కూడబెట్టే విద్యలో కొంతమంది ఆరితేరిపోయారు. పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానం సైబర్ నేరగాళ్లకు కాసుల పంటగా మారింది.కోట్లు దండుకునే ఘరానా మోసానికి కేరాఫ్ అడ్రస్‌గా మారింది. ఎక్కడో విదేశాల్లో కూర్చుని, చెమట పట్టకుండా, విధ్యాధికులకు సైతం ముచ్చెమటలు పట్టించే వికృతమైన క్రీడా విన్యాసానికి పర్యాయపదంగా 'సైబర్ క్రైమ్' పేరుగాంచింది. అశ్లీల దృశ్యాలను సాంఘిక మాధ్యమాల్లో పెడతామని బ్లాక్ మెయిల్ చేసి, సామాన్యుల నుండి సెలబ్రిటీలను సైతం మోసం చేసి,డబ్బులు గుంజుకోవడం చూస్తున్నాం. ప్రభుత్వ పథకాల పేరుతో, బ్యాంకు అధికారుల పేరుతో వివిధ రకాలుగా బెదిరింపులకు పాల్పడుతూ, ఎటియం పిన్‌చెప్పమంటూ అజ్ఞాత వ్యక్తులు మాయమాటలు చెప్పడం, కెవైసి అప్‌డేట్ కోసమంటూ ఓటిపి అడగడం,మొబైల్ ఫోన్లకు మెసేజ్‌లు పంపడం, వాట్సాప్‌లలో లింకులు పంపించి, క్లిక్ చేయమనడం ద్వారా డబ్బులు కాజేయడం వంటి సంఘటనలు పలుచోట్ల చోటుచేసుకుంటున్నాయి. అక్షరాస్యులు, నిరక్షరాస్యులు అనే తేడా లేకుండా నమ్మించి, బ్యాంకు ఖాతాలను ఖాళీ చేయించడంతో ఏం చేయాలో అర్థంకాక ఎంతోమంది ఆవేదన చెందుతు



న్నారు. కష్టించి,సంపాదించిన సొమ్మంతా క్షణాల్లో మాయం కావడంతో ఏంచేయాలో అర్థంగాక అమాయకులు తీవ్రమైన మనోవ్యధకు గురవుతున్నారు. మన మాటలను, వీడియోలను పరిశీలించి, ఎడిట్ చేసి, మోసంచేయడం, శీల హననం చేయడానికి యత్నించడం, బ్లాక్ మెయిలింగ్‌కు పాల్పడడం, తమ మాట వినకపోతే తీవ్రంగా నష్టపోతారంటూ, బెదిరింపులకు పాల్పడడం జరుగుతున్నది. ఇటీవలి కాలంలో డిజిటల్ అరెస్టుల పేరుతో తీవ్రమైన నేరాలకు పాల్పడుతున్న ముఠాలు బయలు దేరాయి. సైబర్ క్రైమ్ నేరాలను నిరోధించడానికి టోల్ ఫ్రీ నెంబర్లు ఇవ్వబడ్డాయి. అనేక కేసులు నమోదవుతున్నాయి. అయితే కేసులు పెట్టడం వలన ఎంత మంది నేరస్థులు పట్టుబడుతున్నారో,ఎలాంటి శిక్షలు విధిస్తున్నారో అర్థం కావడం లేదు. భారతదేశంలో డిజిటల్ అరెస్టులకు చట్టబద్ధత లేకపోయినా,వీటి పేరుతో నేరస్థులు సాగిస్తున్న కార్యకలాపాలకు బెంబేలెత్తిపోతున్న అమాయకుల ఆక్రందనలకు అడ్డుకట్టవేయలేమా? సాంకేతిక రంగంలో పెను విప్లవం 'ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్'. కృత్రిమ మేధస్సుతో వివిధ రంగాల్లో విప్లవాత్మకమైన మార్పులకు శ్రీకారం చుట్టి, ఆధునీకరించిన సాంకేతిక ప్రక్రియతో వేగవంతంగా పనులను పూర్తి చేసి, ప్రగతిని పరుగులు పెట్టించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. సాఫ్ట్‌వేర్ రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌ను విస్తృతం చేసే ప్రయత్నాలు వేగం పుంజుకున్నాయి. భవిష్యత్తులో కృత్రిమ మేధ కీలక భూమిక పోషించే అవకాశముంది.అయితే ఇలాంటి కృత్రిమ మేధ సైబర్ నేరస్థులకు స్వర్గధామంలా మారడం దురదృష్టకరం. ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్‌సహాయంతో మన మాటలను, మన వీడియోలను మార్ఫింగ్ చేసి, వాట్సాప్ ద్వారా పంపించి, డబ్బులు పంపించమంటూ కోరడం, ఆ వీడియోలు నిజమేనని నమ్మి డబ్బులు పంపించడం ద్వారా ఆర్థికంగా నష్టపోతున్న వారు ఎవరిని ఆశ్రయించాలో తెలియక తికమకపడుతున్నారు. కేసులు పెట్టినా ఫలితం ఉంటుందనే నమ్మకం లేక దిగాలు పడుతున్న వారికి న్యాయం జరుగుతుందా? టెక్నాలజీ దుర్వినియోగం విశృంఖలంగా కొనసాగుతున్నది. మన ప్రయోజనాల కోసం మనం నిర్మించుకున్న సాంకేతిక ప్రపంచం వక్రమార్గంలో పయనిస్తున్నది. విద్య,వైద్య,ఆర్థిక,రవాణా, కమ్యూనికేషన్, సాంస్కృతిక రంగాల్లో నిర్మాణాత్మకంగా వినియోగపడవలసిన టెక్నాలజీ అసాంఘిక శక్తుల చేతుల్లోకి పోయి, అడ్డదారుల్లో పయనిస్తున్నది. మొబైల్‌ఫోన్ల వినియోగం విపరీతంగా పెరిగిపోయింది. మొబైల్ ఫోన్ లేనిదే రోజు గడవని పరిస్థితులు ఏర్పడ్డాయి. యూట్యూబ్, వాట్సాప్ ఫేస్బుక్, ఇన్‌స్టాలు, ట్విట్టర్,ఎక్స్ వంటి సాంకేతిక వేదికలు సమాజానికి ఉపకరించాలి. అయితే సోషల్ మీడియా అన్ని విలువలను అతిక్రమించి,అత్యంత ప్రమాదకరంగా మారుతున్న నేపథ్యంలో కొత్తగా పుట్టుకొచ్చిన "ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్" వలన ఎన్నో ప్రమాదాలు పొంచి ఉన్నాయి. ఇప్పటికే దీని ప్రభావం వలన అనేక మంది బాధితులైనారు. మొబైల్ ఫోన్లలో నిక్షిప్తమైన మన వ్యక్తిగత భద్రత ప్రశ్నార్థంగా మారుతు న్నది. నిర్మాణాత్మకంగా ఉపయోగపడవలసిన ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ను అసాంఘిక కార్యకలాపాలకు, ఆర్థికనేరాలకు వినియోగించడం వలన వ్యక్తిగత గోప్యతకు, ఆర్థికభద్రతకు, స్వేచ్ఛకు ముప్పుగా పరిణమించింది. డేటాచౌర్యం యథేచ్ఛ గా సాగుతున్నట్టు పలు వార్తా కథనాలు సూచిస్తున్నాయి. ఇకనైనా సైబర్ నేరాల పట్ల పటిష్ఠమైన, వేగవంతమైన చర్యలు తీసుకోవాలి. సైబర్ నేరాలను అణచివేయడానికి ప్రపంచ దేశాలన్నీ ఏకంకావాలి. సమిష్ఠితత్వంతోపటిష్ఠమైన యంత్రాంగాన్ని రూపొందించుకోవాలి. సాంకేతిక రంగం లేనిదే పూట గడవని పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో భవిష్యత్తులో ఎలాంటి పరిణామాలు చోటు చేసుకుంటాయో ఊహించడానికే భయంగా ఉంది. భువన గగనాల్లో ఆధిపత్యంకోసం పోరాటం జరుగుతున్నది. ఇందులో సాంకేతికత ప్రముఖ భూమిక పోషిస్తున్నది. యుద్ధాలు కూడా టెక్నాలజీ ఆధారంగా జరుగుతున్నాయి. అణ్వస్త్రాల్వు, ఇతర యుద్ధ పరికరాలు, యుద్ధవిమానాలు ఆధునికత సంతరించుకున్నాయి. అన్నింటా టెక్నాలజీ దే అగ్రస్థానం. ఇలాంటి పరిస్థితుల్లో సాంకేతిక పరిజ్ఞానం విషయంలో తగు జాగరూకత వహించాలి. నిర్మాణాత్మకమైన కార్యక్రమాలకు మాత్రమే సాంకేతిక పరిజ్ఞానం వినియోగపడేటట్లు తగినయంత్రాంగం నెలకొల్పాలి. విధ్వంసానికి, విద్వేషాలకు సాంకేతికతను దుర్వినియోగపరచకూడదు. సాంకేతిక పరిజ్ఞానమంటే యుద్ధాలకో, విధ్వంసానికో కాదు ఉద్యోగ కల్పన కోసం,

# అవినీతిరహిత సమాజాన్ని నిర్మిద్దాం


**బుగ్గన మధుసూదనరెడ్డి**



ప్రభుత్వం నెల నెల టంచన్‌గా అందించే వేలాది రూపాయల జీతాలతో ఎంతో హుందాగా ఉండాల్సిన, బాధ్యతగా మెలగాల్సిన కొంతమంది ప్రభుత్వ ఉద్యోగులు నెల విడిచి సాము చేస్తూ తమ దగ్గరకు ఏదేని పని నిమిత్తమై వచ్చిన సామాన్య ప్రజల నుంచి,చిన్న,సన్న కారు రైతుల నుంచి తమకు కావలసినంత సొమ్మును ముక్కు పిండి మరీ వసూలు చేస్తూ తమ వికృత,నికృష్ఠ నైజాన్ని చాటుకుంటుండటం తీవ్ర హేయమైన, ఆక్షేపణీయమైన విషయం. ఆ విధంగా కొంతమంది ప్రభుత్వ ఉద్యోగుల డబ్బు పిచ్చి ఏ విధంగా తయారు అయింది అంటే'అయ్యగారికి లంచం ఇస్తేనే కంచం కదిలేది' లాగా, కాస్తో, కూస్తో 'సామాన్య ప్రజల నుంచి కాసులు గుంజనిదే' వారికి ఆరోజు నిద్రపట్టేలా లేదు అన్నట్లుగా. ఒక విధంగా చెప్పాలంటే ఒక వేటగాడు తన కడుపు నింపుకోవడానికి ఏదేని జంతువును ఎలా వెంటాడి వెంటాడి వేటాడుతాడో ఆ తరహాలో కొంత మంది ప్రభుత్వ ఉద్యోగులు సామాన్య ప్రజలను ఒక జలగల లాగా పీక్కుతుంటూ వారి నుంచి బలవంతంగా అయిన దానికి కాని దానికి కాసులు దండుకుంటుండటం అత్యంత జుగుస్సకరం, సిగ్గు చేటైనా విషయం.కొన్ని సందర్భాలలో వీరి అవినీతి, లంచాలు శృతిమించి, సామాన్య ప్రజలకు వెర్రెత్తి వీరి బాగోతాన్ని ఎసిబి అధికారులకు చేరవేస్తే వారు అఘామేఘాల మీద వచ్చి వీరి మీదపడి వీరిని అత్యంత అవమానకరంగా సస్పెండ్ చేస్తున్నప్పటికీ వీరి వక్ర బుద్ధిలో ఏ మాత్రం మార్పురాకపోవడం ఈ ప్రజాస్వామ్యానికి సంబంధించి అత్యంత బాధాకరమైన, దురదృష్టకరమైన విషయం. ఏదిఏమైనా వీరికి ఏ మాత్రంపేద, నిరుపేద ప్రజలపై, సామాన్య రైతులపై జాలి,దయ,సానుభూతి అంటూ ఏ మాత్రం, ఏ కోశానా ఉండదు.ఎంతసేపు వీరి బొక్కసాలను నింపుకోవడం పైనే వీరి దృష్టి అంతా. ఏమి చేస్తాం వీరికి ఎంతసేపు డబ్బు సంపాదనపై తీరని వ్యామోహం తప్పించి వీరిలో మానవత్వం ఇసుమంతైనను కానరాదు. 'పులిని చూసి నక్క వాత పెట్టుకున్నట్లు' కొంత మంది నిజాయితీ గల ప్రభుత్వ ఉద్యోగులు సైతం వీరిని చూసి అవినీతికి, లంచాలకు కేర్ ఆఫ్ అడ్రస్‌గా మారే ప్రమాదం సైతం పొంచి వుంది. ఇందులో ఎలాంటి సందేహానికి తావులేదు. ఏమైనా ఆ కాలమే వీరి దుర్బుద్ధిని,వక్ర స్వభావాన్ని మార్చాలి తప్ప వీరు మారరు గాక మారని దురాశపరులు, లంచాలను అడుగడుగున రుచి మరిగిన బొత్తిగా వ్యక్తిత్వం లేని ధనాశపరులు. ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతిని రూపుమాపేందుకు మనమంతా ఒక యుద్ధ ప్రాతిపదికన ఉద్యమిద్దాం. అవినీతి, లంచం అనే మహమ్మారిని తరిమి తరిమి కొడదాం! అవినీతి రహిత సమాజ రూపకల్పనకు మన వంతుగా పాటుపడదాం. ●

# వ్యూహాత్మక సంకల్ప వేదిక మహానాడు

**సిద్ధార్థ రాయ్**



దేశ రాజకీయ చిత్రపటంలో కొత్త అధ్యాయానికి తెర లేపిన తెలుగుదేశం పార్టీ ఈసారి మహానాడుతో పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహాన్ని నింపబోతున్న సంకేతాలు అం దుతున్నాయి. ఎన్నోఆశలు, ఆకాంక్షలతో లక్షలాది మంది తెలుగుదేశం తమ్ముళ్లు ఎదురుచూస్తున్న సమయం రానే వచ్చింది. అదే మహానాడు విశాల వేదిక. ఈసారి టీడీపీ మహా నాడు మాత్రం సాదాసీదా సభగా భావించలేము. ప్రత్యే కించి నాలుగోసారి ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు బాధ్యతలు చేపట్టిన తర్వాత జరిగే ఈ మహానాడు, గతంలో అన్నింటకన్నా విభిన్నంగా, విస్తృతంగా, విశిష్టంగా మారుతోంది.

## ప్రత్యర్థులకు స్పష్టమైన సంకేతం

ఈ సమావేశానికి కడప వేదిక కావడం రాజకీయంగా ప్రతీకాత్మకంగా మారింది. ఇది వైఎస్సార్ కాంగ్రెస్ కోటగా ఉన్న కడప జిల్లాలో నిర్వహించడమే. కడప అంటేనే వైఎస్ కుటుంబానికి అఖండ వేదికగా భావించిన స్థలం. దాదాపు రెండున్నర దశాబ్దాలుగా వైఎస్ రాజ్యమేలిన ఈ భూభాగంలో టిడిపి మహానాడు నిర్వహించడం వాస్తవానికి రాజకీయ ధైర్య సాహసానికి నిదర్శనం. ఈ నిర్ణయం ద్వారా చంద్రబాబు కొన్ని స్పష్టమైన సంకేతాలు పంపిస్తున్నారు. ఒక్క కడపనే కాదు, రాష్ట్రవ్యాప్తంగా పార్టీ తిరిగి పునరుత్తేజానికి సంకేతం. ఎవరూ ఊహించని స్థలంలో మహానాడు నిర్వ హించడం, ప్రత్యర్థుల గూఢార్థాలను కట్ చేస్తూ, పార్టీ సామర్థ్యాన్ని రుజువు చేయడం అనే వ్యూహాత్మక సంకల్పమే దీని వెనుక ఉంది.

## పునరుత్తేజ స్ఫూర్తి

టిడిపి మహానాడు అంటే కేవలం ఒక వార్షిక సమావేశం మాత్రమే కాదు. ఇది పార్టీలో సామూహిక ఆత్మపరిశీలనకు, బహిరంగ చర్చలకు వేదిక. ముఖ్యంగా అధికారంలోకి వచ్చిన అనంతరం జరిగే మహానాడు కావడంతో, నూతన పాలనకు రూపురేఖా విలాసాలను నిర్దేశించే సభ. అందుకే ఇది కీలకం. ఎన్నికల హామీలు, పాలన తీరుపై స్పష్టత, బృహత్తర అభివృద్ధి యాజమాన్యం గురించి పార్టీ శ్రేణులకు సమాచారం అందించేందుకు, అధికారంలో ఉన్న నేతలు తమ లక్ష్యాలు షేర్ చేసుకునేందుకు ఇది అత్యుత్తమ అవకాశం.

ఈ మహానాడు సందర్భంగా పార్టీలో పునరోత్సాహం కలిగించే ముఖ్య నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. వివిధ కమిటీల ఏర్పాటు, యువ నాయకత్వానికి అవకాశం కల్పించే మార్గదర్శక చర్యలు, పార్టీ శ్రేణుల బలోపేతానికి ప్రత్యేక ప్రణాళికలు చర్చకు వచ్చే సూచనలు కనిపిస్తున్నాయి.

## వ్యూహాత్మక మార్గదర్శకత్వం

ఇటీవల జరిగిన ఎన్నికల్లో టిడిపికి దక్కిన సీట్లు ఘన విజయానికి నాయకత్వ పటిమకు స్పష్టమైన కారణంగా నిలిచింది. చంద్రబాబునాయుడు అనుభవం, రాజకీయ వ్యూహశాస్త్రం, ప్రజల్లోకి తీసుకెళ్లిన అభివృద్ధి దృక్కోణం, ఈ విజయాన్ని పార్టీ శ్రేణుల సమక్షంలో ఘనంగా ప్రదర్శిస్తూ, అదే దృఢసంకల్పంతో ముందుకు సాగేందుకు చంద్రబాబు ఈ మహానాడును వేదికగా మార్చనున్నారు. ఈసారి మహానాడులో చంద్రబాబు మార్గదర్శకత్వం అత్యంత ప్రాధాన్యత కలిగింది. గత ప్రభుత్వ తీరును ఎండగట్టడమే కాకుండా, కొత్త ప్రభుత్వ ప్రాధాన్యాలు, అనుసరించబోయే విధానాలపై స్పష్టత ఇవ్వనున్నారు. పార్టీ శ్రేణులను ప్రజా సేవకు పునరంకిత దిశగా సమాయత్తం కాగల వేదిక. ఇది కేవలం పార్టీ కార్యకర్తలకే కాదు, ప్రజలకూ సందేశం.

వైఎస్ జగన్ నేతృత్వంలోని వైసిపి భవిష్యత్తు చర్చల్లోనే లేకుండా పోయింది. ప్రజా వ్యతిరేకపాలన, అప్పుల వృద్ధి, నెరవేర్చని హామీలు, దుర్వినియోగ దుష్పరిపాలన వల్ల ప్రజలు వైసిపికి తలుపు మూసేసిన తరుణంలో కార్యకర్తలకు హితోపదేశం ఎంతో అవసరం. ఇప్పుడు చంద్రబాబు అదే ప్రజల మద్దతుతో తిరిగి అధికారంలోకి వచ్చారు. ఈ తరుణంలో మహానాడు ఒక ప్రతిఘటన వేదికగా మారనుంది. గత పాలనపై విమర్శల ద్వారా ప్రజల్లోకి సంకేతాలు పంపించడమే కాకుండా, భవిష్యత్తు పాలనలో ప్రాధాన్యతలు ఏమిటో స్పష్టత ఇవ్వనుంది.

## రాజకీయ దిక్సూచి!

ఈ మహానాడు టిడిపి భవిష్యత్ పయనానికి దిక్సూచి వంటిది. రాజకీయంగా, సంస్థాపితంగా పార్టీ ఎలాంటి మార్పులు చేపట్టనుంది? యువతను ఆకర్షించే చేరే దిశగా ఎలాంటి వ్యూహాలు రూపొందించనుంది? అనేవి ఈ మహానాడులో నిర్ణయిస్తారు. 2029 లక్ష్యంగా తీసుకుంటూ పార్టీ వ్యూహాలు రూపొందించబోతున్నారు. కడపలో జరుగుతున్న మహా నాడు, తెలంగాణాలో పార్టీ పరిస్థితి, పొత్తుల వైఖరిపై చర్చలకు తలుపులు తెరుస్తుంది. రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపించాలన్న సంకల్పంతో చంద్రబాబు తిరిగి అధికారంలోకి వచ్చారు. ఇప్పుడు పార్టీ శ్రేణులకు ఆత్మవిశ్వాసం నింపే, వ్యూహాత్మక పునర్నిర్మాణానికి బీజం వేయనున్న మహానాడు.. నిజమైన కార్యకర్తల ప్రతిష్ఠాత్మక వేదికగా పునరాగమన పథానికే వేదికగా నిలుస్తోంది. ●

# ప్రజావాక్కు



### ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించాలి

**దేశంలో** ఉన్న అన్ని రవాణా వ్యవస్థల్లో రైల్వే రవాణా సగటు భారతీయునికి తక్కువ ఖర్చుతో అధిక ప్రయోజనంకలిగిన వ్యవస్థగా ఉండేది.కానీ ఇటీవల జరుగుతున్న తరచూ ప్రమాదాలవల్ల అమలు చేస్తున్న అసాధారణ నిర్ణయాలవలన రైల్వేల పట్ల నిర్లిప్తత వ్యక్తం అవుతున్నది. గతంలో జరిగిన 200 రైల్వే ప్రమాదాల్లో దాదాపు 350 మంది మరణించినట్లు, 970 మంది ప్రమాదాల బారిన పడినట్లు తెలుస్తున్నది. 2020 సంవత్సరంలో కవాచ్ ప్రవేశపెట్టిన తర్వాతకూడా దాదాపు 200 ప్రమాదాలు జరిగాయి. రక్షణ భద్రత బదులుగా ఆధునికమైన నవీకరణఎనలేని ప్రాధాన్యత ఇస్తున్నారు. ప్రధానమంత్రి కలల స్వప్నమైన బుల్లెట్ రైలు ప్రాజెక్టు కోసం లక్షల కోట్లు వెచ్చిస్తున్నారు. సాధారణ ప్యాసింజర్ రైళ్ల జనరల్ బోగీలను పెంచడంపెంచిన ఛార్జీలను తగ్గించడం ప్రయాణికుల అవసరాలకు తగ్గట్టుగా ఎక్స్‌ప్రెస్ రైళ్లకు స్టాపులను ఏర్పాటు చేయాలి.

- దండంరాజు రాంచందర్‌రావు, హైదరాబాద్

### పెరుగుతున్న అంతర్జాల వినియోగం

**ఇటీవల** కాలంలో అంతర్జాల వాడకం విపరీతంగా పెరిగిపోయింది. రీల్స్ పేరిట వెర్రిచేష్టలు, ఆన్‌లైన్ గేమ్స్ మోసాలు, ఆన్‌లైన్‌లోనే వేధింపులు ఇంకా అనేక రకాల సైబర్ మోసాలను తరచూ మనం చూస్తూనే ఉన్నాం. వీటిబారిన పడకూడదంటే పాఠశాల, కళాశాలస్థాయి నుండి అంతర్జాల వాడకంపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరం ఉంది. పౌర సమాజం బాధ్యతగా వ్యవహరించాలి.

-ఎం. ముత్యంరెడ్డి, సిద్దిపేటజిల్లా

### పేదల ఆకలి పట్టని రేషన్ డిపోలు

**ఆంధ్రప్రదేశ్** ప్రజాపంపిణీ వ్యవస్థద్వారా అర్హులైన పేదలకు ఉచిత బియ్యంతోపాటు రాయితీపై కందిపప్పు, పంచదారను కూడా సరఫరా చేయాల్సి ఉండగా గత నాలుగైదు నెలలుగా కార్డుదారులకు కేవలం ఒక్క బియ్యం మాత్రమే సరఫరా చేస్తూ కొన్ని ప్రాంతాల్లో అరకొరగా పంచదార ఇస్తున్నారు. అంగన్‌వాడీలకు జ్యుడీషియల్ ప్రివ్యూ నుంచి అనుమతులు లభించిన తర్వాత కూడా కందిపప్పు టెండర్ల ప్రక్రియను ముందుకు తీసుకువెళ్లకుండా పౌర సరఫరాల శాఖ నిలిపివేసింది.

-అప్పన్న గొనప, విశాఖపట్నం

### యువతలో మానసిక సమస్యలు

నేటి ఉరుకులపరుగుల జీవితం, ఆధునిక జీవనశైలి, యువత జీవితాల్లో మానసిక ఒత్తిడిని వేగంగా పెంచుతోంది. టీనేజర్లు, యువకులు ఒత్తిడిని ఎక్కువగా అనుభవిస్తున్నట్లు వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా చిన్నారుల్లో మానసిక ఒత్తిడి కనిపించడం ఆందోళనకరంగా మారింది. దీనికి ప్రధాన కారణం పాఠశాల, కళాశాలల ఒత్తిడి, సోషల్ మీడియా డిమాండ్, సమాజంలో తమ సొంతగుర్తింపును సృష్టించడానికి మానసికంగా సంఘర్షణకు గురవుతూ, పోరాడుతున్నారని వైద్యనిపుణులు చెబుతున్నారు. వీడియో గేమ్‌లు, షేర్‌చాట్, ఫేస్‌బుక్, యూట్యూబ్ వంటివాటితో గడుపుతున్న టీనేజర్లు ఎక్కువగా హిక్కోమోరి సిండ్రోమ్ బారినపడుతున్నారని అధ్యయనాలు తెలుపుతున్నాయి. ఫలితంగా యుక్త వయస్సు నుండే యువత పలు మానసిక అనారోగ్యాలకు గురవుతున్నారు.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### రోడ్లను బాగు చేయాలి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు చాలా అధ్వాన్నంగా ఉన్నాయి. సంక్షేమ కార్యక్రమాల పేరుతో అప్పులు చేసి తెచ్చిన పప్పు కూడుగా డబ్బులు నేరుగా ప్రజల అకౌంట్లోకి వెళ్లిపోవడం వల్ల కెసిఆర్ స్వార్థం కారణంగా కాంగ్రెస్ వారి తెలివి తక్కువఆలోచన కారణంగా విభజించబడిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చిన్న రాష్ట్రంగా మారింది. 13 జిల్లాలు 26 జిల్లాలుగా మారి ఉద్యోగుల సంఖ్యను పెంచేసింది. రాజకీయ నాయకుల సంఖ్యను కూడా పెంచేసింది. వారి పోషణ ప్రజలకు చాలా కష్టంగా మారింది. రోడ్లు అధ్వాన్నంగా ఉండడం వల్ల యాక్సిడెంట్లు విపరీతంగా జరుగుతున్నాయి. కేంద్రప్రభుత్వం ప్రజల రక్షణ కోసం ఎగుమతులు, దిగుమతులు సక్రమంగా జరగడం కోసం రోడ్ల మీద దృష్టిపెట్టాలి.

-వీరగంట భాస్కర్‌రావు, బొబ్బిలి

### రెచ్చిపోతున్న సైబర్ కేటుగాళ్లు

ప్రజల కష్టార్జితాన్ని సులువుగా నిమిషాలలో దోచేస్తున్నారు నేడు సైబర్ నేరగాళ్లు. వీరి బారినపడి నిత్యం ఎందరో అమాయకులు మోసపోతున్నారు. రోజుకో తీరున, రోజుకో పేరున కొత్త రకాల మోసాలతో జనాలని దోచుకుంటున్నారు. ఇంట్లో డబ్బుకు దొంగల భయం, బ్యాంకులో సైబర్ నేరగాళ్ల భయం అనే విధంగా నేడు ధనం భద్రంగా దాచుకునే అవకాశం లేకుండాపోయింది. కేంద్ర,రాష్ట్రప్రభుత్వాలు గట్టిచర్యలు తీసుకోవాలి.

-కె. శేషగిరి, సికింద్రాబాద్

మన వి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# యూనస్‌ను దించేందుకు ఆర్మీచీఫ్ కసరత్తు

## మరింత సంక్షోభంలోకి బంగ్లాదేశ్




**ఢాకా, మే 26:** బంగ్లాదేశ్ రాజకీయ వాతావరణం మళ్లీ ఉద్రిక్తతగా మారేలా సంకేతాలు కనిపిస్తున్నాయి. సైనిక చీఫ్ వాకర్ ఉజ్ జమాన్, తాత్కాలిక ప్రభుత్వ ప్రధాన సలహాదారు ముహమ్మద్ యూనస్‌ను అధికారంలో నుంచి తొలగించేందుకు ప్లాన్స్ చేస్తున్నారని ప్రముఖ నిఘా వర్గాలు వెల్లడించాయి. జమాన్ ఈ ప్రయత్నాన్ని సైనిక స్థాయిలోనే కాదు, రాజకీయంగానూ శ్రమిస్తున్నట్టు సమాచారం. ఇటీవల ప్రభుత్వ ఉన్నతాధికారుల సమావేశాల్లో పాల్గొంటూ సైన్యం తమ ఉనికిని, ఉద్దేశాన్ని ప్రజలకు తెలిపిందని నిపుణులు అంచనా వేస్తున్నారు. జమాన్ ఎన్నికలు జూన్‌లో నిర్వహించాలన్న యూనస్ ఆలోచనకు పూర్తిగా వ్యతిరేకంగా ఉన్నట్టు తెలుస్తోంది. ఆయన, బంగ్లాదేశ్ రాజ్యాంగంలో ఉన్న అస్పష్టతలను వాడుకొని యూనస్ అధికారాన్ని సవాలు చేయాలని భావి స్తున్నట్టు తెలుస్తోంది. రాజ్యాంగం ప్రకారం, ప్రభుత్వం రద్దైన 90 రోజుల్లోగా ఎన్నికలు నిర్వ హించాలి. కానీ యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వానికి చట్టపరంగా సరైన ఆధారంలేదని నిఘా వర్గాలు స్పష్టంగా చెబుతున్నాయి. దేశ రాజకీయాలను పునరుద్ధరించేం దుకు జమాన్ కీలక ప్రయత్నాలు చేస్తున్నట్టు సమాచారం. ప్రత్యేకంగా, షేక్ హసీనా, ఖలీదా జియా నేతృత్వంలోని ప్రధాన రాజకీయపార్టీలను కలిపి ఎన్నికల్లో పోటీ చేయించేదిశగా ఆయన ఆలోచన చేస్తున్నారని వర్గాలు చెబుతున్నాయి. అయితే, యూనస్‌ను అధికారంలో నుంచి తప్పించడంలో జమాన్ విఫలమైతే, పరిస్థితిని తాత్కాలికంగా తన ఆధీనంలోకి తీసుకొని దేశం రాజకీయంగా స్థిరంగా ఉండేలా చూస్తారని సమాచారం.

**అత్యవసర పరిస్థితి దిశగా సైన్యం పావులు కదుపుతోందా?:** ఎన్నికల ప్రక్రియలో జాప్యం రాజ్యాంగ నిబంధనలకు విరుద్ధమవుతుందని భావిస్తున్న సైన్యం, అధ్యక్షుడు మహమ్మద్ షాబుద్దీన్‌ను అత్యవసర పరిస్థితిని ప్రకటించమని ఒత్తిడి చేస్తున్నట్టు నిఘా వర్గాలు పేర్కొన్నాయి. అలాంటి సందర్భంలో తాత్కాలిక ప్రభుత్వాన్ని రద్దు చేసి, ఎన్నికల ప్రక్రియను వేగవంతం చేయమని కోరే అవకాశం ఉంది. బంగ్లాదేశ్ రాజ్యాంగంలోని ఆర్టికల్ 58 ప్రకారం, అవసరమైతే అధ్యక్షుడు తక్షణ అధికారాలు చేపట్టే అధికారం పొందుతారు. ఇదే అధికారం ద్వారా యూనస్‌ను అధికారానికి దూరం చేయాలని సైన్యం భావిస్తున్నట్టు సమాచారం. 2007 తరహాలో మళ్లీ రాజ్యాంగ అస్పష్టత వస్తోందని ఇది కొత్త పరిణామం కాదని నిఘా వర్గాలు గుర్తు చేస్తున్నాయి. 2007లో కూడా బంగ్లాదేశ్‌లో సైనిక మద్దతుతో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడింది. అప్పటిలాగే ఇప్పుడు కూడా అదే స్క్రిప్ట్ తిరిగి నడుస్తున్నట్టు తెలుస్తోంది. జమాన్ – యూనస్ తీసుకుంటున్న కొన్ని నిర్ణయాలు, విదేశీ జోక్యం, రఖైన్ కారిడార్ ప్రతిపాదనలు, దేశ భద్రతకు ముప్పుగా మారతాయన్న ఉద్దేశంతో తాము జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఉందని భావిస్తున్నట్టు సమాచారం. జమాన్ ఇప్పటికే నావికాదళం, వైమానిక దళాల అధిపతుల మద్దతు పొందారు. ఇప్పుడు ప్రజల మద్దతు కూడా తనవైపుగా తిప్పేందుకు యత్నిస్తున్నారు.

# యుద్ధోన్మాదంతో పుతిన్

## అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీవ్ర ఆగ్రహం



**వాషింగ్టన్, మే 26:** రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాల్పుల విరమణకు సంబంధించి ఒకవైపు చర్చలు జరుగుతున్న వేళ పుతిన్ సైన్యం అతిపెద్ద వైమానిక దాడులు చేయడంపై మండిపడ్డారు. పుతిన్ పూర్తిగా పిచ్చిపట్టినట్లుగా ప్రవర్తిస్తున్నారని తన ట్రూత్ సోషల్‌లో ఓ పోస్ట్ చేశారు. రష్యా అధ్యక్షుడు పుతిన్ నాకు చాలా కాలంగా తెలుసు. ఆయనతో ఎప్పుడూ నాకు మంచి సంబం ధాలే ఉన్నాయి. కానీ ఆయనకు ఏదో జరిగింది. పూర్తిగా పిచ్చిపట్చినట్లుగా ప్రవర్తిస్తున్నారు. ఎటువంటి కారణం లేకుండానే ఉక్రెయిన్ నగరాలపై క్షిపణులు, డ్రోన్లతో విరుచుకుపడుతున్నారు. అనవసరంగా చాలా మందిని చంపేస్తున్నారు. పుతిన్ ఉక్రెయిన్‌లో కొంత భూభాగాన్ని కాదు, ఆదేశం మొత్తాన్ని స్వాధీనం చేసుకోవాలని కోరుకుంటున్నారు. ఆయన దృష్టిలో అది సరైనదే కావొచ్చు. కానీ, ఇది రష్యా పతనానికే దారితీస్తుందని పేర్కొన్నారు. ఇక ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తీరును కూడా ట్రంప్ విమర్శించారు. జెలెన్‌స్కీ మాట్లాడే విధానం కూడా ఆ దేశానికి ఏమాత్రం మేలు చేయదని అన్నారు. ఆయన నోటి నుంచి వచ్చే ప్రతి మాటా సమస్యలు సృష్టిస్తోందని చెప్పారు. ఇది మంచి పద్ధతి కాదని, ఇకనైనా ఆపాలని పేర్కొన్నారు. మూడేళ్ల క్రితం తాను అమెరికా అధ్యక్షుడిగా ఉండి ఉంటే, ఈ యుద్ధం మొదలయ్యేదే కాదని పునరుద్ఘాటించారు. అసమర్థత, ద్వేషంతో మొదలైన ఈ ఉద్రిక్తతలను ఆపేందుకు ప్రయత్నిస్తున్నామని డొనాల్డ్ ట్రంప్ రాసుకొచ్చారు. ఉక్రెయిన్‌పై రష్యా ఆదివారం భీకర దాడులు చేసింది. రాజధాని కీవ్ సహా పలు ప్రాంతాలు లక్ష్యంగా రష్యా సైన్యం 367డ్రోన్లు, క్షిపణులు ప్రయోగించింది. మూడేళ్లుగా జరుగుతున్న యుద్ధంలో ఇదే అతిపెద్ద వైమానిక దాడి అని ఉక్రెయిన్ అధికా రులు పేర్కొన్నారు. ఈ దాడుల్లో 12 మంది మృతి చెందగా, చాలా మంది గాయపడ్డారు. మృతుల్లో ముగ్గురు చిన్నారులు ఉన్నట్లు తెలు స్తోంది. దీనిపై ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ స్పందిస్తూ, అమెరికా మౌనంగా ఉంటే అది పుతిన్ ను మరింత ప్రోత్సహించినట్లు అవుతుందని విమర్శించారు.

# సిందూర్ దాడుల తర్వాతనే పాక్‌కు సమాచారం ఇచ్చాం

## కాంగ్రెస్ ఆరోపణలు తప్పుపట్టిన విదేశాంగమంత్రి జైశంకర్



**న్యూఢిల్లీ,మే 26:** ఆపరేషన్ సిందూర్ దాడులు గురించి పాకిస్థాన్‌కు ముందే సమాచారం ఇచ్చారని కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఆరోపణలను కేంద్రప్రభుత్వం ఖండించింది. కాంగ్రెస్ తప్పుడు ప్రచారాలు చేస్తోందని మండిపడింది. ఉగ్ర స్థావరాలపై దాడులు పూర్తయ్యాకే పాకిస్థాన్‌కు సమాచారం అందించామని తెలిపింది. ఈ మేరకు విదేశాంగశాఖకు చెందిన కాన్సులేటీవ్ కమిటీ ఆఫ్ పార్లమెంట్ సమావేశం సందర్భంగా విదేశాంగ మంత్రి జైశంకర్ స్పష్టతనిచ్చారు. ఆపరేషన్ సిందూర్‌లో ఉగ్ర స్థావరాలపై దాడులు పూర్తయ్యాకే పాకిస్థాన్‌కు చెందిన డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్ (డీజీఎంవో)కు సమాచారం అందించాం. ఎంపీల బృందాలు ప్రపంచంలోని వివిధ ప్రదేశాల్లో పర్యటిస్తున్నాయి. అందుకే దేశం మొత్తం ఒక్కతాటిపై నడవాలని జైశంకర్ అభ్యర్థించారు. ఆపరేషన్ సిందూర్ పాక్ దళాల విశ్వసనీయత, నైతికతను దెబ్బతీసిందని జైశంకర్ చెప్పారు. ఉగ్రవాదంపై భారత వైఖరిని మూడు దేశాల తప్ప మిగిలిన దేశాలు విమర్శించలేదని ఆయన పేర్కొన్నారు. భారత్ తీసుకున్న నిర్ణ యాన్ని ప్రపంచ దేశాలు ప్రశంసిం చాయని వెల్లడించారు. ఉగ్రస్థావ రాలపై ఆపరేషన్ కంటే ముందే పాక్ చెప్పినట్లు కాంగ్రెస్ ప్రచారం చేయడం వాస్తవాలను వక్రీక రించడమేనని ఆయన వ్యాఖ్యానించారు. అయితే పాకిస్థాన్ సమాచారం విషయంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్రంగా తప్పుపట్టిన విషయం తెలిసిందే. ఇస్లామాబాద్‌కు ముందు గానే ఆపరేషన్ విషయం చెప్పడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఈ మేరకు కాన్సులేటీవ్ కమిటీ ఆఫ్ పార్లమెంట్ సమావేశంలో జైశంకర్ స్పందించినట్లు ఉన్నారు. దాడుల తర్వాతే డిజిఎంఒ స్థాయిలో పాక్ సంప్రదింపులు జరిపిందని జైశంకర్ చెప్పారు.

# 8 రాజ్యసభ స్థానాలకు ద్వైవార్షిక ఎన్నికలు



**న్యూఢిల్లీ,మే 26:** రాజ్యసభలోని ఎనిమిది స్థానాలకుగాను ఎన్నికల సంఘం ద్వైవార్షిక ఎన్నికలు నిర్వహించనున్నది. తమిళనాడు, అస్సాం రాష్ట్రాల్లో ఉన్న ఎనిమిది స్థానాలకు జూన్ 19న ఎన్నికలు నిర్వహించి అదేరోజు ఫలితాలుకూడా ప్రకటిస్తుంది. రాష్ట్రాల శాసనసభ, మండళనుంచి రాజ్యసభకు ప్రాతినిద్యం వహిస్తున్న ఈ సభ్యుల కాలపరిమితి జూన్, జులైల్లోనే ముగుస్తోంది. అందువల్లనే ఈ రెండురాష్ట్రాల్లో రిటైర్ అవుతున్నవారిస్థానంలో మళ్లీ ఎన్నికలు నిర్వహిస్తోంది. అస్సాంలో రెండు స్థానాలు ఖాళీ అవుతున్నాయి. మిషన్ రంజన్‌దాస్, బీరేంద్ర ప్రసాద్ బైష్యలు రిటైర్ అవుతున్నారు. జూన్14వ తేదీ వారు రిటైర్ అవుతున్నారు. ఇక తమిళనాడులో అయితే ఆరుగురు రాజ్యసభ సభ్యులు రిటైర్ అవుతున్నారు. వచ్చేనెల 24వ తేదీవరకూ వారికి పదవీకాలం ఉంటుంది. వార అన్బుమణిరామ్‌దాస్, ఎం షన్ముగం, ఎన్ చంద్రశేగరన్, ఎం మహ్మద్ అబ్దుల్లా, పి విల్సన్, వైకోలు ఉన్నారు. వచ్చేనెల 2వ తేదీ నోటిఫికేషన్ జారీ అవుతుంది. నామినేషన్ల దాఖలుకు చివరితేదీ జూన్‌తొమ్మిదిగా నిర్ణయించారు. జూన్ పదవ తేదీ పరిశీలన జరుగుతుంది. ఉపసంహరణకు జూన్12వ తేదీగా నిర్ణయించారు. కమిషన్ ఈ ఎ న్నికల్లో వయెలెట్ రంగు స్కెచ్‌పెన్నులను మాత్రమే వినియోగిస్తోంది. బ్యాలట్‌పత్రాలపై మార్కింగ్‌నకు ఈ రంగు పెన్నులు మాత్రమే వినియోగించేందుకు అనుమతించింది. ఎన్నిక సజావుగా సాగేందుకు పరిశీలకులను నియమిస్తున్నామని, అదనంగా కొవిడ్19 మార్గదర్శకాలు కూడా పాటించాలని ఆదేశించింది. పోలింగ్‌ముగిసిన వెంటనే లెక్కింపును ప్రారంభిస్తారు. జూన్ 23నాటికల్లా మొత్తం ఎన్నికల ప్రనరకియ ముగుస్తుందని ఇసి తెలిపింది. అలాగే ఇదే జూన్ 19వ తేదీ ఎన్నికల సంఘం ఐదు శాసనసభ స్థానాలకు ఉప ఎన్నికలు కూడా నిర్వహిస్తోంది.

# పాకిస్థాన్‌లో జ్యోతికి వీఐపి భద్రత

## ఎకె47తో ఆరుగురు సెక్యూరిటీ



**న్యూఢిల్లీ, మే 26:** దేశ రహస్యాలను పవిత్ర యాత్రాస్థలాల వివరాలను శతృదేశానికి చేరవేసిందన్న అభియోగాలపై ఎన్ఐఎ అరెస్టుచేసిన హర్యానా యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా పాకిస్తాన్ పర్యటనలో ఆమెకు అడుగడుగునా ఎకె47తో కూడిన భద్రతను కల్పించారు. కనీసం ఆరుగురు సాయుధ సిబ్బంది ఆమెకు భద్రతగా వెళ్లారు. లాహోర్‌లోని అనార్కలి బజార్‌లో ఆమె పర్యటించిన దృశ్యాలు ఆమె ఫోన్‌లనుంచే వైరల్ అయ్యాయి. అదే సమయంలో ఒక స్కాటిష్ యూట్యూబర్‌కూడా పాక్‌లో పర్యటిస్తు ఆమెకు ఎందుకంత సెక్యూరిటీ ఇచ్చారని ఆశ్చర్యపోయినట్లు తేలింది. కాల్లమ్ అబ్రాడ్ పేరిట నిర్వహిస్తున్న యూట్యూబ్ నిర్వాహకుడు కాల్లమ్ మిల్ గత మార్చిలో పాకిస్తాన్‌లోపర్యటించాడు. లాహోర్‌లోని అనార్కలి బజార్‌పర్యటనలో అనేకమంది సాయుధ సిబ్బంది జాకెట్లు ధరించి మరీ అక్కడ తిరుగుతుండటం చూసాడు. వారిమధ్యనుంచే జ్యోతి మల్హోత్రా విడియో షూట్‌చేయడం కూడా చూసాడు. తనను తాను జ్యోతితో పరిచయం చేసుకున్న కాల్లమ్‌ను ఎన్నిసార్లు వచ్చారని అడిగితే ఐదుసార్లు వచ్చానని చెప్పాడు. మీరు ఇండియాకు వచ్చినపుడు నేను కూడా పరిచయం చేస్తానని, పాకిస్తాన్ ఆతిథ్యం ఎలా ఉందని కాల్లంమ్‌ప్రశ్నిస్తే జ్యోతి చాలా గొప్పగా ఉందని బదులిచ్చిందని చెప్పాడు. ఆమెకోసమే ఈ సెక్యూరిటీ ఉందని అప్పుడు కాల్లం గుర్తించాడు. ఆమెచుట్టూ ఆరుగురు ఎకె47 తుపాకులతో ఉన్నారన్నారు. మరికొందరు పర్యాటకులుగా ఉన్నారని వారుకూడా జ్యోతి మల్హోత్రతో ఉన్నారన్నారు. అయితే సాయుధులు యూనిఫామ్‌లో లేరని సాదా దుస్తుల్లోనే కనిపించినట్లుస్కాటిష్ యూట్యూబర్ తెలిపాడు. ఆమెకు ఎందుకంత బందోబస్తు ఇచ్చారు. ఇంటెలిజెన్స్‌లోని అత్యున్నతస్థాయి అధికా రులతోకూడా ఆమెకు పరిచయాలు న్నాయని స్కాటిష్ యూట్యూబర్ తన విడియోలో తెలిపాడు. అంతేకాకుండా భారత్‌కు వచ్చినతర్వాత జ్యోతిని అరెస్టుచేసిన ఎన్ఐఎ, పోలీసులు దర్యాప్తులో తేలింది. జ్యోతివద్దనుంచి మొత్తం ఆమె వినియోగించే ఎలక్ట్రానిక్ పరికరాలన్నింటినీ స్వాధీనంచేసుకున్నట్లు తేలింది. పాకిస్తాన్‌లో మాత్రం జ్యోతికి వీఐపి ట్రీట్‌మెంట్ లభించిందని స్కాటిష్ యూట్యూబర్ విడియోద్వారా తేలింది.



# పాకిస్థాన్‌కు రహస్యాలు లీక్ చేస్తున్న సిఆర్‌పిఎఫ్ కానిస్టేబుల్!

**న్యూఢిల్లీ, మే 26:** సిఆర్‌పిఎఫ్‌కు చెందిన సిబ్బంది ఒకరు పాకిస్థాన్ ఇంటెలిజెన్స్ అధికారులతో మమేకం అయి భారత్ కీలక సమాచారాలు, రహస్యాలను చేరవేస్తున్నట్లు రూఢికావడంతో ఎన్ఐఎ అరెస్టు చేసింది. మోతిరామ్ జాట్ అనే ఈవ్యక్తి సిఆర్‌పిఎఫ్‌లో పనిచేస్తున్నాడు. రహస్యసమాచారాన్ని, జాతీయభద్రతకు సంబంధించిన కీలక డేటాను పాకిస్తానీ ఇంటెలిజెన్స్ అధికారులకు చేరవేస్తున్నట్లు తేలింది. 2023నుంచి మోతిరామ్ ఈ విద్రోహ చర్యలకు పాల్పడుతున్నట్లు ఎన్ఐఎ గుర్తించింది. అంతేకాకుండా వివిధ ఛానెళ్లనుంచి పిఐఒలు మోతిరామ్‌కు సొమ్ములు కూడా పంపిస్తున్నట్లు ఎన్ఐఎ ఆరాతీసింది. ఢిల్లీలో అరెస్టుచేసిన మోతీరామ్‌ను ప్రస్తుతం ఇంటరాగేషన్ చేస్తున్నారు. వచ్చే జూన్ ఆరవ తేదీవరకూ ఆయన ఎన్ఐఎ కస్టడీలో ఉండాలని స్పెషల్‌కోర్టు ఆదేశించింది. సిఆర్‌పిఎఫ్ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటనచేస్తూ మోతీరామ్‌ను సర్వీసునుంచి డిస్మిస్‌చేస్తున్నట్లు ప్రకటించింది. జాట్ సోషల్‌మీడియా కార్యకలాపాలపై నిఘా వేసిన ఎన్ఐఎ ఇతర కేంద్రేజెన్సీల సాయంతో పక్కాగా సమాచారం రాబట్టింది. తదుపరి విచారణకు మోతీరామ్‌ను ఎన్ఐఎకు అప్పగించినట్లు తెలిపింది. దీనితోపాటుగానే ఈనెల 21వ తేదీనుంచే అమలుకు వచ్చేటట్లు ఆతడిని సిఆర్‌పిఎఫ్ సర్వీసులనుంచి డిస్మిస్ చేస్తున్నట్లు ప్రకటించారు.

# యశ్వంత్‌వర్మ కేసు వివరాలు ఆర్టీఐ కింద ఇవ్వలేం..!

## అర్జీదారుకు సుప్రీంకోర్టు స్పష్టీకరణ



**న్యూఢిల్లీ, మే 26:** యశ్వంత్‌వర్మ ఇంటి ఆవరణలో నోట్లకట్టల వివాదంపై సుప్రీంకోర్టు తీసుకున్న నిర్ణయాలు, అంతర్గత విచారణ నివేదికలు, చీఫ్‌జస్టిస్ సంజీవ్‌ఖన్నా ప్రధాని నరేంద్రమోడీకి రాసిన లేఖలు వంటివాటిని బహిర్గతం చేయాలంటూ సమాచారహక్కు చట్టం కింద దాఖలయిన పిటిషన్‌ను సుప్రీం తిరస్కరించింది. అంతేకాకుండా రాష్ట్రపతి ద్రౌపదిముర్ము, ప్రధానిమోడీలకు ఇచ్చిన సమా చారం వారి స్పందనను కూడా తెలియజేయాలని అన్నారు. సర్వోన్నత న్యాయస్థానం ఈ విచారణ మొత్తం గోప్యంగానే ఉంటుందని, ఆర్‌టిఐ దరఖాస్తును తిరస్కరిస్తున్నట్లు తెలిపారు. పార్లమెంటరీ ప్రతిష్టను ఉల్లంఘించినట్లవు తుందని అందుకే ఆర్టీఐకింద ఇవ్వడం సాధ్యం కాదని తెలియజేసారు. అంతకుముందు మాజీ సిజై ఖన్నా రాష్ట్రపతి, ప్రధానమంత్రులకు తన సిఫారసులను రాసారు. అలాగే త్రిసభ్య కమిటీ ఇచ్చిన నివేదికను కూడా తన లేఖకు జత చేసారు. అలాగే జస్టిస్ వర్మనుంచి వచ్చిన స్పందనను కూడా ఆయన జోడించారు. ఇపుడు కార్యనిర్వాహక వ్యవస్థ, పార్లమెంటు పరిధిలోనే యశ్వంత్‌వర్మపై చర్యల అంశం ఉంటుందని అన్నారు. జడ్జి రాజీనామా చేయాలని చేసిన సూచనలు కూడా అమలుకు రానందున ఆయన్ను పదవీచ్యుతి చేయాల్సిం దేనని సంజీవ్‌ఖన్నా సూచించారు. ముగ్గురు సభ్యుల కమిటీ ఇచ్చిననివేదికలో యశ్వంత్ వర్మకు వ్యతిరేకంగా అనేక సిఫారసులున్నాయని అందువల్ల రాజీనామాచేయడమే మంచిదనిక ఊడా సూచించారు.

మొత్తం 50 మందినుంచి వాం గ్మూలాలను సేకరించారు. ఢిల్లీపోలీస్ కమిషనర్ సంజయ్ అరోరా, ఢిల్లీ ఫైర్‌సర్వీస్ చీఫ్ వంటి ఉన్నతాధికారులనుంచి కూడా నివేదికలు కోరింది. జస్టిస్‌వర్మ అధికారిక నివాసం ల్యూటెన్ ప్రాంతంలో గత మార్చి 14వ తేదీ రాత్రి 11.35 గంటలకు జరిగిన ప్రమాదం అదుపుచేసేందుకు వెళితే అక్కడ నోట్లకట్టలు ఉన్నాయని అన్నారు. మార్చి24వ తేదీ సర్వోన్నత న్యాయస్థానం కొల్లిజియం జస్టిస్ వర్మను తన మాతృ సంస్థ అలహాబాద్ హైకోర్టుకు పంపించింది. అదేనెల 28వ తేదీ సుప్రీంకోర్టు జస్టిస్ వర్మకు ఎలాంటి కేసులు బాధ్యతలు అప్పగించవద్దని అలహాబాద్ హైకోర్టుకు సూచించింది.




# రోడ్‌షోలో మోడీపై పూలు చల్లి స్వాగతం పలికిన సోఫియా ఖురేషి కుటుంబం!

**వదోదర, మే 26:** ఆపరేషన్ సింధూర్ తర్వాత తొలిసారి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గుజరాత్‌లో రెండురోజుల పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ వడోదరలో రోడ్‌షోతో పర్యటనను ప్రారంభించారు. త్రివర్ణపతాకాలతో ప్రధానికి వడోదర ప్రజలు ప్రధాని మోదీకి స్వాగతం పలికారు. ప్రధాని మోదీకి నారీశక్తి స్వాగతం పలికింది మోదీకి 30వేల మంది మహిళలు పూలు చల్లుతూ స్వాగతం పలికారు. ఆపరేషన్ సింధూర్‌తర్వాత తొలిపర్యటన గుజరాత్‌లోచేసిన మోడీకి స్వరాష్ట్రంలో అపూర్వ స్వాగతం లభించింది. ప్రత్యేకించి వేలాదిగా మహిళలు రోడ్లకిరువైపులా బారులు తీరి మోడీ కాన్వాయ్‌పై పూలు చల్లుతూ కనిపించారు. కాగా గుజరాత్‌లోని వడోదరలో ప్రధాని మోదీ పాల్గొన్న సింధూర్ సమ్మాన్‌యాత్రలో కల్నల్ సోఫియా ఖురేషీ కుటుంబం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సోఫియా ఖురేషీ వడోదర చెందినవారు. ఆమె కుటుంబీకులు అక్కడే స్థిరపడ్డారు. ప్రధాని మోదీ వడోదరలోనే రోడ్‌షో చేయడంతో, ఖురేషీ కుటుంబసభ్యులు రోడ్‌షోలో స్పెషల్‌గా కనిపించారు. మోదీపై కల్నల్‌సోఫియా ఖురేషీ కుటుంబ సభ్యులు పూలవర్షం కురిపించారు. ప్రధాని మోదీ వారికి అభివాదం చేశారు. కాగా పహల్గామ్ ఉగ్రదాడిని కల్నల్ సోఫియా ఖురేషీ కుటుం బీకులు ఖండించారు. మోదీ నాయకత్వంలో ఆపరేషన్ సింధూర్ తమకు చాలా గర్వంగా ఉందని సోఫియా సోదరి షాయనా చెప్పారు. భారత్‌వైపు ఎవరైనా చూడాలంటే ఇక భయప^డతారని షాయనా చెప్పారు. మహిళల సిం ధూరం కోసం తన కూతురు యుద్ధం చేయడం తనకు గర్వంగా ఉందని సోఫియా తల్లి చెప్పారు.

# ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు కమాండర్ మనీష్‌యాదవ్ హాతం

**రాంచి, మే 26:** మావోయిస్టు కమాండర్‌గా పేర్కొంటున్న మనిష్‌యాదవ్ సోమవారం జార్ఖండ్‌లోని లతేహార్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో హతమయినట్లు పోలీసులు తెలిపారు. యాదవ్‌పై ఐదు లక్షల రివార్డుకూడా ఉంది. మరో వాంటెడ్ మావోయిస్టు కుందర్ ఖేర్వార్‌పైనా 10 లక్షల నగదు రివార్డు ఉంది. ఆతడిని ఎన్‌కౌంటర్‌ప్రాంతంనుంచే అరెస్టు చేసినట్లు తెలిపారు. కరంఖద్ ప్రాంతం, దౌనా ప్రనాంతాల్లోని అటవీప్రాంతాల్లో ఈ ఎదురుకాల్పులు జరిగినట్లు అధికారులు తెలిపారు. లతేహార్‌పోలీస్‌స్టేషన్ పరిధిలో మావో యిస్టుల సంచారం ఉందన్న సమాచారంతో భారీ ఎత్తున గాలింపు చర్యలకు పాల్పడ్డారు. ఆదివారం రాత్రినుంచే మావోయిస్టులకు, భద్రతా బలగాలకు కాల్పులుప్రారంభం అయ్యాయి.

ఆ తర్వాత తనిఖీల్లో మనిష్ యాదవ్ మృతదేహం లభించిందని పాలము డిఐజి వైఎస్‌రమేష్ తెలిపారు. మనీష్‌యాదవ్ తన బృందంతో అడవుల్లో ఉన్నట్లు సమాచారం అందగానే పోలీస్ టీమ్ ఏర్పాటుచేసి ఆపరేషన్ ప్రారం భించామన్నారు. మావోయిస్టులను గుర్తించిన వెంటనే సెక్యూరిటీ సిబ్బందిపై కాల్పులు ప్రారంభించారని, ప్రతిగా జరిపిన కాల్పుల్లో మనీష్‌యాదవ్ స్పాట్‌లోనే చనిపోయినట్లు తెలిపారు. రెండు ఆటోమేటిక్ తుపాకులు, రోజువారి వినియోగించే సామగ్రి ఆప్రాంతంలో లభించాయన్నారు. బీహార్ కేంద్రంగా ఉన్న మావోయిస్టు యూనిట్లు, బుద్ధపహాడ్ శిక్షణా కేంద్రం కూడా ఇకముగిసినట్లేనని డిఐజి చెప్పారు. గయ జిల్లాలోనిచక్రబంధ ప్రాంతానికి చెందిన యాదవ్ బీహార్‌లోని బుధపహాడ్‌ప్రాంతంలో టాప్ మావోయిస్టు కమాండర్‌గా కొనసాగుతున్నాడు. దశాబ్దకాలంగా పోలీసులకు చిక్కకుండా తిరుగుతున్నాడు. దళంలో ఒక సామాన్య కేడర్‌నుంచి కమాండర్‌స్థాయికి వచ్చాడు. ఇపుడు ఎన్‌కౌంటర్‌ఝరిగిన ప్రాంతంలోనే ఆతని బంధువులు ఉంటున్నారని తెలిపారు. ఈ ఎన్‌కౌంటర్‌తో జార్ఖండ్ పోలీసులు రెండో మేజర్ సక్సెస్‌ను సాధించారు. జజెఎంపి కమాండర్ పప్పు లోహ్రా, సబ్‌జోనల్ కమాండర్ ప్రభాత్ గంఝులను కూడా ఎన్‌కౌంటర్‌లో హత్యచేసారు. లోహ్రా, గంజులపైనా వరుసగా పదిలక్షలు, ఐదు లక్షల రివార్డులున్నాయి.





# గంగూలీ సోదరుడి కుటుంబానికి తృటిలో తప్పిన ప్రాణాపాయం

**పూరి(ఒడిశా)మే 26:** క్రికెటర్ సౌరవ్ గంగూలీ ఫ్యామిలీకి తృటిలో ప్రాణాపాయం తప్పింది. ఒడిశాలో ఆదివారం సౌరవ్ గంగూలీ సోదరుడు స్నేహాశిష్ గంగూలీ మరియు అతని భార్య అర్పితకు సముద్రంలో ప్రమాదం సంభవించింది. వారు ప్రయాణిస్తున్న స్పీడ్ బోట్ మునిగిపోవడంతో తృటిలో తప్పించుకున్నారు. పూరీలో సెలవులను ఎంజాయ్ చేస్తున్న గంగూలీ దంపతులు బీచ్‌లో వాటర్ స్పోర్ట్స్ ఆస్వాదిస్తున్నప్పుడు ఈ సంఘటన జరిగింది. ఈ వీడియో ఇప్పుడు నెట్టింట వైరల్‌గా మారింది. లైఫ్‌గార్డులు పర్యాటకులను రక్షించడానికి ప్రయత్నిస్తుండగా సముద్ర జలాల్లో స్పీడ్ బోట్ తలక్రిందులయింది. అధికారులు వారిని రక్షించడానికి రబ్బరు ఫ్లోట్‌లను ఉపయోగించారు. పడవలో ప్రయాణికుల సామర్థం తక్కువగా ఉండటం వల్ల పడవ తేలికగా ఉండటం వల్ల అది బోల్తా పడిందని అర్పితా గంగూలీ ఆరోపించారు. సముద్రం ఇప్పటికే చాలా అల్లకల్లోలంగా ఉంది. పడవలో 10 మంది సామర్థం ఉంది. కానీ వారు ముగ్గురు నుండి నలుగురు వ్యక్తులను మాత్రమే ఎక్కించుకున్నారు. ఆ రోజు సముద్రంలోకి వెళ్ళిన చివరి పడవ ఇదే. సముద్రంలోకి వెళ్ళడంపై మేము ఆందోళన వ్యక్తం చేసాము, కానీ ఆపరేటర్లు అంతా బాగానే ఉందని మాకు చెప్పారని శ్రీమతి గంగూలీ అన్నారు. సముద్రంలోకి వెళ్ళిన వెంటనే, ఒక పెద్ద అల పడవను ఢీకొట్టిందని ఆమె చెప్పారు. లైఫ్‌గార్డులు రాకపోతే మేము బతికేవాళ్లం కాదన్నారు. పడవలో ఎక్కువ మంది ఉంటే, బహుశా అది తిరగబడి ఉండేది కాదని ఆమె అన్నారు. పడవలను నడిపే ఆపరేటర్ల నైపుణ్యంపై మరింత పరిశీలన చేయాలని గంగూలీ పిలు పునిచ్చారు. అధికారులు ఇక్కడ ఈ క్రీడలను నిషేధించాలి. పూరి బీచ్‌లో సముద్రం చాలా అల్లకల్లోలంగా ఉంటుంది. నేను కోల్‌కతాకు తిరిగి వెళ్లిన తర్వాత, ఇక్కడ జల క్రీడలను నిలిపివేయమని కోరుతూ పోలీసు సూపరింటెండెంట్ మరియు ముఖ్యమంత్రికి లేఖ రాస్తాను అని ఆమె చెప్పారు.

# నరమాంస భక్షకుడికి జీవితఖైదు

**లక్నో, మే 26:** మనిషిని చంపి ఆ తలతో సూప్ చేసుకుని తాగే నరమాంశ భక్షకుడికి ఉత్తర్ ప్రదేశ్ లోని లక్నో కోర్టు జీవిత ఖైదు విధిస్తూ సంచలన తీర్పు వెల్లడించింది. ఇద్దరు వ్యక్తుల హత్యకేసులో ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన సీరియల్ కిల్లర్ రామ్ నిరంజన్ అలియాస్ రాజా కోలందర్, అతడి సహచరుడు బక్షరాజ్‌కు లఖ్‌నవూ కోర్టు జీవితఖైదు విధించింది. కోలందర్ నరమాంస భక్షకుడని, మనిషితలతో చేసిన సూప్ తాగడానికి ఇష్టపడేవాడనే ఆరోపణలు ఉన్నాయి. జడ్జి శిక్ష విధించే సమయంలో కోలందర్ కోర్టు గదిలో నవ్వుతూ కనిపించాడు. అతడిలో ఎటువంటి పశ్చాత్తాపం, భయం కనిపించలేదు. ప్రయాగ్‌రాజ్‌కు చెందిన జర్నలిస్టు ధీరేంద్రసింగ్ హత్యకేసులో కోలందర్‌పై మొదటి ఎఫ్ఐఆర్ నమోదైంది. పోలీసులు ఈ కేసు దర్యాప్తు ప్రారంభించినప్పుడు అతడి బండారం బయట పడి, అనేక ఇతర నేరాలు వెలుగులోకి వచ్చాయి. ధీరేంద్రసింగ్ హత్యకేసు దర్యాప్తు కోసం పోలీసులు కోలందర్ ఫామ్‌హౌసుకు వెళ్లగా అక్కడ మనుషుల పుర్రెలు కనిపించాయి. వాటిని స్వాధీనం చేసుకుని కోలందర్‌ను ప్రశ్నించగా పాతికేళ్ల కిందట 2000 సంవత్సరంలో మనోజ్ అనే వ్యక్తిని, అతడి డ్రైవరు రవిని తానే హత్య చేసినట్లు అంగీకరించాడు. వారి మృతదేహాలను ముక్కలుగా నరికి పూడ్చిపెట్టినట్లు కోలందర్, బక్షరాజ్ వెల్లడించారు. జర్నలిస్ట్ ధీరేంద్రను పిప్రీలోని తన ఫామ్‌హౌస్‌కు పిలిపించి చంపినట్లు కోలందర్ తెలిపాడు.

## భారత్ 'బాయ్‌కాట్' వేళ..

# పాక్-తుర్కియే తొలి భేటీ



**అంకారా, మే 26:** ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్‌కు సాయం చేసిన తుర్కియేపై భారత్‌లో తీవ్ర నిరసనలు వ్యక్తమవుతున్నాయి. ఆ దేశ ఉత్పత్తులను నిషేధించాలంటూ 'బాయ్‌కాట్ తుర్కియే' నినాదం మార్మోగుతోంది. ఈ క్రమంలోనే తాజాగా కీలక పరిణామం చోటు చేసుకుంది. తుర్కియే అధ్యక్షుడు ఎర్డోగాన్‌తో పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ భేటీ అయ్యారు. ఇస్తాంబుల్‌లో ఆదివారం రాత్రి వీరి సమావేశం జరిగింది. ఈ విషయాన్ని వెల్లడిస్తూ పాక్ ప్రధాని చేసిన పోస్ట్ చర్చనీయాంశంగా మారింది. 'నా ప్రియమైన సోదరుడు ఎర్డోగాన్‌తో గౌరవప్రద భేటీ జరిగింది. భారత్‌తో ఉద్రిక్తతల సమయంలో మాకు అండగా నిలిచినందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నా. వాణిజ్యం, పెట్టుబడులకు సంబంధించి ఇరు దేశాల మధ్య ఉన్న ద్వైపాక్షిక ఒప్పందాలను సమీక్షించాం. ఇరు దేశాల మధ్య పరస్పర సహకారాన్ని మరింత ముందుకు తీసుకెళ్తాం. పాక్-తుర్కియే స్నేహబంధం సుదీర్ఘకాలం కొనసాగాలి' అని షెహబాజ్ షరీఫ్ పోస్టులో రాసుకొచ్చారు. అటు పాక్ ఆర్మీ చీఫ్ మునీర్ కూడా షెహబాజ్ వెంట వెళ్లారు. దీనిపై ఎర్డోగాన్ కూడా స్పందించారు. ఇరు దేశాల మధ్య బలమైన స్నేహబంధం ఉందని అన్నారు. రాజకీయ, వాణిజ్య రంగాల్లో చారిత్రక బంధాన్ని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామన్నారు. 'ఆపరేషన్ సిందూర్' తర్వాత వీరిద్దరూ భేటీ అవడం ఇదే తొలిసారి. భారత్-తుర్కియే మధ్య విభేదాలు నెలకొన్న వేళ ఈ పరిణామాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

## 28న ఆర్జీయుకెటి అడ్మిషన్ నోటిఫికేషన్ విడుదల

### ఆరేళ్ల బిటెక్ ఇంటిగ్రేటెడ్ కోర్సుల్లో ప్రవేశాలు

**హైదరాబాద్, మే 26, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కొనసాగుతున్న ఒకే ఒక్క ట్రిపుల్ ఐటీ రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జి టెక్నాలజీస్ (ఆర్జీయూకేటీ)లో ప్రవేశాలకు ఈ నెల 28(బుధవారం)న నోటిఫికేషన్ వెలువడనుంది. బాసర లోని ఆర్జీయూకేటీలో 6 ఏళ్ల ఇంటిగ్రేటెడ్ బి.టెక్ ప్రోగ్రాం ప్రవేశాలకు నోటిఫికేషన్‌ను 28 విడుదల చేయాలని నిర్ణయించినట్టు యూనివర్సిటీ ఇన్‌ఛార్జ్ విసి ప్రొఫెసర్ ఏ గోవర్ధన్ తెలిపారు. ఆర్జీయూకేటీలో 2025-26 విద్యాసంవత్సరానికిగాను 6 ఏళ్ల ఇంటిగ్రేటెడ్ బి.టెక్ ప్రోగ్రామ్‌లో ప్రవేశాలకు సంబంధించిన నోటిఫికేషన్‌ను 28న విడుదల చేయనున్నామని, ప్రవేశాలకి సంబంధించిన పూర్తి షెడ్యూల్ త్వరలో విశ్వవిద్యాలయ వెబ్‌సైట్‌లో పొందుపరచబడుతుందని విసి తెలి పారు. వివరాలకు విశ్వవిద్యాలయ అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు. ఈ ఏడాది నుంచి ఆర్జీయూకేటీలోని 1500 సీట్లతోపాటు అదనంగా మరో కొత్త కోర్సులను ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రారంభించనున్నట్టు తెలిసింది. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌తోపాటు డాటాసైన్స్, మెషన్ లెర్నింగ్ కోర్సులను ప్రారంభించాలని.. ఒక్కో కోర్సులో 60 సీట్ల చొప్పున 180 సీట్లలో అడ్మిషన్లను తీసుకోనున్నట్టు తెలిసింది.

## తెలుగు వర్సిటీ రెగ్యులర్ కోర్సుల ప్రవేశం

**హైదరాబాద్ (నాంపల్లి), మే 26, ప్రభాతవార్త :** సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం 2025 విద్యాసంవత్సరానికిగాను వివిధ రెగ్యులర్ కోర్సుల ప్రవేశ ప్రకటనను సోమవారం విడుదల చేసింది. తెలుగు విశ్వవిద్యాలయం నిర్వహించే శిల్పం-చిత్రలేఖనం, డిజైన్, సంగీతం, రంగస్థలం, శాస్త్రీయ నృత్యం (కూచిపూడి, ఆంధ్రనాట్యం), జానపదం, తెలుగు, చరిత్ర, పర్యా టకం, భాషాశాస్త్రం, జర్నలిజం, జ్యోతిషం, యోగా కోర్సుల కొరకు ఎం.ఎ; డిగ్రీ; డిప్లొమా; సర్టిఫికెట్ ప్రోగ్రాంలలో అర్హత కలిగిన ఆశక్తిగత విద్యార్థుల ప్రవేశం కోసం విశ్వవిద్యాలయం ఆన్‌లైన్ ద్వారా అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరుతుంది. పూర్తి వివరాల కోసం విశ్వవిద్యాలయం వెబ్‌సైట్లు డబ్ల్యు డబ్ల్యుడబ్ల్యు.తెలుగుయూనివర్సటీ.ఏసి.ఇన్; డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు. పిఎస్‌టియుసెట్.ఓఆర్‌జి (ఆర్గ్)లను సందర్శించాలని, పూర్తిచేసిన దరఖాస్తులను తేదీ 24-6-2025లోగా సాధారణ రుసుముతో; తేదీ 30-6-2025 వరకు ఆలస్య రుసుముతో స్వీకరించడం జరుగుతుందని విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఈ ప్రకటనలో తెలిపారు.

## స్కిల్ వర్సిటీ నిర్మాణానికి ఒక్క గోడైనా కనీసం నిర్మించారా?

### బిజెపి పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి అమర్‌నాథ్

**హైదరాబాద్, మే 26, ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 16 నెలలుగా ఒక్క సిమెంట్ బస్తా వినియోగించని దుస్థితిలో ఉన్నారని, యంగ్ ఇండియా నా బ్రాండ్ అని చెప్పుకుంటూ స్కిల్ యూనివర్శిటీ నిర్మాణానికి కనీసం ఒక్క గోడైనా కట్టించారా? బిజెపి పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి అమర్‌నాథ్ సారంగుల ప్రశ్నించారు. సోమవారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. అభివృద్ధి చేయలేక కేంద్రం ఏం చేయలేదు, మోడీ ఏం ఇవ్వలేదంటూ పిచ్చి ఆరోపణలు చేయడం తప్ప సిఎం దగ్గర ఇంకోటి లేదన్నారు. హైదరాబాద్ నగరానికి ప్రత్యేక శ్రద్ధ అవసరం. జిహెచ్‌ఎంసి పరిధిలో 100 కోట్లకు ఎకరం విలువైన ప్రాంతాల్లో రోడ్ల మీద గుంతలే కనిపిస్తున్నాయన్నారు. రాష్ట్రం రూ.3 లక్షల కోట్ల బడ్జెట్ ప్రవేశపెట్టినా, జిహెచ్‌ఎంసికి కేవలం రూ.3000 కోట్లు కేటాయించి, వాటిని కూడా పూర్తిగా వినియోగించలేని దౌర్భాగ్య స్థితిలో ఉందన్నారు. ఇటీవల పాతబస్తీ చార్మినార్ వద్ద జరిగిన అగ్ని ప్రమాదంలో 17 మంది మృతి చెందారు. అగ్నిమాపక శాఖకు కేటాయించిన మొత్తం బడ్జెట్ కేవలం రూ.10 కోట్లు అన్నారు. అగ్ని ప్రమాదం జరిగిన గంటన్నర తర్వాత ఫైర్ సిబ్బంది వచ్చారు. ఇదేనా గవర్నెన్స్ అన్ని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీలో అభివృద్ధికి చోటేలేదు. వారి పాలన అంటే డిస్ట్రక్షన్, కూల్చివేతలు, రైతు ఆత్మహత్యలు అన్నారు. హైదరాబాద్ నగరంలో అభివృద్ధి చేయకుండా పేదల ఇళ్లను కూల్చడం తప్ప ఇంకోటి కనిపించడంలేదన్నారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఒక్క పార్క్ అయినా కట్టించండి, ఒక్క చెరువు అయినా పునరుద్ధరించండి అంటూ సవాల్ విసిరారు.



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న బండ ప్రకాష్, హరీశ్‌రావు

## ముదిరాజ్‌లకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

### లేదంటే యుద్ధానికి సిద్ధమవుతాం

### శాసనమండలి వైస్‌చైర్మన్ బండ ప్రకాష్

**నంగునూర్, మే 26, ప్రభాతవార్త :** కాంగ్రెస్ సర్కారు ముదిరాజ్‌లకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని.. హామీలు నెరవేర్చకుంటే యుద్ధానికి సైతం సిద్ధమవుతామని శాసన మండలి వైస్‌చైర్మన్ బండ ప్రకాష్ అన్నారు. సిద్దిపేట జిల్లా నంగునూర్ మండలం పాలమాకులలో సోమవారం పండగ సాయన్నా ముదిరాజ్,కొరవి కృష్ణస్వామి ముదిరాజ్‌ల విగ్రహాలను మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావుతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చి 70 యేళ్లు అయినా పేద ముదిరాజ్‌లకు సంక్షేమ పథకాలు అందడం లేదన్నారు. కెసిఆర్ హయాంలోనే మత్స్యకారులకు న్యాయం జరిగిందన్నారు. తెలంగాణ వచ్చాక ప్రముఖుల విగ్రహాలను పెట్టుకొని గుర్తుచుకుంటున్నామన్నారు. మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు మాట్లాడుతూ అందాల పోటీల నిర్వహణకు ప్రభుత్వం వద్ద పైసలు ఉన్నాయి కానీ రైతులకు విత్తనాలు, మత్స్యకారులకు చేపపిల్లలు ఇవ్వడానికి మాత్రం పైసలు లేవట అని అన్నారు. కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, బిఆర్‌ఎస్ శ్రేణులు జాప శ్రీకాంత్‌రెడ్డి, రాగుల సారయ్య, ఎడ్ల సోమిరెడ్డి, దువ్వల మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



## లంచం తీసుకుంటూ ఎసిబికి చిక్కిన ఖమ్మం రూరల్ సబ్‌రిజిస్ట్రార్ అరుణ

**ఖమ్మం రూరల్, ప్రభాతవార్త:** ఖమ్మం రూరల్ మండలం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం లో ఏసీబీ డీఎస్పీ వై రమేష్ ఆధ్వర్యంలో సోమవారం తనిఖీలు నిర్వహించారు. ఓ వ్యక్తి నుండి 30,000 లంచం తీసుకుంటు రూరల్ సబ్ రిజిస్టర్ అరుణ ఏసీబీ అధికారులకు చిక్కారు. ఓ డాక్యుమెంట్ రైటర్ ద్వారా గిఫ్ట్ డీడ్ రిజిస్ట్రేషన్ కోసం 50 వేల రూపాయల డిమాండ్ చేసి 30 వేల రూపాయలు లంచం తీసుకుంటుండగా పట్టుకున్నట్లు ఏసీబీ డీఎస్పీ వై రమేష్ తెలిపారు. మొదట యాభై వేలు డిమాండ్ చేసి 30 వేల రూపాయలు తీసుకునేందుకు అంగీకరించినట్లు తెలిపారు.

# ట్రాఫిక్ అసిస్టెంట్లుగా ట్రాన్స్‌జెండర్లు భేష్



### పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

**హైదరాబాద్, మే 26, ప్రభాతవార్త :** ట్రాఫిక్ అసిస్టెంట్లుగా ట్రాన్స్‌జెండర్లు సమర్థతను నిరూపించుకున్నారని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. సోమవారం సచివాలయంలో ట్రాఫిక్ అసిస్టెంట్లుగా విధులు నిర్వర్తిస్తున్న ట్రాఫిక్ జెండర్‌లతో మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 6 నెలల క్రితం ప్రయోగాత్మకంగా మహిళా శిశు సంక్షేమ, వృత్తిలో దివ్యాంగులు ట్రాన్స్‌జెండర్ల సంక్షేమ శాఖ ద్వారా 44 మందిని ట్రాఫిక్ అసిస్టెంట్‌గా నియమించిన ప్రభుత్వం.. దేశంలో మొట్ట మొదటిసారిగా ట్రా ఫిక్ అసిస్టెంట్‌గా ట్రాన్స్ జెండర్లు 10 రోజుల్లోనే ట్రాఫిక్ అసిస్టెంట్లుగా ట్రాన్స్ జెండర్‌లో నియమించి రికార్డు సృష్టించిందన్నారు. గత ఆరు నెలల్లో సకాలంలో విధులకు హాజరై తమ అంకిత భావాన్ని ప్రదర్శించారని, ఎంతో క్లిష్టమైన ట్రాఫిక్ డ్యూటీని క్రమశిక్షణతో నిర్వహిస్తున్నారన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణలోని ట్రాఫిక్ అసిస్టెంట్లుగా ట్రాన్స్‌జెండర్‌లను నియమించామన్నారు. ఇదే విషయాన్ని కేంద్ర మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రాజస్థాన్ ఉదయపూర్‌లో నిర్వహించిన చింతన్ శివిర్‌లో తాను ప్రత్యేకంగా ప్రస్తావించినట్లు చెప్పారు. పోలీస్ శాఖలోనే కాకుండా ఇతర శాఖలో కూడా ట్రాన్స్ జెండర్‌లను నియమించే ఆలోచనతో సిఎం ఉన్నట్లు తెలిపారు. పోలీస్ డ్రెస్‌లో ట్రాన్స్ జెండర్‌లను చూసి సామాన్యులు సెల్యూట్ కొడుతున్నారన్నారు. కమ్యూనిటీ సమావేశాలు ఏర్పాటు చేసుకొని తోటి ట్రాన్స్ జెండర్‌లలో నమ్మకం కలిగించాలని, ప్రభుత్వ సహాయాన్ని అందుకునేలా వారిని ప్రోత్సహించాలన్నారు. ట్రాన్స్‌జెండర్‌ల ఆరోగ్య పరిరక్షణ కోసం త్వరలో మరిన్ని మైత్రి క్లినిక్లను ప్రారంభిస్తామన్నారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ అసిస్టెంట్లుగా తమకు అవ కాశం కల్పించిన మంత్రి సీతక్కను, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సివి ఆనంద్‌ను ట్రాన్స్‌జెండర్లు సన్మానించారు. ఈ సమావేశంలో మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనిత రామచంద్రన్, వృద్ధులు, దివ్యాంగులు ట్రాన్స్ జెండర్ల శాఖ జాయింట్ డైరెక్టర్ శైలజ, ప్రముఖ రచయిత్రి, మహిళా హక్కుల నేత కొండవీటి సత్యవతి, ప్రజ్వల ఫౌండేషన్ ప్రతినిధులు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## రాహుల్ వల్లనే దేశంలో సాకారం కానున్న కులగణన

### దేశంలో విస్తృత కులగణనకు కేంద్రం రూ.8వేల కోట్లు కేటాయించాలి

### అఖిల భారత కాంగ్రెస్ ఒబిసి రౌండ్‌టేబుల్ సమావేశంలో మంత్రి పొన్నం

**హైదరాబాద్, మే 26, ప్రభాతవార్త:** కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత అయిన రాహుల్‌గాంధీ వల్లనే దేశంలో కులగణన సాకారం కాబోతుందని తెలంగాణ బిసి సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. తమ ఒత్తిడి వల్లనే కేంద్ర ప్రభుత్వం కులగణన చేపట్టాలని నిర్ణయం తీసుకుందనే విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడానికి కాంగ్రెస్ పార్టీ ప్రణాళికను సిద్ధం చేసుకుంటోంది. అందులో భాగంగా సోమవారం దేశ రాజధాని ఢిల్లీలోని ఇండియా ఇంటర్నేషనల్ సెంటర్‌లో ఓబీసీ ప్రతినిధులతో రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించింది. సమావేశంలో ఏఐసిసి నాయకులు, పిసిసి అధ్యక్షులు, ఓబిసి మంత్రులు, బిసి ఎంపిలు, ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్య నేతలు పాల్గొన్నారు. సమావేశంలో తెలంగాణ రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. రాహుల్ గాంధీ వల్లన దేశంలో కులగణన సాకారం కాబోతుందని.. రాహుల్ గాంధీకి ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలుపడం, తదుపరి కార్యాచరణ ఖరారు చేసుకోవాలనే ఉద్దేశంతోనే కాంగ్రెస్ పార్టీ ఓబీసీ నేతలు, ప్రజా ప్రతినిధులు సమావేశమ య్యామని తెలిపారు. రాహల్ గాంధీ డిమాండ్ చేసి కేంద్రంపై ఒత్తిడి తీసుకురావడం వల్లనే కేంద్ర ప్రభుత్వం కూడా దేశ వ్యాప్తంగ కుల గణనకు నిర్ణయం తీసుకుందన్నారు. దేశ వ్యాప్తంగా కుల గణన చేసేందుకు కేంద్ర బడ్జెట్‌లో రూ.500 కోట్లను మోడీ ప్రభుత్వం కేటాయించిందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.అయితే దేశంలో కుల గణన చేసేందుకు సుమారు రూ.8 వేల కోట్ల రూపాయలు అవసరమని అంచనా ఉందని మంత్రి పొన్నం తెలిపారు. కులగణన పూర్తికి నిర్దిష్ట కాలపరిమితి కూడా కేంద్ర ప్రభుత్వం నిర్ధారించలేదని.. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వంపై మరింత ఒత్తిడి తేవాలని.. కాంగ్రెస్ పార్టీకి చెందిన ఓబీసీ నేతల అభిప్రాయం తీసుకున్నామని తెలిపారు. అన్ని అంశాలపై చర్చించిన నేపథ్యంలో తదుపరి కార్యాచరణపై నిర్ణయం తీసుకుంటామన్నారు. లక్షలాది మందితో పెద్ద ఓబీసీ ర్యాలీని కూడా నిర్వహించాలని నిర్ణయం తీసుకుంటామని పొన్నం ప్రభాకర్ తెలిపారు. సమావేశంలో తెలంగాణలో ప్రజా ప్రభుత్వం చేసిన కులగణన గురించి మంత్రి పొన్నం ప్రభాకర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కులగణన అనంతరం సామాజిక న్యాయం జరిగేలా రాజకీయ, విద్యా, ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్లు పెంచుతూ చట్టం చేసిందని దానికి అన్ని పార్టీలు మద్దతు ఇచ్చారని మంత్రి పొన్నం తెలిపారు.

## నకిలీవిత్తన సరఫరాదారులపై క్రిమినల్ కేసులు పెట్టాలి

### డిజిపికి ఫిర్యాదు చేసిన బిజెపి ఎస్‌టి మోర్చా అధ్యక్షుడు కళ్యాణ్‌నాయక్

**హైదరాబాద్, మే 26, ప్రభాతవార్త:** రాష్ట్రంలో నకిలీ విత్తనాలను సరఫరా చేసిన కంపెనీలపై మనీలాండరింగ్ యాక్ట్, అలాగే యజమానులపై పిడియాక్ట్ కింద క్రిమినల్ కేసులు నమోదు చేయాలని బిజెపి ఎస్‌టి మోర్చా అధ్యక్షులు కళ్యాణ్‌నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ములుగు జిల్లా వెంకటాపురం ఏజెన్సీ ప్రాంతాల్లో నకిలీ విత్తనాల వల్ల తీవ్రంగా నష్టపోయిన గిరిజన రైతులకు న్యాయం కల్పించాలంటూ బిజెపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర బృందం, డిజిపిని కలిసి ఫిర్యాదు చేసింది. ఈ సందర్భంగా డా. కళ్యాణ్ నాయక్ మాట్లాడుతూ గత కొద్ది నెలలుగా ఎస్ఐఎంజెఎఎన్‌టిఎ, హైటెక్, భేయర్, ఎస్ఐబిఐ వంటి కంపెనీలు నకిలీ విత్తనాలను సరఫరా చేస్తున్నాయని ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం ఇచ్చిన అనుమతులతోనే ఈ మోసాలు జరుగుతున్నాయన్నారు. నాణ్యమైన విత్తనాలపై భరోసా ఉంచిన గిరిజన రైతులు పూర్తిగా నష్టపోయారు. అప్పుల్లో కూరుకుపోయిన కొందరు రైతులు ఆత్మహత్యలకు పాల్పడిన విషాదకర ఘటనలు చోటు చేసుకున్నాయి. ఇది కేవలం వ్యవసాయ విఫలం కాదు - అమాయక గిరిజ నులపై అవినీతి రాష్ట్ర ప్రభుత్వ కుట్ర. బాధ్యులైన కంపెనీలపై పీడియాక్ట్ కింద కేసులు నమోదు చేయాలి. రైతులకు నష్టపరిహారం ఇవ్వాలి. భవిష్యత్తులో ఇటువంటి మోసాలకు తావు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. 3000 ఎక రాలు పంట నష్టపోయిన రైతులకు వెంటనే నష్టపరిహారం చెల్లించి 800 వందల మంది గిరిజన రైతులను ప్రభుత్వం ఆదుకోవాని డిమాండ్ చేశారు. చనిపోయిన 5 గురు రైతుల కుటుం బాలకు తక్షణమే నష్టపరిహారం చెల్లించాలన్నారు. బాధ్యులైన ప్రభుత్వ అధికారులపై విచారణ జరిపి, తగిన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి మోసాలు జరగకుండా నియంత్రణ చర్య లు, అవగాహన కార్యక్రమాలు చేపట్టాల న్నారు. మంత్రి సీతక్కకు ఇసుక క్వారీలపై ఉన్న శ్రద్ధ, అందాల పోటీలపై ఉన్న ఆసక్తి గిరిజన రైతుల ఆత్మహత్యలపై ఏమాత్రం లేదని విమర్శించారు. వ్యవసాయ శాఖ మంత్రి సైతం ఈవిషయంలో స్పందించలేదని, ముఖ్యమంత్రి సమీక్షలు చేస్తున్నా, గిరిజన రైతుల విషయంలో పూర్తిగా విస్మరించారన్నారు. మంత్రివర్గంలో ఒక్క గిరిజన మంత్రిని కూడా నియమించని ఈ ప్రభుత్వ ధోరణి గిరిజనుల పట్ల అవమానకరంగా ఉందిని ఆవేదన వ్యక్తం చేశారు. డిజిపిని కలిసిన ఎస్‌టి మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శ రవి నాయక్ నేనావత్, రాష్ట్ర కార్యదర్శి కుంజా సంతోష్, మహేష్ రూపావత్, బానోత్ అనూష, రమేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## చేనేత రంగం రక్షణకు చర్యలు తీసుకోవాలి

### రౌండ్‌టేబుల్ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని



సోమవారం సిపిఐ రాష్ట్ర కార్యాలయం మగ్ధూమ్ భవన్‌లో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న కూనంనేని సాంబశివరావు

**హైదరాబాద్, మే 26, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని చేనేత రంగం పరిరక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. వ్యవసాయ రంగం తర్వాత అత్యంత ప్రాధాన్యత గల చేనేత రంగం పరిరక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. సమాజంతోనే పుట్టిన చేనేత వృత్తి పాలకుల నిర్లక్ష్యం కారణంగా రాను రాను నిర్వీర్యం అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రంగానికీ ప్రత్యేక నిధులు కేటాయించడంతో పాటు వృత్తి ఆధునీకరించి చేనేత కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపాలని ప్రభుత్వాన్ని కోరారు. చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించడంతో పాటు చేనేత రంగాన్ని పరిరక్షించాలని.. తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో సోమవారం సిపిఐ రాష్ట్ర కార్యాలయం మగ్ధూమ్ భవన్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించింది. సంఘం గౌరవ అధ్యక్షులు తాటిపాముల వెంకట్రాములు రౌండ్ టేబుల్ సమావేశానికి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కూనంనేని సాంబశివరావుతోపాటు ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, చేనేత రంగ నిపుణులు దొంతి నర్సింహారెడ్డి, సిపిఎం సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్సీ చేరుపల్లి సీతారాములు, పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కమర్తపు మురళి, తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాశికంటి లక్ష్మీ నరసయ్య, చేనేత సంఘాల నాయకులు కర్నాటి ధనంజయ, దేవాదాసు, రాపోలు జగన్ తదితరులు పాల్గొన్నారు. సమావేశంలో కూనంనేని సాంబశివ రావు మాట్లాడుతూ ఎస్ సబ్ తరహాలో బిసిలకు సైతం ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలన్నారు. తద్వారా కుల వృత్తుల పరిరక్షణకు.. వృత్తుల వారికి నిధులను కేటాయించి వాటిని ఆధునీకరించి వాటిపై ఆధారపడిన కుటుంబాలకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. చేనేత కార్మికులు దీర్ఘ కాలికంగా ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంతో చేనేత సహకారా సంఘాలకు ఎన్నికలు తక్షణమే నిర్వహించా లన్నారు. ఎన్నికలకి ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాల్సిన ప్రభుత్వం వాటిని దాటే వేసే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. చేనేత రంగం సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి తనవంతుగా కృషి చేస్తానని కూనంనేని సాంబశివరావు హామీ ఇచ్చారు. ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ పాలకులందరూ ఒక్క తాను ముక్కలేనని, ఓటు బ్యాంక్ రాజకీయాలు తప్ప వారికి వృత్తిదారుల సమస్యలను పరిష్కారించాలనే చిత్తశుద్ధి లేద న్నారు. చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి శాసనమండలి వేదికగా తన గళాన్ని వినిపిస్తానని, మంత్రులు, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళ్లడంతోపాటు ఈ ఉద్యమానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు మాట్లాడుతూ.. ఉద్యమాల ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయని, ఇందుకు సంఘాలన్నీ సంఘటితం కావాలన్నారు.



## త్వరలో ఎస్‌ఆర్‌ఒ కార్యాలయాల్లో ఆధార్ ఇ-సంతకం

### పైలట్ ప్రాజెక్టుగా కూసుమంచి కార్యాలయాల్లో..

### మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**హైదరాబాద్, మే 26, ప్రభాతవార్త :** అవినీతిరహితంగా, పారదర్శకంగా, సమయాన్ని ఆదా చేయాలనే ఉద్దేశంతో రాష్ట్రవ్యాప్తంగా వచ్చే నెల 2వ తేదీ నుంచి స్లాట్ బుకింగ్ విధానాన్ని తీసుకువస్తున్న నేపథ్యంలో ఆధార్ ఇ సంతకం కూడా వీలైనంత త్వరగా అమలులోకి తీసుకువరావాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. ఆధార్ ఇ-సంతకం వల్ల 10 నుంచి 15 నిముషాల్లోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుందన్నారు. సోమవారం సచివాలయంలోని తన కార్యాలయంలో స్టాంప్స్ రిజిస్ట్రేషన్ ఐజీ జ్యోతి బుద్ధప్రకాష్‌తో కలిసి స్లాట్ బుకింగ్ విధానం, పనిభారం అధికంగా ఉన్న సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అదనపు రిజిస్ట్రార్ల పోస్టింగ్, పదోన్నతి పొందిన ఉద్యోగులకు పోస్టింగ్‌లపై మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ స్లాట్ బుకింగ్‌తోపాటు రిజిస్ట్రేషన్ ప్రక్రియను మరింత వేగవంతం చేయడంలో భాగంగా ఆధార్ ఇ-సంతకం ప్రవేశపెడుతున్నామని, ముందుగా నిజామాబాద్ జిల్లా ఆర్మూర్, ఖమ్మం జిల్లా కూసుమంచి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో తక్షణమే అమల్లోకి తీసుకు వస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా స్లాట్ బుకింగ్ తీసుకువస్తున్న నేపథ్యంలో ఎలాంటి సాంకేతిక సమస్యలు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పటాన్‌చెరు, యాదగిరిగుట్ట, గండిపేట, సూర్యాపేట, జడ్చర్ల, మహబూబ్‌నగర్, వనపర్తి, గద్వాల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు అదనంగా ఎస్‌ఆర్‌ఒలను నియమించారు. అవినీతికి దూరంగా ప్రజలకు మెరుగైన సేవ లందిస్తూ ప్రభుత్వ పేరుప్రతిష్టలు పెంచేలా సబ్‌రిజిస్ట్రార్ల పనితీరు ఉండాలన్నారు.



సోమవారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతున్న పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల రామచంద్రారెడ్డి

## రైతులను పట్టించుకోని ప్రభుత్వం

### ఇప్పటికే 442 మంది కర్షకులు చనిపోయారు

### బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల రామచంద్రారెడ్డి

**హైదరాబాద్, మే 26, ప్రభాతవార్త:** ఎద్దు ఏడిస్తే రైతులు ఎంతగానో బాధపడతారని, అలాంటి రైతు ఏడిస్తే మన రాష్ట్రం కూడా బాధపడుతుందని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు చింతల రామచంద్రారెడ్డి అన్నారు. సోమవారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. గతంలో కెసిఆర్ ప్రభుత్వం, ప్రస్తుతం రేవంత్ రెడ్డి ప్రభుత్వం రైతుల దుస్థితిపై పట్టించుకోలేదని మండిపడ్డారు. సుమారు 30 లక్షల టన్నులు వరిధాన్యం తడిసి పోయిందని, ముగ్గురు రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో 51 ఏళ్ల గుగ్గులోత్ కిషన్, సూర్యపేట అన్నారం గ్రామంలో రైతు ఉప్పల వెంకన్న, జనగాం వెల్దీ గ్రామంలో యాదగిరి వంటి రైతులు నష్టాల కారణంగా ఆత్మహత్య చేసుకున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 442 మంది రైతులు చనిపోయారన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతి పంటకు 2320 రూపాయల ఎంఎస్‌పి అందిస్తుందని, పంట కొనుగోలు ఖర్చు అంతా కేంద్రమే భరిస్తుందన్నారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ అధికారులకు పని కల్పించకుండా, పంట కొనుగోలు సరిగ్గా జరపకుండా రైతులను ఇబ్బంది పెడుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ వరంగల్ డిక్లరేషన్ ఇస్తూ, 10 రకాల పంటలకు బోనస్ ఇస్తామని ప్రకటించిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఫసల్ బీమాను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడం లేదని, రైతులను మోసం చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎలక్షన్ ముందు వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చాక ఏవీ అమలు చేయకుండా రైతులను, మహిళలను, విద్యార్థులను, యువకులను మోసం చేసిందన్నారు.

## నక్సలైట్లతో శాంతి చర్చలు జరపాలి

### కాల్పుల విరమణ తక్షణమే ప్రకటించాలి

### సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ

**హైదరాబాద్, మే 26, ప్రభాతవార్త:** దేశంలోని నక్సలైట్లతో శాంతి చర్చలు జరపాలని.. కాల్పుల విరమణను తక్షణమే ప్రకటించాలని సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె నారాయణ డిమాండ్ చేశారు. నక్సలైట్లపై కాల్పుల విరమణ తక్షణమే ప్రకటించాలని కేంద్ర ప్రభుత్వాన్ని సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఇప్పటికే నక్సలైట్లు రాసిన లేఖ ప్రకారం కాల్పుల విరమణకు అంగీకరించినట్లు అర్థమవుతుందనితెలిపారు. నక్సలైట్లు .. టెర్రరిస్టులు కాదని వారు మన దేశ పౌరులని అన్నారు. తీవ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్తాన్‌తో చర్చలు జరిపినప్పుడు మన దేశ పౌరులైన నక్సలైట్లతో శాంతి చర్చలు జరపడం పెద్ద కష్టమేమీ కాదని.. ఆటంకం ఏమి రాదని నారాయణ అన్నారు. సిద్ధాంతపరమైన విభేదాలే తప్ప మరొకటి కాదని, రెండు తుపాకి గొట్టాల ద్వారా సమస్య పరిష్కారం కాదని.. రాజకీయ చర్చలు జరిపి శాంతి ఒడంబడికకు రావాలని కేంద్ర ప్రభుత్వాన్ని నారాయణ కోరారు.

## ఎంఇఒలు ప్రతిరోజు పాఠశాలలను తనిఖీ చేయాలి

### విద్యాప్రమాణాలను మెరుగుపరచాలి

### శిక్షణ తరగతుల్లో పాఠశాల విద్య డైరెక్టర్ ఇవి నరసింహారెడ్డి

**హైదరాబాద్, మే 26, ప్రభాతవార్త:**ఆరాష్ట్రంలో జూన్ 6 నుంచి జరగనున్న బడి బాట కార్యక్రమంలో మండల విద్యాధికారులు(ఎంఈవో) ప్రత్యేక కార్యా చరణతో మండలంలో ఉన్న స్కూల్స్‌లో విద్యార్థుల సంఖ్యను పెంచేలా చర్యలు తీసుకోవాలని పాఠశాల విద్య డైరెక్టర్ ఈవి నరసింహారెడ్డి సూచించారు. రాష్ట్రంలోని ఎంఈవోలకు సోమవారం ప్రారంభించిన శిక్షణా తరగతుల్లో డైరెక్టర్ పలు సూచనలు చేశారు. రాష్ట్రంలోని 629 మంది ఎంఈవోలకు శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా సోమవారం నుంచి బుధవారం వరకు 17 జిల్లాలకు చెందిన 304 ఎంఈవోలకు శిక్షణా తరగతులను హైదరాబాద్‌లోని ఎంసిఆర్‌హెచ్‌ఆర్‌డిలో నిర్వ హించనున్నారు. మిగిలిన జిల్లాల వారికి జూన్ 3 నుంచి 5 వరకు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా పాఠశాల విద్య సంచాలకులు ఇవి నరసింహారెడ్డి మాట్లాడుతూ .. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా విద్యార్థుల విద్యా ప్రమాణాలను పెంచాడనికి అందరం కలసికట్టుగా పనిచేయాలన్నారు. టీచర్ ట్రైనింగ్స్‌ను మండల స్థాయిలో చాలా బాగా నిర్వహించినందుకు అందరూ ఎంఈవోలను అభినందించారు. క్షేత్ర స్థాయిలో పాఠశాలల అభివృద్ధికి ఎంఈవోలు చాలా కీలకమన్నారు. అందరూ ఎంఈవోలు పాఠశాలలను సందర్శించి విద్యార్థుల విద్యా ప్రమాణాలను మెరుగుపరచడం కోసం కృషి చేయాలన్నారు. గతంతో పోలిస్తే ప్రస్తుతం ప్రతి మండలానికి ఒక ఎంఈవో ఉన్నారని.. కాబట్టి ప్రభుత్వ పాఠశాలలపైన నమ్మకం పెరిగేలా ఎంఈవోల పనితీరు ఉండాలన్నారు. బడిబాట కార్యక్రమలో ప్రతి ఎంఈవో ఒక ప్రత్యక కార్యాచరణతో వారి మండలంలో ఉన్న పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేవిధంగా కృషి చేయాలని డైరెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వ, లోకల్‌బాడీ, మోడల్ స్కూల్స్, కెజిబివిలు, సాధారణ రెసిడెన్షియల్ స్కూల్స్, అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్స్(యుఆర్‌ఎస్) పాఠశాలల్లో పనిచేస్తున్న 122854 టీచర్స్‌కి 5 రోజుల శిక్షణ కార్యక్రమాన్ని మే 13 నుంచి ప్రారంభించుకున్నామని గుర్తు చేశారు. ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వడానికి 5605 రిసోర్స్ పర్సన్స్.. జూన్‌లో రిటైర్ అయ్యే 1255 మంది ఉపాధ్యాయులు మినహాయిస్తే 1,16,084 మంది ఉపాధ్యాయులు శిక్షణ పొందాల్సి ఉందన్నారు. వారిలో ఇప్పటి వరకు రెండు విడతలలో 866 సెంటర్స్‌లో 94,794 మంది టీచర్లకు 5 రోజుల శిక్షణ జిల్లా స్థాయిల్లో, మండల స్థాయిల్లో ఇవ్వడం జరిగిందన్నారు. మిగిలిన టీచర్స్‌కి 3వ విడతలో సోమవారం(మే26) నుంచి 30 వరకు నిర్వహించనున్నట్టు తెలిపారు.



## ఈ శతాబ్దపు అతిపెద్ద మోసం.. కాంగ్రెస్ మేనిఫెస్టో

**కెటిఆర్ సమక్షంలో గద్వాల నుంచి బిఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్, బిజెపి నేతలు**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 26:** ఈ శతాబ్దపు అతిపెద్ద మోసం కాంగ్రెస్ పార్టీ అభయహస్తం మేనిఫెస్టో అని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసి డెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అధికారం కోసం ప్రజలకు అబద్ధపు హామీలిచ్చి, నాలుగు కోట్ల ప్రజలను దారుణంగా మోసం చేసిన పార్టీ కాంగ్రెస్ అని మండిపడ్డారు. సోమవారం తెలంగాణ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో గద్వాలకు చెందిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన కేటీఆర్ అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. నీళ్లు, నిధులు, నియామకాలు అనే ఉద్యమ నినాదాలనే విధానాలుగా మార్చుకుని బీఆర్ఎస్ పదేళ్లపాటు ఓ మహాయజ్ఞంలా పనిచేస్తే, రేవంత్ రెడ్డి గత పదెన్నిమిది నెలలుగా ప్రధాన ప్రతిపక్షంపై పనికిరాని నిందలు.. బిల్డర్లు, కాంట్రాక్టర్లతో దందాలు, రాహుల్ గాంధీకి చందాలు పంపడమే విధా నంగా పెట్టుకున్నారని దుయ్యబట్టారు. రేవంత్‌రెడ్డి ఉత్త మాటల మనిషి మాత్రమే కాదన్న కేటీఆర్, ఆయన ఢిల్లీకి మూటలు మోసే మనిషిగా మారిపోయారని ధ్వజమెత్తారు. ఒకప్పుడు చంద్రబాబు కోసం మూటలు మోసి అడ్డంగా దొరికిపోయారని, ఇప్పుడు రాహుల్‌గాంధీ కోసం ఢిల్లీకి మూటలు మోస్తున్నారని ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రెండు లక్షల రుణమాఫీ చేస్తానని ఒట్టు వేశారని, 49వేల 500 కోట్ల రుణమాఫీ చివరకు పావుశాతం కూడా కాలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. రాష్ట్రం దివాలా తీసిందని స్వయంగా ముఖ్యమంత్రి చెప్తే ఎవరైనా పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వస్తారా? అని సూటిగా ప్రశ్నించారు. కాంగ్రెస్ మోసాన్ని, బీజెపి నయ వంచనను ఊరూరా తీసుకపోవాల్సిన బాధ్యత గులాబీ సైనికులందరి మీద ఉందన్నారు. వలస ప్రాంతంగా ముద్రపడ్డ పాలమూరు ముఖచిత్రాన్ని కేసిఆర్ సమూలంగా మార్చివేశారన్న కేటీఆర్, ఆంధ్ర, కర్ణాటక నుంచి పదేళ్ల పాలనలో రివర్స్ మైగ్రేషన్ సాగిందని గుర్తుచేశారు. ఎవరెన్ని మాయమాటలు చెప్పినా అలంపూర్, గద్వాలలో ఉద్యమ స్ఫూర్తిని చాటి గులాబీ జెండాను ఎగరవేసిన నడిగడ్డ ప్రజలకు కేటీఆర్ ధన్యవాదాలు తెలిపారు. త్వరలో గద్వాలకు కూడా ఉపఎన్నిక రావడం ఖాయమని, వచ్చే ఉప ఎన్నికల్లో సామాన్య కార్యకర్తను పెట్టినా అక్కడ గులాబీ జెండాను ఎగరవేస్తామని కుండబద్దలు కొట్టారు. తెలంగాణకు ఎప్పటికీ గులాబీ జెండా మాత్రమే గుండెధైర్యమనే విషయం నాలుగు కోట్ల ప్రజలకు తెలుసని కేటీఆర్ చెప్పారు. జూన్ నెలలో పార్టీ మెంబర్షిప్ డ్రైవ్ మొదలవుతుందని కేటీఆర్ వెల్లడించారు. గ్రామస్థాయి నుంచి కమిటీల నిర్మాణం చేసుకుని ముందుకు సాగుదామని దిశానిర్దేశం చేశారు.

# కోవిడ్‌పై నిరంతరం నిఘా కొనసాగించాలి

**కోవిడ్, సీజనల్ వ్యాధుల నివారణపై మంత్రి దామోదర రాజనర్సింహా సమీక్ష**

**హైదరాబాద్, మే 26, ప్రభాతవార్త:** దేశంలో కొవిడ్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో రాష్ట్రంలో కొవిడ్ కేసులపై నిరంతరం నిఘా కొనసాగించాలని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. దేశవ్యాప్తంగా కోవిడ్ వ్యాప్తితోపాటు రాష్ట్రంలో సీజనల్ వ్యాధుల నివారణపై మంత్రి సచివాలయంలో వైద్య, ఆరోగ్య శాఖ అధికారులతోపాటు సంబంధిత నిపుణులతో సోమవారం ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో హెల్త్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తు, సీసీఎంబీ డైరెక్టర్ డాక్టర్ వినయ్ నందికూరి, బీబీనగర్ ఎయిమ్స్ డైరెక్టర్ డాక్టర్ అభిషేక్ అరోరా, సెంటర్ ఫర్ డీఎన్ఏ, ఫింగర్ ప్రింటింగ్ అండ్ డయాగ్నస్టిక్స్ డైరెక్టర్ ఉల్లాస్ కొల్తూర్ సీతారామ్, ఐసీఎంఆర్ ఎన్ఐఎన్ శాస్త్రవేత్త డాక్టర్ సుదీప్ ఘోష్, నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ రవిందర్ నాయక్, వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. సమావేశంలో పాల్గొన్న సీసీఎంబీ డైరెక్టర్ వినయ్ నంబికూరి సహా ఇతర నిపుణులంతా ఇండియా, ఇతర దేశాల్లో ఉన్న పరిస్థితులను మంత్రికి వివరించారు. ఇప్పటివరకూ ఉన్న సమాచారం, పరిశోధనల ప్రకారం కొవిడ్‌తో ప్రమాదమేమీ లేదన్నారు. వివిధ దేశాల్లో అక్కడక్కడా కేసులు పెరుగుతున్నప్పటికీ.. హాస్పిటలైజేషన్ అసలు లేదని తెలిపారు. దీర్ఘకాలిక జబ్బులతో బాధపడుతూ, బలహీనమైన రోగ నిరోధక శక్తి ఉన్న పేషెంట్లు జాగ్రత్తగా ఉంటే సరిపోతుందన్నారు. సాధారణ ప్రజలు ప్రత్యేకంగా జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరమైతే ఇప్పుడు కనిపించడం లేదని మంత్రికి వివరించారు. కోవిడ్‌పై తమ పరిశోధనలు నిరంతరం కొనసాగుతున్నాయని, వివిధ దేశాల్లో అప్పుడప్పుడు సైలెంట్‌గా కేసులు పెరుగుతున్నాయని, క్రమంగా తగ్గిపోతున్నాయని వెల్లడించారు. కొవిడ్ వచ్చిన విషయం కూడా ప్రజలకు తెలియడం లేదన్నారు. పరిస్థితి సాధారణంగా ఉండడం వల్ల, కేంద్ర ఆరోగ్యశాఖ కూడా ఇప్పటివరకూ ఎటువంటి అడ్వైజరీ, గైడ్‌లైన్స్ విడుదల చేయలేదని బీబీనగర్ ఎయిమ్స్ డైరెక్టర్ అభిషేక్ అరోరా మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. కోవిడ్‌పై నిరంతరం నిఘా కొనసాగించాలన్నారు. ప్రజలకు ఈ అంశంపై నిపుణులు అవగాహన కల్పించాలని మంత్రి సూచించారు. కొవిడ్ జీనోమ్ సీక్వెన్సింగ్ కోసం శాంపిల్స్‌ను పంపించాలని సీసీఎంబీ, సీడీఎఫ్‌డీ డైరెక్టర్లు మంత్రికి విజ్ఞప్తి చేయగా.. అందుకు మంత్రి సానుకూలంగా స్పందించారు. శాంపిల్స్‌ను సీక్వెన్సింగ్ కోసం పంపించాలని పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ రవిందర్ నాయక్‌ను ఆదేశించారు. సీజనల్ వ్యాధుల నివారణకు ముందు నుంచే జాగ్రత్తలు తీసుకోవాలని ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులను మంత్రి ఆదేశించారు. ప్రతి జిల్లాలోనూ ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్‌లను ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. పంచాయతీరాజ్, మునిసిపల్, ఇతర డిపార్ట్‌మెంట్లతో కోఆర్డినేట్ చేసుకుంటూ, ప్రతి గ్రామంలో, పట్టణంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. డెంగీ, మలేరియా కేసులు ఎక్కువగా నమోదవుతున్న ప్రాంతాలను గుర్తించి, ఆయా ప్రాంతాల్లో పంచాయతీరాజ్, మునిసిపల్ డిపార్ట్‌మెంట్లను అలర్ట్ చేయాలని, ఆరోగ్యశాఖ నుంచి స్పెషల్ టీమ్‌లను పంపించి అవేర్‌నెస్ క్యాంపులు ఏర్పాటు చేయాలని మంత్రి దామోదర ఆదేశించారు. రాష్ట్రంలో వర్షాలు మొదలయ్యాయని, సీజనల్ వ్యాధులతో హాస్పిటళ్లలో ఓపీ, ఐపీ పెరిగే అవకాశం ఉన్నందున, అన్ని విధాలుగా సిద్ధంగా ఉండాలని.. ఇదే సమయంలో ప్రైవేటు హాస్పిటళ్లపై నిఘా పెంచాలని, డెంగీ, ప్లేట్‌లెట్స్ పేరిట ప్రజలను దోచుకునే ప్రయత్నం చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వర్షాలు మొదలైనందున వానాకాలం పంటలను రైతులు ప్రారంభిస్తారని, ఈ క్రమంలో పాము, తేలు కాటుకు గురయ్యే ప్రమాదం ఉంటుందని మంత్రి అధికారులకు గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో ప్రైమరీ హెల్త్ సెంటర్ నుంచి టీచింగ్ హాస్పిటల్ వరకూ అన్ని హాస్పిటళ్లలో పాము, తేలు కాటు పేషెంట్లకు ట్రీట్‌మెంట్ అందించేందుకు అవసరమైన మెడిసిన్, ఇంజెక్షన్లు అందుబాటులో ఉంచుకోవాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

## విద్యుత్ కార్మికులకు కోటి ప్రమాద బీమా

**దేశ చరిత్రలోనే ఇదో రికార్డు**

**డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క**

**హైదరాబాద్, మే 26, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని విద్యుత్ కార్మికులకు ప్రమాద బీమాగా కోటి రూపాయలను అందచేస్తున్నట్లు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. ప్రభుత్వ ఆలోచనకు అద్దం పట్టే ఈ బీమా పథకం దేశ చరిత్రలోనే ఇది ఒక రికార్డు అని వ్యాఖ్యానించారు. దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలో విధులు నిర్వహిస్తూ ప్రమాదవశాత్తు ప్రాణాలు కోల్పోయిన జోగు నరేష్ కుటుంబ సభ్యులకు హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో సోమవారం ఆయన కోటి రూపాయల ప్రమాద బీమా చెక్కుతో పాటు, విద్యుత్ శాఖలో అతని భార్యకు కారుణ్య నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యుత్ కార్మికునికి కోటి రూపాయల ప్రమాద బీమా చెక్కును అందించడం కేవలం తమ ప్రభుత్వానికే సాధ్యం అయ్యిందన్నారు. గతంలో కార్మికుల కోసం ఏ ప్రభుత్వం ఇంత గొప్పగా ఆలోచన, ప్రయత్నం చేయలేదని తెలిపారు. బీమా పరిహారం, ఉద్యోగ నియామక పత్రం అందించడం ప్రభుత్వ ఆలోచన, కార్యాచరణ, మానవీయ కోణానికి అద్దం పడుతుందని చెప్పారు. కార్మికులకు ప్రమాద బీమా పథకాన్ని మొదట సింగరేణిలో ప్రవేశపెట్టి అనంతరం విద్యుత్ సంస్థల్లోనూ ఆచరణలోకి తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు. కోటి రూపాయల పైబడి ప్రమాద బీమా విద్యుత్ సంస్థలో పనిచేసే కార్మికుల అందరిలో ఓ కొత్త భరోసా నింపుతుంది అన్నారు. విద్యుత్ ఉద్యోగులు అంకితభావంతో రాష్ట్ర ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సిఎండి వరుణ్‌రెడ్డి, సలహాదారు నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




## జమిలి ఎన్నికలు సాధ్యమే

**వన్‌నేషన్-వన్ ఎలక్షన్‌తో ఎన్నో ప్రయోజనాలు**

**దేశానికి, తమిళనాడుకు ఇది కొత్తకాదు..**

**చెన్నైలో ఏపి డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్**

**విజయవాడ,మే26,ప్రభాతవార్తప్రతినిధి:** ఒకే దేశం ఒకే ఎన్నిక వల్ల కలిగే ప్రయోజనా ఎన్నో ఉన్నాయని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. తరచుగా ఎన్నికలు జరగడం వల్ల మన దేశం ఎన్నికల పనుల్లోనే కూరుకుపోతోందన్నారు. అధికారులు, పోలీసులు, ఉపాధ్యాయులు నిరంతరం పనిచేయాల్సి వస్తోందన్నారు. ఎన్నికల ఖర్చుల వల్ల ప్రజా సంక్షేమ పథకాల అమలులో జాప్యం జరుగుతోందన్నారు. ఒకే దేశం ఒకే ఎన్నిక ద్వారా ఎన్నికల ఖర్చు తగ్గించవచ్చు అన్నారు. ప్రజలకు మరిన్ని పథకాలు అమలు చేయవచ్చునని అన్నారు. చెన్నైలో తమిళనాడు రాష్ట్ర బీజేపీ నేతలతో ఒకే దేశం, ఒకే ఎన్నిక( వన్ నేషన్ వన్ ఎలక్షన్) జనసేన అధ్యక్షులు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సమావేశమయ్యారు, ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ ప్రధాని ఒక ఆలోచన చేస్తే అది దృష్టితో ఉంటుందన్నారు. వికసిత్ భారత్ 2047ఆశయాలు నేరవేరాలంటే వన్ నేషన్ వన్ ఎలక్షన్ అనే అంశం ప్రజల్లో బలీయంగా వెళ్ళాలన్నారు. ఒకే దేశం ఒకే ఎన్నికపై తప్పుడు సమాచారం వ్యాప్తి చెందుతోందని, కొందరు దీనిపై ద్వంద్వ వైఖరి ప్రదర్శిస్తున్నారని పవన్ కళ్యాణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ హయాంలో ఒకే దేశం ఒకే ఎన్నిక విధానం తీసుకొచ్చి ఉంటే మద్దతు ఇచ్చేవారు. గెలిస్తే ఈవీఎం సూపర్ అని, ఓడిపోతే అక్రమాలు జరిగాయని అంటున్నారని ఆయన అన్నారు. ఒకే దేశం ఒకే ఎన్నిక విధానాన్ని కరుణానిధి మద్దతు ఇచ్చారు. కానీ స్టాలిన్ ఎందుకు వ్యతిరేకిస్తున్నారు? పవన్ కళ్యాణ్ ప్రశ్నించారు. ఈ సమావేశంలో తమిళంలో పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ తమిళ దేవుడు మురుగ స్వస్థలం తమిళనాడు అంటూ తన ప్రసంగాన్ని ప్రారంభించారు. తమిళంలో మాట్లాడుతూ నేను పూజించే తమిళ దేవుడు మురుగ స్వస్థలం, మహాకవిస్వస్థలం, సిద్ధుల స్వస్థలం, నాకు చాలా ఇష్టమైన ఎంజిఆర్ స్వస్థలం. తమిళనాడుపై నాకు ఎప్పుడూ గౌరవం ఉంది అని అన్నారు. దీనిని వ్యతిరేకిస్తున్నవారు కరుణానిధి రాసిన నేంజుక్కు నీతి పుస్తకం చదవాలి. ఎందుకంటే కరుణానిధి ఆ పుస్తకంలో ఒకే దేశం ఒకే ఎన్నికకు మద్దతు ఇచ్చినట్లు రాశారు అని పవన్ కళ్యాణ్ అన్నారు.

# మహానాడుకు అంతా రెడీ

**నేడు మొదటిరోజు టిడిపి సంస్థాగత నిర్మాణం, భవిష్యత్ కార్యాచరణపై ప్రధాన చర్చ**

**రెండోరోజు ఎన్టీఆర్ 102వ జయంతి సందర్భంగా నివాళులు, ఇతర కార్యక్రమాలు**

**కడపకు చేరిన ఏపి సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ మరికొందరు మంత్రులు**

**కడప మే 26, ప్రభాతవార్త బ్యూరో:** తెలుగుదేశం పార్టీ నిర్వహించే మహానాడును 43 సంవత్సరాల తరు వాత కడపలో మొదటిసారిగా నిర్వహిస్తున్నారు. న బూతో న భవిష్యత్ అన్న రీతిలో మూడు రోజులు జరగబోవు మహానాడు పండుగకు సర్వం సిద్ధం అయింది. గత వారం రోజులుగా మంత్రులు సభా ప్రాంగణ ఏర్పాట్లను పర్యవేక్షి ంచారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా పూర్తి చేశారు. మహానాడు సంబరం నేటి నుంచి ప్రారంభం అవుతుంది. కడప లో నిర్వహిస్తున్న మహానాడు సంబరం చరిత్రలో నిలిచిపోయేలా ఏర్పాట్లు పూర్తి చేశారు. కడప ఇం చార్జ్ మంత్రి సవిత, అన్నమయ్యజిల్లా ఇంచార్జ్ మంత్రి జన్నార్దన్ రెడ్డి, రవాణాశాఖ మంత్రి రాంప్ర సాద్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యేలు పుత్తా చైతన్య రెడ్డి, మాధవి రెడ్డి, పార్టీ నాయకులు శ్రీనివాసులు రెడ్డి ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి మహానాడు ప్రాం గణం ఏర్పాట్లు పూర్తి చేశారు. మహానాడు సంబ రాలకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సోమవారంరాత్రి కడపకు చేరుకోనున్నారు. తెలుగు దేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి మంత్రి నారా లోకేష్ కుప్పం నుంచి కడపకు రాత్రి 9గంటలకు కడపకు చేరుకున్నారు. ఇప్పటికే మంత్రులు తరలి వచ్చారు. కడప నగరంతో పాటు సభా ప్రాంగణం కమలాపురం నియోజకవర్గంపార్టీ జెండాలు, తోరణాలు, భారీ కటౌట్లు, ఫ్లెక్సీలతో పసుపు మయమైంది. ఎటు చూసినా జెండాలు రెపరెపలాడుతూ పసుపు రంగులో కనిపిస్తోంది. కడప నగరంలోనే పబ్బాపురం సమీపంలో సుమారు 150 ఎకరాల విస్తీర్ణంలో మహానాడు ప్రాంగణం ఏర్పాటు చేసి మూడు రోజుల పండుగ నిర్వహిస్తున్నారు. చివరి రోజు 29న జరుగు భారీ బహిరంగ సభకు 5 లక్షల మందికి పైగా తరలివస్తున్నట్లు మంత్రులు తెలిపారు. గతంలో జరిగిన మహానాడుకు, ఇప్పుడు జరుగుతున్న మహానాడుకు చరిత్రలో నిలిచిపోయే విధంగా ఉంటుందని మంత్రులు పేర్కొన్నారు. ఇప్పటికే మంత్రులు అచ్చెన్నాయుడు, పొల్లా రవీంద్ర, నారాయణ, నిమ్మల రామానాయుడు, పార్థసారథి, వాసిరెడ్డి సుభాష్‌తోపాటు మాజీ మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు తరలివచ్చారు. ఆయా నియోజకవర్గాలకు కేటాయించిన నేతలు, మంత్రులు మహానాడుకు సంబంధించి విజయవంతం చేసేందుకు భారీగా జనాభాను సమీకరించేందుకు బాధ్యతలు ఆయా పార్టీ నాయకులకు సమీక్షలో అప్పజెప్పడం జరిగింది. ఈ మహానాడులో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. 10 మంది ఎస్పీలు, 5వేల మంది సిబ్బంది, 150 సిసి కెమెరాలు, డ్రోన్ల సహకారంతో నిఘా ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు. మొదటి రోజు మంగళవారం ఉదయం ప్రతినిధుల నమోదుతో మహానాడు ప్రారంభం కానుంది. తరువాత ఫొటో ఎగ్జిబిషన్, రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహానికి నివాళితో మహానాడు ప్రారంభం కానుంది. 12 గంటలకు ముఖ్యమంత్రి ఉపన్యాసం చేస్తారని మంత్రులు తెలిపారు. రెండవ రోజు ప్రతినిధుల సభతోపాటు పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు 152 జయంతి సందర్భంగా నివాళులు అర్పించి, ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై రూపొందించిన ముసాయిదా తీర్మాణంపై చర్చించి ఆమోదించనున్నారు. ఈ రెండు రోజులు జరుగు సభకు సుమారు 20 వేల మంది హాజరవుతారని వారు తెలిపారు. సభా వేదిక 450 మంది కూర్చునేలా వారు నిర్మాణం చేపట్టారని తెలిపారు. చివరి రోజు 29వ తేది 5 లక్షల మందితో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారని, ఇది చరిత్రలో నిలబడిపోయే విధంగా ఉండిపోతుందన్నారు. రోజువారి కార్యక్రమాలలో భాగంగా మంత్రులు, ఎమ్మెల్యేలు, స్థానికనాయకులతో కమిటీలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రాయలసీమ వంటలతో భోజనవసతి కల్పించామన్నారు. రాయలసీమ అభివృద్ధి తోపాటు వివిధ ప్రాజెక్టులకు సంబంధించిన ప్రణాళికను సిద్ధం చేసినట్లు వారు తెలిపారు. ఈ సభావేదిక ద్వారా రాయలసీమ అభివృద్ధి బాట పడుతుందన్నారు. మహానాడు మూడు రోజుల పండగ చరిత్రలో నిలబడే విధంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ మహానాడు కార్యక్ర మా నికి ఆంధ్రప్రదేశ్ నుంచే కాకుండా తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుండి ఆ పార్టీ నాయకులు, అభిమానులు తరలిరానున్నారు.



కడపలో మహానాడుకు ముస్తాబైన ప్రధాన వేదిక దృశ్యం

## ముంబయిని మట్టి కరిపించిన పంజాబ్ కింగ్స్

**7 వికెట్ల తేడాతో ముంబయి ఇండియన్స్ ఓటమి**

**జైపూర్, మే 26:** ఐపిఎల్ 18వ సీజన్‌లో 69వ మ్యాచ్‌లో ఎక్కువసార్లు కప్పుగెలిచిన ముంబయి ఇండియన్స్‌ను పంజాబ్‌కింగ్స్ ఓడించింది. ఈ మ్యాచ్‌లో లీగ్‌దశను విజయంతోముగించి పంజాబ్‌కింగ్స్ అగ్రస్థానానికి వెళ్లింది. ఆ జట్టు క్వాలిఫయర్‌వన్‌లో ఆడేందుకు అర్హత పొందింది. ముంబయి ఇండియన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో చివరి లీగ్‌మ్యాయచ్‌లో పంజాబ్ ఏడు వికెట్లతేడాతో విజయం సాధించింది. తొలుత టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన



ముంబయి నిర్ణీత 20 ఓవర్లలో ఏడు వికెట్లనష్టానికి 184 పరుగులుచేసి పంజాబ్‌కు 185 పరుగులు లక్ష్యం విదించింది. ఈ లక్ష్యాన్ని పంజాబ్ 18.3 ఓవర్లలోనే ముడు వికెట్లు కోల్పోయి 187 పరుగులు సాధించింది. ప్రయాంశ్ ఆర్య 35 బంతుల్లో 9 ఫోర్లు రెండు సిక్స్‌లతో 62 పరుగులుచేస్తే జోష్ ఇంగ్లీస్ 42 బంతుల్లో 9 ఫోర్లు మూడు సిక్స్‌లతో 73 పరుగులుచేసి అర్ధశతకాలు బాదేసారు. శ్రేయస్ అయ్యర్ 26, ప్రభ్‌సిమ్రన్‌సింగ్ 13 పరుగులుచేసారు. ముంబయి బౌలర్లలో మిచెల్ శాంట్నర్ రెండు, జస్‌ప్రీత్ బుమ్రా ఒక వికెట్ తీసారు. ఈ ఓటమితో నాలుగోస్థానానికి పరిమితమైన ముంబయి గుజరాత్ టైటాన్స్ లేదా ఆర్సీబీతో ఎలిమినేటర్‌మ్యాచ్ ఆడాల్సి ఉంది. మంగళవారం లక్నోతో జరిగే మ్యాచ్‌లో ఆర్సీబీ గెలిస్తే 19 పాయింట్లతో టాప్2లో నిలుస్తుంది. అప్పుడు గుజరాత్,ముంబయిలమధ్య ఎలిమినేటర్ మ్యాచ్ ఉంటుంది. ఈ మ్యాచ్‌లో ముంబయి బ్యాటర్లలో సూర్యకుమార్ యాదవ్ 39 బంతుల్లో ఆరుఫోర్లు, రెండుసిక్స్‌లతో 57 పరుగులుచేసి ఒక్కడే భారీ స్కోరుచేయగలిగాడు. ఓపెనర్లు రికెల్‌టన్ 27, రోహిత్‌శర్మ 24, పర్వాలేదనిపించారు. హార్ధిక్ పాండ్య 26, నమన్‌ధీర్ 20, విల్‌జాక్స్ 17 పరుగులుచేసారు. తిలక్‌వర్మ ఒకే ఒక్కపరుగుతో నిరాశపరిచాడు. పంజాబ్ బౌలర్లలో మార్కో జాన్సెన్ 2 అర్షదీప్‌సింగ్ రెండు విజయ్‌కుమార్ వైశాఖ్ 2 హర్‌ప్రీత్‌బ్రార్ ఒక వికెట్‌తీసారు.

# ద్రోహులు ఇచ్చిన సమాచారంతోనే ఎన్‌కౌంటర్

**మాడ్ ఎన్‌కౌంటర్‌పై మావోయిస్టుల సంచలన లేఖ విడుదల**

**అగ్రనేత కేశవరావును పట్టుకుని కాల్చి చంపారు**

**20వేల మంది బలగాలు చుట్టుముట్టాయి**

**10 గంటల్లో ఐదుసార్లు ఎదురుకాల్పులు**

**మావోయిస్టు కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి వికల్ప్**



**చర్ల, ప్రభాతవార్త :** నారాయణపూర్ జిల్లా మాడ్ ఏరియాలో ఈ నెల 21న జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు కేంద్ర కమిటీ కార్యదర్శి నంబాల కేశవరావు అలియాస్ బసవరాజుతో సహా 26 మంది మావోయిస్టులు ఎన్‌కౌంటర్‌లో హతమైన సంఘటన తెలిసిందే. ఈ ఎన్‌కౌంటర్‌పై ఇప్పటికే భిన్న కథనాలు వినిపించాయి. కాగా ... ఎన్‌కౌంటర్ జరిగిన ఐదు రోజుల తరువాత మావోయిస్టులు పత్రికలకు సంచలన లేఖ విడుదల చేశారు. మావోయిస్టు కేంద్ర అధికార ప్రతినిధి వికల్ప్ పేరిట విడుదల అయిన లేఖలో పలు విధాలుగా పేర్కొన్నారు. మావోయిస్టు కేంద్ర కమిటీ కార్యదర్శి నంబాల కేశవరావును సజీవంగా పట్టుకుని కాల్చి చంపారని, మా నాయకుడిని కాపాడుకోవడంలో మేము విఫలమయ్యామని ఆరు నెలలుగా మాడ్ ప్రాంతంలో కేశవరావు ఉన్నట్లు నిఘా వర్గాలకు సమాచారం ఉందన్నారు. కేశవరావు టీంలో ఉన్న ఆరుగురు ఇటీవల లొంగిపోయారని, లొంగిపోయిన ద్రోహులు ఇచ్చిన సమాచారంతోనే ఈ ఎన్‌కౌంటర్ జరిగిందన్నారు. యూనిఫైడ్ కమాండ్ సభ్యులు రిక్కితో సహా పలువురు ద్రోహం చేయడంతోనే మా అగ్రనాయకుడిని పోగొట్టుకున్నామని అన్నారు. ఎన్‌కౌంటర్‌కు ఒక రోజు ముందు నుంచి 20వేల మంది బలగాలు ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టాయని, 60 గంటల పాటు మమ్మల్ని నిర్బంధించి 10 గంటల్లో 5 ఎన్‌కౌంటర్‌లు జరిగినట్లు ఆయన లేఖలో పేర్కొన్నారు. కేశవరావును కాపాడుకునేందుకు 35 మంది పార్టీ సభ్యులు ప్రాణాలు అడ్డుపెట్టగా ఏడుగురు సురక్షితంగా బయటపడ్డారని తెలిపారు. నేను ఇప్పటికే కాల్పుల విరమణ ప్రకటించి నేటికి ఎలాంటి కాల్పులు జరపలేదని, పాక్‌తో కాల్పుల విరమణ జరిపిన కేంద్ర ప్రభుత్వం మాతో శాంతి చర్చలు జరిపేందుకు ఎందుకు సిద్ధంగా లేదని ప్రశ్నించారు. కేశవరావును సురక్షిత ప్రాంతానికి తరలించేందుకు బలగాలు ప్రయత్నించినా మమ్మల్ని వదిలేందుకు విడిచి వెళ్ళేందుకు ఒప్పుకోలేదన్నారు. నాయకుడు అనే వాడు ముందుండి నడిపించాలని మాతో అని అనంతరం జరిగిన కాల్పుల్లో పోరాడి నేలకొరిగారని తెలిపారు.

ఎన్‌కౌంటర్‌లో వీరమరణం పొందిన వారిలో సీసీ స్టాఫ్ రాష్ట్ర కమిటీ స్థాయి కామ్రేడ్ నాగేశ్వరరావు అలియాస్ మధు, అలియాస్ జంగు నవీన్, సీసీ సిబ్బంది సంగీత, భూమిక, వివేక్, సీపీ వైపీసీ కార్యదర్శి కామ్రేడ్ చందన్ అలియాస్ మహేష్, సంజంతి, గుడ్డు రమే, కమల్, లాలస్వో, ఎల్.రాజేష్, రవి, సునీల్, సరిత, రేష్మా, రాజు, జమున, గీత, అంగి, సంకీ, భద్రు, నీలేష్, సంజు, అను సహచరులందరికి మా దండకారుణ్యం స్పెషల్ కమిటీ తరుపున ఘననివాళులు అర్పిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం కుట్రలో భాగంగా జరిగిన ఈ క్రూరమైన ఊతకోచను తీవ్రంగా ఖండించాలని అన్నారు. నంబాల కేశవరావు ఎన్‌కౌంటర్‌పై భిన్న వాదనలు వినపడిన నేపథ్యంలో మావోయిస్టు కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి వికల్ప్ పేరిట లేఖ విడుదల కావడంతో ఎన్‌కౌంటర్‌పై ఘటనపై సందిగ్ధత వీడింది.

**ఎన్‌కౌంటర్ మృతులకు అంత్యక్రియలు**

చత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని నారాయణ పూర్ జిల్లా మాడ్ ఏరియాలో ఈ నెల 21 న జరిగిన ఎన్ కౌంటర్ లో మృతిచెందిన మావోయిస్టులకు నారాయణ పూర్ జిల్లా పోలీసులు సోమవారం అంత్యక్రియలు నిర్వహించి సంచలనం కలిగించారు. ఈ ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన మావోయిస్టు అగ్రనేత కేంద్ర కమిటీ కార్యదర్శి నంబాల కేశవరావు ఆలియాస్ బసవరాజు మృతిచెందిన సంఘటన తెలిసిందే.. కేశవరావు మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించాలని మానవ హక్కుల సంఘాలు ప్రజా సంఘాలు చేసిన విజ్ఞప్తిని చత్తీస్‌గఢ్ ప్రభుత్వం పోలీసులు పట్టించుకోలేదు..దీంతో కుటుంబ సభ్యులు కోర్టు అశ్రయించారు. కోర్టు ఉత్తర్వులను కూడా తోసిపుచ్చి ఎన్ కౌంటర్ మృతదేహాలకు దహన సంస్కారాలు నిర్వహించడం సంచలనం కలిగించింది. మృతదేహాల కోసం బందు మిత్రులు కుటుంబ సభ్యులు నారాయణ పూర్ జిల్లా ఎస్పీ కార్యలయం ఎదుట ఆందోళన సైతం నిర్వహించారు. సాదారణంగా ఎన్ కౌంటర్ జరిగిన తర్వాత మృతదేహాలను గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించడం జరుగుతుంది. మృతదేహాల కోసం కుటుంబ సభ్యులు ఎవరైనా వస్తారా అని నిర్దిష్ట సమయం కోసం ఎదురుచూసిన దాఖలాలు ఉన్నాయి. అప్పటికీ ఎవరూ రాకపోతే పోలీసులే దహన సంస్కారాలు నిర్వహించారు.

**సుప్రీంకోర్టు అశ్రయించనున్న నంబాల కుటుంబ సభ్యులు**

మావోయిస్టు కేంద్ర కమిటీ కార్యదర్శి నంబాల కేశవరావు అలియాస్ బసవ రాజు మృత దేహంతోపాటు మరో ఏడుగురి మృతదేహాలకు నారాయణ్ పూర్ పోలీసులు సోమవారం దహన సంస్కారాలు నిర్వహించారు. ఈ నెల 21న ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని నారాయణ్‌పూర్ జిల్లా గుండెకోట్ అటవీప్రాంతంలో భద్రతా బలగాలు మావోయిస్టుల నడుమ జరిగిన ఎదురుకాల్పులలో నంబాలతో సహా 28 మంది మావోయిస్టులు మృతిచెందిన సంగతి తెలిసిందే ఎన్ కౌంటర్ తర్వాత మృత దేహాలను నారాయణ్ పూర్ జిల్లా కేంద్రానికి తరలించారు. మావోయిస్టు బంధువులు మృతదేహాల కొరకు నారాయణ్ పూర్ వెల్లగా కొన్ని మృతదేహాలను వారి బందువులకు అప్పగించారు. కేశవరావు తో పాటు మరికొంత మంది మృతదేహాలను భద్రతా బలగాలు వారి బంధువులకు అప్పగించలేదు. సోమవారం మృత దేహాలకు దహనసంస్కారాలు పోలీసులే నిర్వహించడం వివాదంగా మారింది. తన సోదరుని మృత దేహాన్ని తమకు చూపించలేదని నంబాల సోదరుడు ఆవేదన వ్యక్తం చేసారు. ఈ విషయమై సుప్రీంకోర్టు కు వెల్లనున్నట్లు తెలిపారు.

## గ్రామంలో ముగ్గురు రైతులకు ఫౌండేషన్ సీడ్

**వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

**హైదరాబాద్, మే 26, ప్రభాతవార్త :** తెలంగాణలోని ప్రతీ రెవిన్యూ గ్రామంలో ముగ్గురు ఎంపిక చేసిన రైతులకు ఫౌండేషన్ సీడ్ (మూల విత్తనం) సరఫరా చేయనున్నట్లు వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరావు తెలిపారు. మూల విత్తనం సరఫరా చేసిన రైతుల పొలాల నిరంతర పర్యవేక్షణ చేయాలన్నారు. హైదరాబాద్ సచివాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ ఆయా రైతులు ఉత్పత్తి చేసిన విత్తనాన్ని తిరిగి ఇతర సాగుదారులకు చేరేవిధంగా చూడాలన్నారు. అప్పుడే ఈ కార్యక్రమం యొక్క లక్ష ్యం నేరవేరుతుందని చెప్పారు. మట్టి నమూనా ఫలితాలు ప్రతీ రైతుకు అందించేటందుకు ప్రభుత్వము కట్టుబడి ఉందన్నారు. అలాగే రాష్ట్రంలో అమలు చేస్తున్న రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమాన్ని గమనంలో పెట్టుకుని కేంద్రం నిర్వహించ తలపెట్టిన వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్‌ను విజయవంతం చేయాలని పేర్కొన్నారు. ఈ నెల 29 నుండి జూన్ 12 వరకు జరిగే ఈ కేంద్ర కార్యక్రమంలో విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు పాల్గొనాలని తెలిపారు. అదేవిధంగా మట్టి నమూనా పరీక్షలు త్వరితగతిన పూర్తిచేయడానికి సాయిల టెస్టింగ్ ల్యాబ్‌లను ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్లకు అందచేయాలన్నారు.

# 30న 'షష్టిపూర్తి' విడుదల

డా.రాజేంద్ర ప్రసాద్, నటి అర్చన ప్రధాన పాత్రల్లో రూపేశ్ హీరోగా, నిర్మాతగా పవన్ ప్రభ తెరకెక్కించిన చిత్రం షష్టిపూర్తి. ఈ మూవీలో ఆకాంక్ష సింగ్ ప్రధాన పాత్రను పోషించారు. ఈ సినిమాను మే 30న విడుదల చేయబోతోన్నారు. రిలీజ్ డేట్ దగ్గర పడుతున్న క్రమంలో దర్శకుడు పవన్ ప్రభ షష్టిపూర్తి గురించి ఎన్నో విషయాల్ని పంచుకున్నారు. ఆయన చెప్పిన సంగతులివే..నేను హోటల్ మేనేజ్మెంట్‌చేశాను. మా ఇంట్లో అంతా ట్రెడిషనల్ సింగర్సే ఉంటారు. నాకు చిన్నతనం నుంచే సినిమాలపై మక్కువ ఏర్పడింది. సినిమాలతోనే మనం మంచిని చెప్పగలమని నమ్ముతాను. అలా నేను చివరకు ఇండస్ట్రీలోకి వచ్చాను. ఫిట్టింగ్ మాస్టర్ సినిమాకు డైరెక్షన్ టీంలో పనిచేశాను. ఆ సినిమాలో ఓ చోట, ఓ చిన్న సీన్‌లో కూడా నేను కనిపిస్తాను. సినిమా విషయంలో నాకు చాలా గ్యాప్ వచ్చింది. ఇన్నేళ్లలో సినిమా అంటే ఏంటో ఇంకా నేర్చుకున్నాను. నేను ఈ షష్టిపూర్తి గురించి చాలా చోట్ల తిరిగాను. ఇళయరాజా కావాల్సిందే అని ముందు నుంచీ ఫిక్స్ అయ్యాను. ఇళయరాజా ఎలా వస్తారు? అని చాలా మంది అంటుండే వారు. ఫ్యామిలీ డ్రామాకు ఎక్కువ క్యాస్టింగ్ కావాల్సి ఉంటుంది. ఇలాంటి చిత్రాలకు డేట్లు అడ్జస్ట్ అవ్వాలి.. షూటింగ్‌కి టైం పడుతుంది. కానీ నేను ఈ సినిమానే చేయాలని ఫిక్స్ అయ్యాను. అందుకే ఇన్నేళ్లు పట్టింది. మాది చాలా పెద్ద ఉమ్మడి కుటుంబం.



నాకు అందరి ప్రేమ తెలుసు. తాతయ్య, అమ్మమ్మ, నానమ్మ, పిన్నమ్మ, పెద్దమ్మ, మేనత్త ఇలా అందరి మధ్య పెరిగాను. కానీ ఇప్పుడు కొందరికి అమ్మానాన్నలు కూడా బరువు అవుతున్నారు. నడి రోడ్డు మీద వారిని వదిలేస్తున్నారు. అమ్మానాన్నల గొప్పదనాన్ని, ప్రేమ విలువను చెప్పాలనే ఉద్దేశంతోనే షష్టిపూర్తిని తీశాను. ఇప్పటి వరకు షష్టిపూర్తి గురించి చూసిన దాని కంటే మే 30వ తేదీని మీరు సర్ ప్రైజ్ అయ్యే అంశాలెన్నో సినిమాలో ఉంటాయి. షష్టిపూర్తి విషయంలో నేను ముందు నుంచీ చాలా క్లారిటీతో ఉన్నాను. రాజేంద్ర ప్రసాద్, అర్చనని నేను మళ్లీ రెండో టేక్ అని అడగాలంటే ఎంత ధైర్యం కావాలి. ఎందుకు అని వారు ప్రశ్నిస్తే.. సమాధానం చెప్పేలా, క్లారిటీ ఇచ్చే స్థాయిలో నేను ప్రిపేర్ అవ్వాలి. అసలు వాళ్లు ఎలా చేయాలో చెప్పే స్థాయిలో నేను ఉండాలి. వాళ్లని యంగ్ లుక్‌లోకి తీసుకెళ్లి.. మళ్లీ ఓల్డ్ లుక్‌లోకి తీసుకు వచ్చాను. ఓ స్ట్రిక్ట్ మదర్ ఎలా ఉంటారో అలానే చూపించాను. ఓ జోవి యల్ ఫాదర్ ఎలా ఉండాలో అలా రాజేంద్ర ప్రసాద్‌ని చూపించాను. షష్టి పూర్తి ట్రైలర్‌ను అందరూ మెచ్చుకుంటారు. సినిమాలో ఏదో విషయం ఉందని అంతా అంటున్నారు. మరీ ముఖ్యంగా బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్ గురించి మాట్లాడుతున్నారు.

# 'థగ్ లైఫ్' పైనే మా నమ్మకం

యూనివర్సల్ స్టార్ కమల్ హాసన్ హీరోగా, లెజెండరీ దర్శకుడు మణిరత్నం దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ హైయాక్షన్ గ్యాంగ్‌స్టర్ డ్రామా థగ్ లైఫ్. ఈ భారీ చిత్రం జూన్ 5న థియేటర్లలో విడుదలకు సిద్ధమవుతోంది. త్రిష, శింబు కీలక పాత్రల్లో నటించిన ఈ సినిమా నుంచి ఇప్పటికే విడుదలై ప్రమోషనల్ కంటెంట్ నేషనల్ వైడ్‌గా సెన్సేషన్ క్రియేట్ చేసింది. హీరో నితిన్ ఫాదర్ ఎన్ సుధాకర్ రెడ్డి శ్రేష్ఠ్ మూవీస్ ద్వారా ఈ సినిమా తెలుగులో విడుదల కానుంది. ఈ సందర్భంగా చెన్నైలో భారీ ఆడియో లాంచ్ ఈవెంట్ వేడుకను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లోక నాయకుడు కమల్ హాసన్ మాట్లాడుతూ ఈ జర్నీలో నాతో కలిసి ఎందరో ఉన్నారు. ఇప్పటికీ వారు తమ ప్రయాణాన్ని కొనసాగిస్తున్నారు. గుండెల్లో ఎంతో కన్నీరుంది. సంతోషంతో వచ్చే కన్నీరుంది.. బాధతో నిండిన కన్నీరు కూడా ఉంది. ఎంతో మంది, ఎన్నో తరాలుగా నన్ను ఆదరిస్తున్నారు. వారికి ధన్యవాదాలు తప్ప మరేం చెప్పలేను. నేను సినిమాకు పెద్ద అభిమానిని. థగ్ లైఫ్ సినిమా గురించి మాట్లాడాలంటే ముందుగా ఎ.ఆర్.రెహమాన్ గురించి. ఇళయ రాజా తర్వాత తన సంగీతంలో నన్ను ముంచెత్తింది రెహమానే. వారిద్దరూ మన దక్షిణాది గర్వపడే గొప్ప కళాకారులు వారు. వారి వయసు మనం లెక్కపెట్టలేం. నన్ను, మణిరత్నంగారిని కలిపింది సినిమానే. ప్రేక్షకులు మమ్మల్ని చూసి వేసే విజిల్స్ మాకోసమే కాదు..సినిమా కోసం కూడా అని నాకు తెలుసు. నేను ఇక్కడున్నందుకు సంతోషపడుతున్నాను. సినిమాటోగ్రాఫర్ రవి కె.చంద్రన్‌గారు గొప్ప టెక్నీషియన్.హాలీవుడ్ రేంజ్‌కు వెళ్లాల్సిన టెక్నీషియన్. ఆయనతో పని చేయటాన్ని గర్వకారణంగా భావిస్తాం. అన్బరివు గొప్ప యాక్షన్ సన్నివేశాలను కంపోజ్ చేశారు. ఇక నటీనటుల విషయానికి వస్తే అందరూ భవిష్యత్తులో గొప్పవారు అవుతారు. శింబు తనెంత గొప్ప స్థాయిని చేరుకుంటాడో నాకు తెలుస్తుంది. ఈ సమూహాన్ని ముందుక నడిపే నాయకుడిగా శింబు ఎదుగుతాడు. ఆ బాధ్యత తనకుంది. త్రిష గురించి చెప్పాలంటే బాహ్య సౌందర్యమే కాదు.. మానసికంగా ఎంతో అందమైనవారు. మరోవైపు జీవాగా నటించిన అభిరామి.. గొప్పగా నటించారు. అశోక్ సెల్వన్‌ను చూస్తుంటే నాజర్‌ను చూస్తున్నట్లే అనిపించింది. నాజర్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. సినిమాను చూసేటప్పుడు అందరూ ఎంతో సంతోషిస్తారు. కానీ తీసేటప్పుడు చాలాసమస్యలను దాటిచిత్రీకరించాల్సి ఉంటుంది. అలాంటి సమస్యలను నేను ఎన్నింటినో దాటి వచ్చాను. అందుకు కారణం.. అభిమానులే. వారికి నేను ఎలా ధన్యవాదాలు చెప్పలో కూడా తెలియటం లేదు. అలాంటి వారి కోసమే నేను రాజకీయాల్లోకి వచ్చాను. నేను ముఖ్యమంత్రి కావటానికో, ఎం.ఎల్.ఎ, ఎం.పి నోమకావటానికి రాజకీయాల్లోకి రాలేదు. ఓ ఎం.ఎల్.ఎ ఏం చేస్తాడో దాన్ని తమిళనాడుకి మెల్లగా చేస్తున్నాం. నాతో పాటు ఉన్నవారందరూ ఇప్పుడు సమాజంలో పెద్దవారిగా ముందుకు నడుస్తున్నారు. అది నాకెంతో గర్వంగా ఉంటుంది. రేపు శింబు కూడా తన వారిని అలాగే ముందుకు తీసుకెళ్లాలి.




# 'కుబేర' సెకండ్ గ్లింప్స్

ధనుష్ నాగార్జున హైలీ యాంటిసిపేటెడ్ యాక్షన్‌ప్యాక్డ్ డ్రామా కుబేర సెకండ్ గ్లింప్స్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. ట్రాన్స్ ఆఫ్ కుబేర్ర పేరుతో ఉన్న ఈ వీడియో, ప్రేక్షకులను కుబేర డార్క్ అండ్ హిప్నోటిక్ వరల్డ్‌లోకి తీసుకెలుతోంది. సినిమాలోని కీలక పాత్రలను, వారు క్రియేట్ చేయబోయే తుఫానును అద్భుతంగా ప్రజెంట్ చేసింది. ముగ్గురు నేషనల్ అవార్డ్ విన్నర్స్ ధనుష్, విజనరీ డైరెక్టర్ శేఖర్ కమ్ముల, రాక్ స్టార్ శ్రీ ప్రసాద్ కలిసి గ్రేట్ సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ అందించబోతున్నారు. ఈ సినిమా లార్జర్ దెన్ లైఫ్ ఎక్స్‌పీరియన్స్ ఇవ్వనుందని ట్రాన్స్ ఆఫ్ కుబేర ప్రామిస్ చేస్తోంది. ఈ ఎక్సయిటింగ్ టీజర్‌లో డీఎస్‌పీ మ్యూజిక్ హైలైట్‌గా నిలిచింది. నాది నాది నాది నాదే ఈ లోకమంతా అనే హిప్నాటిక్ కోరస్ అదిరిపోయింది. నంద కిషోర్ రచించిన ఈ పాటను ధనుష్, హేమచంద్ర వేదాల కలిసి తన డైనమిక్ వోకల్స్‌తో అదరగొట్టారు. ఎస్.పి.అభిషేక్, శెణ్బగరాజ్, సాయి శరణ్, శ్రీధర్ రమేష్, భరత్ కె రాజేశ్ తమ ఎనర్జిటిక్ వోకల్స్‌తో హార్మోనీలను యాడ్ చేశారు. ఈ పాట కుబేర వరల్డ్‌ని అద్భుతంగా ప్రజెంట్ చేస్తోంది.నాగార్జున ఫవర్ ఫుల్ అండ్ ఎమోషనల్ పెర్ఫార్మెన్స్‌తో అదరగొట్టారు. ఆయన పాత్ర బలమైనది, భావోద్వేగంతో కూడినది, విలువలతో నడుచుకునే వ్యక్తిలా కనిపించినా అంతర్గతంగా ఎన్నో ప్రశ్నలతో ఉన్నట్టుగా ఉంది. ఆయన పాత్రను మంచో చెడో అనలేని విధంగా రూపొందించటం సినిమా పట్ల ఎక్సయిట్మెంట్ మరింతగా పెంచుతుంది.



# సంక్రాంతి కానుకగా 'అనగనగా ఒక రాజు'

తనదైన ప్రత్యేక కామెడీ టైమింగ్‌తో ప్రేక్షకుల హృదయాల్లో స్థానం సంపాదించుకున్న బ్లాక్ బస్టర్ మెషిన్ నవీన్ పొలిశెట్టి మరో ఫ్యామిలీ ఎంటర్టైనర్ అనగనగా ఒక రాజుతో అలరించడానికి సిద్ధమవుతున్నారు. ఇప్పటికే చిత్ర బృందం విడుదల చేసిన మోషన్ పోస్టర్ అందరి దృష్టిని ఆకర్షించింది. ఈ చిత్రంతో నవీన్ పొలిశెట్టి థియేటర్లలో నవ్వుల పండుగను తీసుకురాబోతున్నాడని మోషన్ పోస్టర్ తోనే అర్థమైంది. తెలుగు సినీ అభిమానులు సంక్రాంతి పండుగను సినిమా పండుగలా భావిస్తుంటారు. ముఖ్యంగా సంక్రాంతి సమయంలో ఫ్యామిలీ ఎంటర్టైనర్‌లకు ప్రేక్షకుల నుంచి విశేష ఆదరణ ఉంటుంది. ఈ క్రమంలోనే పండుగకి సరైన సినిమాగా అనగనగా ఒక రాజు వచ్చే సంక్రాంతికి థియేటర్లలో అడుగుపెట్టనుంది. తెలుగు సినీ పరిశ్రమలో వరుస విజయాలతో దూసుకుపోతున్న మీనాక్షిచౌదరి అనగనగా ఒక రాజులో నవీన్ పొలిశెట్టికి జోడిగా నటిస్తున్నారు. ఈ చిత్రం మారి దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ప్రేక్షకులను సరికొత్త వినోదాన్ని అందించేలా ఈ చిత్రాన్ని మలుస్తున్నారు. మిక్కీ జె మేయర్ సంగీతం అందిస్తున్నారు. పండుగ రుచికి సరిగ్గా సరిపోయేలా ఆయన తనదైన మ్యూజిక్‌తో మరోసారి మ్యాజిక్ చేయనున్నారు. ఈ చిత్రాన్ని శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ఈ నిర్మాణ సంస్థలు కొన్నేళ్లుగా వరుస ఘన విజయాలను సొంతం చేసుకుంటున్నాయి. ఈ ఏడాది సంక్రాంతికి వచ్చిన డాకు మహారాజ్ బ్లాక్ బస్టర్‌గా నిలిచింది. 2026 సంక్రాంతికి అనగనగ ఒక రాజుతో మరో పండగ విజయాన్ని ఖాతాలో వేసుకోవడానికి సిద్ధమవుతున్నారు. తారాగణం: నవీన్ పొలిశెట్టి, మీనాక్షిచౌదరి
ఛాయాగ్రహణం: జె. యువరాజ్
సంగీతం: మిక్కీ జె. మేయర్.



# ఘనంగా భావయామి పుస్తక ఆవిష్కరణ!

సీతాయణం చిత్ర దర్శకుడు ప్రభాకర్ ఆరిపాక రచించిన కథల సంపుటి భావయామి పుస్తక ఆవిష్కరణోత్సవం హైదరాబాద్ ప్రసాద్ ఫిలిం ల్యాబ్‌లో ఘనంగా జరిగింది. దర్శకుడు వైవిఎస్ చౌదరి, దర్శకుల సంఘం అధ్యక్షులు వీరశంకర్ నటులు అజయ్ ఘోష్, గుండు సుదర్శన్, గేయ రచయిత సురేంద్ర కృష్ణ, డియర్ కామ్రేడ్ దర్శకుడు భరత్ కమ్మ, ప్రముఖ కథా రచయిత మహమ్మద్ ఖదీర్ బాబు, సీనియర్ నిర్మాత వేమూరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈ ఆవిష్కరణ సభకు ప్రముఖ నటుడు, రచయిత డా. తనికెళ్ల భరణి ముఖ్యఅతిథిగా హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించి ప్రసంగించారు. ఈ సందర్భంగా




తనికెళ్ల భరణి మాట్లాడుతూ, ఒకప్పుడు రచయితలు తమ పుస్తకం తామే రాసుకుని వాళ్లే ప్రింట్ చేసుకుని వాళ్లే అమ్ముకునే స్థితి నుంచి ఈరోజు పుస్తకం సింహాసనంపై కూర్చుని రచయిత గర్వపడే విధంగా పాఠకుల ముందుకు పుస్తకాన్ని తీసుకొచ్చిన ఘనత పబ్లికేషన్ సంస్థలదేనన్నారు. ఇలాంటి అద్భుతాలు అన్వీక్షికి వంటి సంస్థలు రావడం వల్లే సాధ్యమైందన్నారు.పాఠకులు, రచయితలు ఇటీవల కాలంలో బాగా పెరిగారని కొత్త రచయితల రాక వలన లక్షల్లో పుస్తకాలు అమ్ముడుపోయే విధంగా అద్భుతాలు జరుగుతున్నాయన్నారు. ఇప్పుడే విడుదలైన భావయామి పుస్తకంలో మంచి కథలు ఉన్నాయని రచయితను అభినందించారు.

# 'భైరవం' ప్రీరిలీజ్ ఈవెంట్

బెల్లంకొండ సాయి శ్రీనివాస్, మంచు మనోజ్, నారా రోహిత్ మోస్ట్ అవైటెడ్ యాక్షన్ థ్రిల్లర్ భైరవం టీజర్, పాటలు, ప్రమోషనల్ కంటెంట్‌కు అద్భుత స్పందనతో, పాజిటివ్ బజ్‌తో ముందుకు దూసుకెల్తుతోంది. విజయ్ కనకమేడల దర్శకత్వంలో, శ్రీ సత్య సాయి ఆర్ట్స్ బ్యానర్‌పై కె.కె. రాధామోహన్ భారీ నిర్మించారు. పెన్ స్టూడియోస్ డాక్టర్ జయంతీలాల్ గాడా సమర్పిస్తున్నారు. ఈ సినిమా మే 30న సమ్మర్ సీజన్‌లో బిగ్గెస్ట్ రిలీజ్‌కి సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో మేకర్స్ గ్రాండ్‌గా ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ప్రిరిలీజ్ ఈవెంట్‌లో హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ మాట్లాడుతూ, అందరికీ నమస్కారం. ఈ వేడుకకు విచ్చేసిన అందరికీ పేరు పేరునా ధన్యవాదాలు. మీరందరూ కూడా మాకు మంచి హిట్ పడాలని కోరుకుంటున్నారు. అది మాకు తెలుస్తుంది. ఈ సినిమాల్లో పని చేసిన సాంకేతిక నిపుణులకు నటీనటులందరికీ మనస్ఫూర్తిగా ధన్యవాదాలు. శ్రీ చరణ్ పాకాల మ్యూజిక్ ఇరగదీశారు. మే 30న మీరందరూ సినిమా చూసి మా టీమ్ అందరిని బ్లెస్స్ చేయాలి అని కోరుకుంటున్నాను. సినిమా మీ అందరికీ ఒక అద్భుతమైన ఎక్స్పీరియన్స్ ఇస్తుంది. ఒక మంచి సినిమా చూసామనే సాటిస్ఫాక్షన్ ఉంటుంది. ఈ సినిమా కోసం మేము చాలా కష్టపడి ఇష్టపడి మీ అందరికీ ఒక మంచి సినిమా ఇవ్వాలని ఇవ్వాలని ఉద్దేశంతో చేసాం. డైరెక్టర్ విజయ సినిమాని చాలా కష్టపడి తీశారు. ఆయన హార్డ్ వర్క్ ప్రతి ఫ్రేమ్‌లో కనిపిస్తుంది. ఈ సినిమా ఫైనల్ కట్ చూశాను. అదిరిపోయింది. మామూలుగా ఉండదు. మే 30న మనందరికీ పెద్ద పండగ. ఆ పండగలో మీరందరూ భాగం కావాలని కోరుకుంటున్నాను. రాధా మోహన్ లాంటి నిర్మాతలు ఇండస్ట్రీలో ఉండాలి. మనోజ్ అన్నకి రోహిత్‌కి అతిథి ఆనంద్‌కి ప్రతి ఒక్కరికి మనస్ఫూర్తిగా ధన్యవాదాలు. సినిమా అద్భుతంగా ఉండబోతుంది. సక్సెస్ మీట్‌లో మాట్లాడుకుందాం. లవ్ యు ఆల్ అన్నారు హీరో మంచు మనోజ్ మాట్లాడుతూ, అందరికీ నమస్కారం. సినిమా మే 30న రిలీజ్ కాబోతుంది. చాలా ఆనందంగా ఉంది. రోహిత్ నేను సాయి సొంత బ్రదర్స్ లాగే ఉన్నాం. ఈ సినిమాతో మా బంధం మరింత పెరిగింది. కలకాలం అది ఇలాగే ఉండాలని ఆ దేవున్ని కోరుకుంటున్నాను. అతిథి ఈ సినిమాలో పార్ట్ కావడం చాలా ఆనందంగా ఉంది. ఆనంది గారితో కలిసి వర్క్ చేయడం గ్రేట్ ఎక్స్పీరియన్స్. మా టీమ్ అందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు. సినిమా అనేది కులం చూడదు.






# తెలుగు, హిందీలో 'డకాయిట్' గ్లింప్స్

అడివి శేష్ హైలీ యాంటిసిపేటెడ్ పాన్‌ఇండియన్ థ్రిల్లర్ డకాయిట్ ఫైర్ గ్లింప్స్ తెలుగు, హిందీలో రిలీజ్ అయ్యింది. ఇంటెన్స్ యాక్షన్, స్టైలిష్ విజువల్స్‌తో ఫైర్ గ్లింప్స్ అదిరిపోయింది. శేష్, మృణాల్ ఠాకూర్ మధ్య ఉద్రిక్త క్షణంలో గ్లింప్స్ ప్రారంభమోతోంది. సానుభూతితో నిండిన వాయిస్‌లో శేష్ ఆమెను జూలియట్ అని పిలుస్తాడు, అందరూ ఆమెకు అన్యాయం చేశారని చెబుతాడు. కానీ వెంటనే అతని వాయిస్ మారుతుంది. నేను నిన్ను మోసగించడానికి రాలేదు, అంతకంటే ఎక్కువ చేస్తా అని మిస్టీరియస్ స్మైల్‌తో శేష్ చెప్పే డైలాగ్ అదిరిపోయింది. నెక్స్ట్ ఎపిసోడ్, ఖైదీ యూనిఫాంలో జైలు వ్యాన్‌లో వున్న శేష్ కూల్‌గా తన నోటి నుండి ఒక కీని బయటకు తెస్తాడు. తర్వాత ఓ రైలు వ్యాన్ మీదుగా దూసుకెళ్తుంది. చివరి సన్నివేశంలో, మృణాల్ అతని పక్కన కూర్చుంటుంది, శేష్ ఫైరింగ్ చేస్తాడు. ప్రేమ, ప్రతీకారం, మోసంతో నిండిన ఓ గొప్ప కథకు ఇది నాంది. విజువల్‌గా డకాయిట్ ఫైర్ గ్లింప్స్ కొత్త బెంచ్‌మార్క్‌ను సెట్ చేసింది. అడివి శేష్ ఇంటెన్స్ అండ్ రగ్గడ్ పాత్ర కోసం పూర్తిగా మేకోవర్ అయ్యారు. మదనపల్లె యాసలో అదరగొట్టాడు. అతని వాయిస్ మాడ్యులేషన్, ఎక్స్ ప్రెషన్స్ అద్భుతంగా వున్నాయి. హిందీ వెర్షన్‌కు కూడా తనే డబ్బింగ్ చెప్పారు. అది అద్భుతంగా వచ్చింది. మృణాల్ ఠాకూర్ స్ట్రాంగ్ క్యారెక్టర్‌లో కనిపించింది. అనురాగ్ కశ్యప్ ప్రజెన్స్ ఇంపాక్ట్ ఫుల్‌గా వుంది. దర్శకుడు షానియల్ డియో విజువల్ ప్రజెంటేషన్ అదరగొట్టాడు. టీజర్ సినిమా స్కేల్ ఎంత బిగ్గర్‌గా వుంటుందో తెలియజేసింది. భీమ్స్ సిసిరోలియో నేపథ్య సంగీతం ఎమోషన్‌ని మరింత ఎలివేట్ చేసింది.



# ఒరు ఆధార్ లవ్ మూవీతో 'ప్రియా ప్రకాష్ వారియర్' ఎంట్రీ

మలయాళ పరిశ్రమ నుంచి వచ్చే భామలకు మిగతా సౌత్ భాషల్లో మంచి డిమాండ్ ఉంటుంది. ముఖ్యంగా అక్కడ భామలు అభినయానికి ప్రాధాన్యత ఇచ్చే సినిమాలు చేస్తూ ప్రేక్షకులను ఎంటర్టైన్ చేస్తూ ఉంటారు. అందుకే అక్కడ ఏదైనా హీరోయిన్ క్లిక్ అయితే చాలు వెంటనే తెలుగు, తమిళ భాషల్లో ఛాన్స్‌లు ఇస్తుంటారు. అలా మలయాళం నుంచి వచ్చిన ఎంతోమంది హీరోయిన్స్ తెలుగు, తమిళ్‌లో సక్సెస్ ఫుల్ హీరోయిన్స్‌గా రాణించారు. ఐతే అందరికీ అలాంటి బజ్ వస్తుందని చెప్పడం కష్టం. ముఖ్యంగా పాపులారిటీ వచ్చినా కథల ఎంపికల వల్ల ఆ క్రేజ్ తెచ్చుకోవడంలో వెనుకబడతారు. అలాంటి వారిలో చెప్పుకుంటే ముందు వరుసలో ఉంటుంది వింక్ బ్యూటీ ప్రియా ప్రకాష్ వారియర్. ఒరు ఆధార్ లవ్ సినిమా టీజర్ తో నేషన్ మొత్తాన్ని తన కన్నుగీటి మాయలో పడేసింది అమ్మడు. ఆ సినిమా రిలీజ్ టైంలో ప్రియా క్రేజ్ ఒక రేంజ్‌లో ఉంది. ఐతే సినిమాలో ఆమె సైడ్ హీరోయిన్ అవ్వడం అంచనాలను అందుకునేలా సినిమా లేకపోవడం వల్ల నిరాశపరిచింది. ఐతే ఆ క్రేజ్ తో తెలుగు ఆఫర్లు వచ్చినా అమ్మడు అప్పుడు కాదనేసింది. స్టార్ ఛాన్స్‌ల కోసం ఎదురుచూసి వచ్చిన ఒకటి అర అవకాశాలు కాదనుకుంది. కట్ చేస్తే తెలుగు పరిశ్రమ అమ్మడికి లైట్ తీసుకుంది. ఆ తర్వాత మళ్లీ కొన్ని ఆఫర్లు రాగా వాటిని ఒకే చేసింది. నితిన్, తేజా సజ్జ లాంటి వారితో సినిమాలు చేసిన ప్రియా ప్రకాష్ ఆ సినిమాతో ఇంపాక్ట్ క్రియేట్ చేయలేకపోయింది. ఫైనల్‌గా తెలుగులో ఆశించిన బ్రేక్ రాబట్టలేదు సరికదా అసలు ఆమెను పట్టించుకోలేదు. ఐతే ఇదే క్రమంలో తమిళ్‌లో ప్రయత్నాలు చేస్తుంది అమ్మడు. రీసెంట్‌గా అజిత్ నటించిన గుడ్ బ్యాడ్ అగ్లీ సినిమాలో ఆమె స్పెషల్ క్యామియో ఆడియన్స్‌ని అలరించింది. ఇక రీమిక్స్ సాంగ్ కి డ్యాన్స్ చేసి అలరించింది అమ్మడు. ఆ సినిమా కూడా అజిత్ ఫ్యాన్స్‌ని అలరించింది. సో హిట్ వైబ్‌ని క్యాచ్ చేస్తూ అమ్మడు మరికొన్ని అవకాశాలు అందుకుంటుందా లేదా అన్నది చూడాలి. ప్రియా ప్రకాష్ వారియర్ సినిమా ఆఫర్లు ఎలా ఉన్నా అమ్మడు సోషల్ మీడియాలో మాత్రం గ్లామర్ షోతో అదరగొట్టేస్తుంది. కెరీర్‌లో ఒక మంచి బ్రేక్ కోసం ఎదురుచూస్తున్న అమ్మడు ప్రయత్నాలు మాత్రం ఆపట్లేదు. మరి అమ్మడికి అలాంటి ఛాన్స్ ఎవరిస్తారన్నది చూడాలి.



# ఫ్రిజ్‌లో ఎన్ని రోజులు పెట్టవచ్చు ?



ఫ్రిజ్‌లో పెడితే పదార్థాలు పాడైపోవు అనుకుంటారు చాలామంది. కానీ వాటికీ ఎక్స్‌పైరీ డేట్ ఉంటుంది. అంతేకాదు. అవి చూడ్డానికి, రుచికి బాగానే ఉంటాయి. కానీ మన ఆరోగ్యాన్ని పాడు చేసే బ్యాక్టీరియా వాటిలో అభివృద్ధి చెందుతుంది అంటున్నారు నిపుణులు. కాబట్టి ఏ పదార్థం ఎప్పుడు ఫ్రిజ్‌లో పెట్టాలి? ఎన్ని రోజులు ఉంచాలి? తెలుసుకుందాం..

✦ ఏ కాలంలోనైనా ఫ్రిజ్‌లో ఉష్ణోగ్రత 40 డిగ్రీల ఫారన్‌హీట్ (4.4 డిగ్రీల సెల్సియస్)కు మించకుండా చూసుకోవాలి.

✦. పాలు, పాల పదార్థాలు, మాంసం, కోడిగుడ్లు, చేపలు.. వంటి త్వరగా పాడైపోయే పదార్థాలు బయటి నుంచితెచ్చిన రెండు గంట ల్లోపే ఫ్రిజ్‌లో పెట్టేయాలి. ఒకవేళ బయట ఉష్ణోగ్రత 90 డిగ్రీల ఫారన్‌హీట్ (32.2 డిగ్రీల సెల్సియస్) కంటే ఎక్కువగా ఉన్నట్లయితే తెచ్చిన గంటలోపే ఈ పదార్థాల్ని ఫ్రిజ్‌లో పెట్టాలి.

✦ గడ్డకటిని పదార్థాలను కిచెన్ ప్లాట్ ఫామ్, టేబుల్‌పై పెట్టి వాటంతటవే కరిగిపోతాయి అని వదిలేయడం మంచిది కాదు. ఎందుకంటే గది ఉష్ణోగ్రత వద్దకు చేరేసరికి ఆయా పదార్థాల్లోని బ్యాక్టీరియా రెండింతలవుతుంది. కాబట్టి కౌంటర్ టాప్స్‌పై పెట్టి ఘనీభవించిన పదార్థాల్ని అస్సలు కరిగించ కూడదు. నీటిలో/ మైక్రోవేవ్ ఒవెన్‌లో పెట్టి కరిగించడం సురక్షితం.

✦ సూప్స్, ఇతర కూరల్ని 'కాయగూరలు లేదా ఇతర మాంసాహారం కలిపి తయారుచేసినా మూడు నాలుగు రోజుల వరకు ఫ్రిజ్‌లో నిల్వ చేయచ్చు.

✦. మిగిలిపోయిన ఆహార పదార్థాలు (మాంసం, పౌల్ట్రీ, చికెన్ నగెట్స్/ ప్యాటీస్, పిజ్జా.. వంటివి ఫ్రిజ్‌లో మూడునాలుగు రోజులు ఉంచచ్చు. అలాగని అన్ని పదార్థాలను రోజుల తరబడి ఫ్రీజర్లో పెట్టి ఎప్పుడో వినియోగించడం కరక్ట్ కాదు. అయితే సాధ్యమైనంతవరకు మనం తీసుకునే ఆహార పదార్థాల్ని తాజాగా, పరిశుభ్రంగా, అప్పటికప్పుడు వండుకొని, వేడివేడిగా తీసుకోవడమే మంచిదని చెబుతున్నారు నిపుణులు. కాబట్టి వీలైనంత వరకు మిగిలిపోయిన అన్ని పదార్థాలనీ ఫ్రిజ్‌లో తోసేయకుండా జాగ్రత్త పడడం మంచిది. ▫

# మిస్ వరల్డ్ క్రీడల ఛాలెంజ్ విజేతలు

మిస్‌వరల్డ్ పాజెంట్-2025లో భాగంగా జరిగిన క్రీడల ఛాలెంజ్ పోటీల్లో మిస్ వరల్డ్ ఎస్టోనియా ఎలిస్ రాండ్మా విజేతగా నిలవగా ,మొదటి, రెండో రన్నరప్‌లుగా మిస్ వరల్డ్ మార్టినిక్ ఆరేలీ జోచిమ్, మిస్ వరల్డ్ కెనడా ఎమ్మా మోరిసన్‌లు నిలిచారు.

**అనాథల కోసం ... ఎలిస్ రాండ్మా**



ఈ పోటీల్లో స్వర్ణ పతకం గెలుచుకున్న రాండ్మా కిర్నాలో పుట్టి పెరిగారు. స్కూలింగ్ పూర్తయ్యాక ఐటి సిస్టమ్స్ డెవలప్‌మెంట్‌లో డిగ్రీ పూర్తిచేశారు. ఎలిస్‌కి ఆటలేకాదు.. డ్యాన్స్, మేకప్, పర్యావరణంపై ప్రత్యేక ఆసక్తి. ఈ పోటీలకు ముందు మిస్ గ్రాండ్ ఇంటర్నేషనల్, ది మిస్‌గ్లోబ్, మిస్ ఎర్త్, టాప్ మోడల్ ఆఫ్ వరల్డ్.. వంటివాటికి తన దేశం తరపున ప్రాతినిధ్యం వహించారు. 'బ్యూటీ విత్ ఎ పర్పస్' కోసం 'సువిన్ ఐడాటా' అనే ఆన్‌లైన్ ప్రాజెక్టు నిర్వహిస్తున్నారు. అనాథాశ్రమాల అవసరాలను గుర్తించి దాతలలో అనుసంధానించే లక్ష్యంతో ఇది నడుస్తోంది.



**ప్రకృతిపై ప్రేమ.. - ఆరేలీ జోచిమ్**

72వ అందాల పోటీ క్రీడల ఛాలెంజ్‌లో ఆరేలీ జోచిమ్ రజత పతకాన్ని అందుకున్నారు. డ్యూకోస్ ఆమె స్వస్థలం. 18 ఏళ్ల వయసులో మొదటిసారి అందాల పోటీల్లో పాల్గొని మిస్ మార్టినిక్ కిరాటాన్ని సొంతం చేసుకున్నారు. తొమ్మిదేళ్ల తర్వాత ఇప్పుడు మిస్ వరల్డ్ కిరీటం కోసం పోటీపడుతున్నారు. అథ్లెట్ అయిన ఆరేలీకి సముద్రాన్ని చూడటమన్నా, ప్రకృతిని ఆస్వాదిస్తూ హైకింగ్ చేయడమన్నా ఇష్టమట. తోటివారికి సేవ చేయడంలోనే సంతృప్తి ఉందని చెప్పే ఆరేలీ 'మైసన్ లాన్మే' అనే సంస్థను స్థాపించి మానసిక ఆరోగ్యం కోసం కృషి చేస్తున్నారు.


**మొదట కాదన్నా... - ఎమ్మా మోరిసన్**

స్పోర్ట్స్ ఛాలెంజ్‌లో ఎమ్మా మోరిసన్ కాంస్య పతకాన్ని అందుకున్నారు. 'ప్రపంచ సుందరి పోటీలు... సామాజిక సేవకు చక్కటి వేదిక' అంటారామె. ఒంటారియోలోని ప్రాచీన ఆదిమ తెగలో జన్మించారు. టూరిజంలో డిగ్రీ చేశారు. మిస్ కెనడా కిరీటాన్ని గెలుచుకున్నాక పదివేల అమెరికన్ డాలర్లను దాతృత్వ కార్యక్రమాలకోసం వెచ్చించారు. ఓసారి తెలిసిన వారొకరు ఎమ్మాను ప్రపంచ సుందరి పోటీల్లో పాల్గొనమని అడిగారట. మొదట కాదన్నా... తర్వాత ఇవి ఆత్మసౌందర్యాన్ని ప్రతిబింబించేలా, సామాజిక సేవకు అవకాశం కల్పించేలా సాగడం తెలిసి ఒకే చెప్పారట. అందులో భాగంగా 'రీ కనెక్టింగ్ విత్ రిబ్బన్ స్కర్ట్స్' పేరుతో అమ్మమ్మ తనకి నేర్పిన అల్లికలతో మహిళలకు ఉపాధి కల్పించే ఓ ప్రాజెక్టుని రూపొందించారట. అదే ఎమ్మా గెలుపుకు కీలకమైంది.



ఎంతమంది హేళన చేసినా... అనుకున్నదానికోసం కష్టపడే తత్వమే తనని ముందుకు నడిపిస్తారామె. ▫

# ఇంట్లో మేనిక్యూర్..



చేతులు కోమలంగా, గోళ్లు ఆరోగ్యంగా కనిపించాలంటే మేనిక్యూర్ అవసరమే. దీన్ని ఇంట్లోనే ఎలా చేసుకోవాలంటే..

✦ ముందుగా గోళ్లపై ఉన్న నెయిల్ పాలిష్ తొలగించండి. ఆపై అరచెంచా ఉప్పు, కొద్దిగా బాదం నూనె, కాస్త నిమ్మరసం కలిపిన మిశ్రమంలో కనీసం 10 నిమిషాలపాటు గోళ్లను నానబెట్టండి. దీనివల్ల గోళ్లు శుభ్రపడటమే కాదు... పసుపు తగ్గి ప్రకాశిస్తాయి. చేతులు టాన్ తగ్గి మెరిసిపోతాయి.

✦ .రెండో దశలో గోళ్లను కత్తిరించి రౌండ్, స్క్వేర్, ఓవల్... ఇలా మీకు నచ్చిన రూపు ఇవ్వండి. ఆపై గోరువెచ్చని నీళ్లలో రెండు చుక్కల షాంపూ లేదా బాడీవాష్ కలిపి అందులో కనీసం పది నిమిషాలు చేతుల్ని నాననివ్వండి.

✦ తర్వాత ఆరెంజ్ స్టిక్ లేదా క్యూటికల్ పుషర్ చుట్టూ ఉన్న మృతచర్మాన్ని తొలగించండి. ఆపై ఆలివ్ ఆయిల్తో రుద్దాలి. తర్వాత చిన్న బ్రష్ తీసుకుని గోళ్లపై రుద్దితే సరి. మురికి వదులుతుంది. ఇప్పుడు చెంచా చొప్పున పెరుగు, పంచదార, తేనె కలిపిన మిశ్రమాన్ని చేతులకు రాసి వేళ్లతో వలయాకారంగా స్క్రాబ్ చేయండి.

✦ చివరగా చేతుల్ని చల్లటి నీళ్లతో కడిగేసి కాస్త బాదం నూనె రాసి మరోసారి మృదువుగా మర్దన చేయండి. వారానికోసారి ఇలా చేయడంవల్ల చేతులు నాజూగ్గా కనిపిస్తున్నాయి. ఆరోగ్యంగానూ ఉంటాయి. గిన్నెలు తోమడం, బట్టలు ఉతకడం వంటి పనులు ఎక్కువగా చేసేవారు... రోజూ రాత్రిపూట గ్లిజరిన్ రాయడాన్ని అలవాటుగా మార్చుకోండి. ▫

# ఇన్‌స్టంట్ పల్లీ పౌడర్

ఇడ్లీ, వడ, దోశ ఇలా ఏ టిఫిన్ చేసినా.. అందులోకి పల్లీ పచ్చడి ఉండాల్సిందే. అప్పటికప్పుడు చట్నీ చేయాల్సిన పని లేకుండా రెడీమేడ్గా ఉందనుకోండి. సగం పని తగ్గినట్లే అందుకోసం ముందుగానే పౌడర్ చేసిపెట్టుకోవచ్చు. ఈ ఇన్‌స్టంట్ పల్లీ చట్నీ కోసం.. పల్లీలు అర కప్పు, పుట్నాలపప్పు ముప్పావు కప్పు, ఆవాలు, మినప్పప్పు, జీలకర్ర చెంచా చొప్పున, కారం ముప్పావు చెంచా, ఉప్పు రుచికి తగినంత నూనె, ఎండుమిర్చి 8, వెల్లుల్లి తరుగు చెంచా, కరివేపాకు రెండు రెబ్బలు, రెండు రెబ్బలు, చింతపండు కడాయిలో పల్లీలను వేయించి పళ్లెంలోకి తీయాలి. తర్వాత పుట్నాలపప్పు, వెల్లుల్లి, ఆరు ఎండుమిర్చిలను వేయించాలి. అందులో చింతపండు వేసి.. తేమ పోయేదాకా వేయించి తీయాలి. అన్నీ చల్లారాక మిక్సీ జార్లో వేసి గ్రైండ్ చేయాలి. కడాయిలో నూనె కాకనిచ్చి.. ఆవాలు, మినప్పప్పు, జీలకర్ర, మిగిలిన ఎండుమిర్చి, కరివేపాకులను ఒక్కొక్కటిగా వేయాలి. అవి వేగాక, గ్రైండ్ చేసిన పొడి జతచేసి కలియతిప్పుతూ ఒక నిమిషం వేయించాలి. చల్లారిన తర్వాత తడిలేని గాలి చొరబడని సీసాలో భద్రం చేసుకోవాలి. అవసర మైన ప్పుడు తగినంత పొడిని కాసిని వేడినీళ్లలో కలిపా మంటే.. రోజూ చేయాల్సిన శ్రమ తప్పుతుంది. తాజా పల్లీ చట్నీ తిన్నట్టే ఉంటుంది. ▫



# సన్‌ఫ్లవర్ గింజలతో మెరుపు !



చర్మంపై పేరుకొన్న జిడ్డు, మురికి కారణంగా మొటిమలు రావడం, చర్మం నిర్జీవంగా తయారవడం లాంటివి జరుగుతాయి. వేసవిలో ఇలాంటి సమస్యలు మరింత అధికం. అయితే. ఇలాంటి సమస్యలన్నిటికీ పొద్దు తిరుగుడు గింజలతో చెక్ పెట్టచ్చు.

**చర్మం శుభ్రపడటానికి..** సన్‌ఫ్లవర్ గింజలతో తయారుచేసిన స్క్రబ్ ఉపయోగించడం ద్వారా చర్మం, చర్మరంధ్రాలు శుభ్రపడి కొత్త కళ సంతరించుకొంటుంది. ఈ ఫలితాన్ని పొంద డానికి.. అరకప్పు పొద్దుతిరుగుడు గింజలను తీసుకొని మిక్సీలో వేసి పొడిలా తయారు చేసుకోవాలి.దీనికి కొద్దిగా నీరు కలిపి చిక్కటి మిశ్రమంలా చేసుకొని గాజు సీసాలో వేసి ఫ్రిజ్‌లో భద్రపరచుకోవాలి. ఈ మిశ్రమంతో రోజూ ముఖాన్ని మెడను రుద్దుకొంటూ ఉంటే. చర్మం శుభ్రపడటంతోపాటు తగిన పోషణ అంది ఆరోగ్యంగా తయారవుతుంది.

**పొడిబారిన చర్మానికి...** పొద్దుతిరుగుడు గింజలను రెండు నుంచి మూడు గంటల పాటు ఎండలో ఉంచాలి. ఆ తర్వాత వాటిని మిక్సీలో వేసి పొడిలా చేసుకోవాలి. ఇలా చేసేటప్పుడు మరీ మెత్తగా కాకుండా.. కాస్త గరుకుగా ఉండేలా చూసుకోవాలి. దీన్ని గాజు సీసాలో భద్రపరుచుకోవాలి. ఇలా తయారుచేసిన పొడిని టీస్పూన్ పరిమాణంలో తీసుకొని.. దీనికి మరో టీస్పూన్ వెన్న తొలగించని పాలు, చిటికెడు పసుపు కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి అప్లై చేసుకొని పావుగంట నుంచి 20 నిమిషాల పాటు ఆరనివ్వాలి. ఆ తర్వాత కడిగేస్తే సరిపోతుంది. ఈ ప్యాక్ ముఖంపై పేరుకొన్ని మురికిని తొలగిస్తుంది. చర్మానికి తేమనందించి పొడి చర్మం సమస్య నుంచి విముక్తి కలిగిస్తుంది. అలాగే



చర్మఛాయ సైతం మెరుగుపడుతుంది. ఈ ప్యాక్‌ని వారానికోసారి వేసుకోవడం ద్వారా చక్కటి ఫలితం కనిపిస్తుంది.

**మిశ్రమ చర్మతత్వం ఉంటే..** మిశ్రమ చర్మతత్వం కలిగిన వారికి చర్మంపై ప్యాచెస్ మాదిరిగా అక్కడక్కడా పొడిగా కనిపిస్తూ ఉంటుంది. ఇలాంటి వారికి పొద్దుతిరుగుడు గింజలతో తయారుచేసిన ఫేస్‌ప్యాక్ చక్కగా నప్పుతుంది. దీనికోసం పై పద్ధతిలో తయారుచేసి పెట్టుకొన్న సన్‌ఫ్లవర్ గింజల పొడిని టీస్పూన్ తీసుకోవాలి. దీనికి కొద్దిగా గంధం పొడి, రోజ్‌వాటర్ కలిపి మిశ్రంగా తయారుచేసుకోవాలి. దీన్ని ముఖానికి అప్లై చేసుకోవాలి. ఇరవై నిమిషాల తర్వాత తడివస్త్రంతో ముఖం తుడుచుకొని శుభ్రం చేసుకోవాలి. ఈ ప్యాక్ వేసుకోవడం వల్ల ముఖంపై డ్రై ప్యాచెస్ పోవడంతో పాటు చర్మం సైతం అందంగా కనిస్తుంది. ▫

# చకచకా చేసేయొచ్చు..



బరువు తగ్గడానికో.. మధుమేహం వల్లో లేదా ఇతర కారణాల మూలంగానో చపాతీలు తినేవాళ్లు ఎందరో ఉంటారు. ఇవి తినడానికి ఎంతో రుచిగా ఉంటాయి కానీ పిండి కలపాలంటేనే కాస్త విసుగ్గా ఉంటుంది. ఆ పనిని సులువు చేసేందుకు వచ్చిందే 'సిలికాన్ నీడింగ్ అండ్ రోలింగ్ మ్యాట్. గిన్నెలో పిండి కలుపుతుంటే, రొట్టెల పీట మీద చపాతీ చేస్తున్న ప్పుడూ చేతులతోపాటు, పీటకూ పిండి అతుక్కు పోతుంది. కానీ ఈ సిలికాన్ మ్యాట్ మీ దగ్గర ఉంటే ఇక అలాంటి సమస్యే ఉండదు. పిండి కలపడం, రొట్టె చేయడం కూడా చకచకా అయి పోతాయి. చాలా సౌలభ్యంగా ఉండే ఈ మ్యాట్ నచ్చితే మీరూ ఒకటి కొనుక్కోండి. పైగా దీన్ని శుభ్రం చేయడం కూడా చాలా తేలిక. ▫



# శాకాహారంతో మెనోపాజ్ లక్షణాలకు చెక్ !

మెనోపాజ్ దశలో రుతుక్రమం ఆగడం, వేడి ఆవిర్లు, నిద్రలేమి, బరువు పెరగడం, భావోద్వేగాల్లో మార్పులు... తదితర లక్షణాలు ఉంటాయి. జీవక్రియలోనూ మార్పులు చోటుచేసుకుంటాయి. శాకాహారానికి ప్రాధాన్యమిస్తే ఈ మెనోపాజ్ లక్షణాల తీవ్రతను తగ్గించవచ్చు అంటోందో పరిశోధన, పప్పుదినుసులు, ఆకుకూరలూ కూరగాయలను అధిక మోతాదులో తీసుకోవడంతోపాటు, భిన్నమైన రకాలు ఉండేలా చూసుకోవాలంటున్నారు లండన్‌లోని కింగ్స్ కాలేజీ. ఒక ఆరోగ్య, పోషకాహార యాప్‌ని ఉపయోగించే 7వేల మంది మహిళలను ఈ పరిశోధ నకు ఎంపికచేసింది. వాళ్లంతా శాకాహారానికి మారిన ఏడు నెలల తర్వాత మెనోపాజ్ లక్షణాల్లో తీవ్రత మూడో వంతు తగ్గినట్లు తెలుస్తోంది. పోస్ట్ మెనోపాజ్ దశలోని మహిళల్లో ఈస్ట్రోజన్ స్థాయులు తగ్గడం మూలాన చక్కెరలూ, కొవ్వులతో కూడిన ఆహారం తీసుకుంటే పొట్టలోని సూక్ష్మజీవుల వ్యవస్థ మారుతుంది. బదులుగా ఈ దశలో ఉండే మహిళలు ప్రొటీన్ అధికంగా ఉండే నట్స్, విత్తనాలు, బీన్స్, పప్పులు తీసుకోవడం మేలంటున్నారు పరిశోధకురాలు ఫెడెరికా అమాటి. పై విషయాన్ని దృష్టిలో పెట్టుకుని వారంలో 30 విభిన్న శాకాహార పదార్థాల్ని తీసుకుంటే ఎంతో మేలు అంటారు. ▫



# మహాభారతము

ఆధ్యాత్మికం



రైభ్యుడు, భరద్వాజుడు గొప్ప తపస్వులు, మంచి మిత్రులు. ఆరణ్యంలో ఆశ్రమాలు నిర్మించుకొని తపస్సు చేసేవాళ్లు. భరద్వాజుడి కొడుకు యవక్రీతుడు ఒక రోజు రైభ్యుని ఆశ్రమానికి పోయి రైభ్యుడి కొడల్ని చూసి ఆమె అందచందాలకు మోహితుడై తనకోరికను తెలిపాడు. ఆమె చాకచక్యంగా తప్పించుకొనిపోయి, ఏడుస్తూ రైభ్యుడికి విషయాన్ని వివరించింది. కోపంతో రైభ్యుడు తన జటలను రెండు ఊడపెరిగి అగ్నిహోత్రంలో వేశాడు. ఒక జట నుండి చాలా అందమైన స్త్రీ, మరొక్క దాన్నుండి రెండు కోరలతో వున్న భయంకర ఆకారంగల రాక్షసుడు, ఉద్భవించి బయటికి వచ్చారు. మహర్షీ! ఏమి ఆజ్ఞ? అన్నారు. రైభ్యుడు వారితో, మీరు వెళ్ళి యవక్రీతుణ్ణి సంహరించండి అన్నాడు. ముందు ఆసుందరాంగి వెళ్ళి యవక్రీతుడితో సరసాలాడుతూ అతడి కమండలాన్ని తీసేసికొంది. దాంతో అతడు అపవిత్రుడై తపశ్శక్తిని కోల్పోయాడు. ఇక వెంటనే రాక్షసుడు వచ్చి యువక్రీతుణ్ణి తన శూలంతో పొడిచి చంపాడు. సుందరాంగి, రాక్షసుడు రైభ్యుని వద్దకు వెళ్లి యవక్రీతుణ్ణి చంపామని చెప్పారు. ఆ మహర్షి వారిద్దరికీ వివాహం చేసి పంపారు. భరద్వాజుడు ఆశ్రమానికి వచ్చి తన కొడుకు చచ్చిపడి ఉండటాన్ని చూసి శోకాన్ని భరించలేక కొడుకు చితిలో పడి తానూ మరణించాడు. ఇది మనకు మహాభారత ములో అరణ్యపర్వము తృతీయాస్వాసము పుటలు 298-299లో కనపడే కథ (రామకృష్ణ మఠ ప్రచురణ) కోపమనేది ఎంతటి తపస్సులచేనైనా ఎంతటి ఘోర కృత్యాలనైనా చేయిస్తుందని తెలుపుతుంది ఈ కథ. తన మిత్రుడు భరద్వాజుడు అను స్పృహను కూడా కోల్పోయి రైభ్యుడు భరద్వాజుని కుమారుడైన యవనరకీతుణ్ణి చంపించాడు. యవక్రీతుడు చేసిన నేరం ఏమంత ఘోరమైనదికాదు, ఒక హెచ్చరికతో సరిదిద్దవచ్చు. కానీ రైభ్యుడు ఒకేసారి అతనికి చావును విధించాడు. మిత్రుని కొడుకని కనికరించలేదు. అతని కోసం మిత్రునికీ కూడా మృత్యువయింది. కోపం తెచ్చిపెట్టే దుష్ఫలితాల్ని చెప్పి దాని పట్ల జాగ్రత్త వహించమని బోధిస్తుంది. ఈ కథ. ఇక కొడుకుపైనున్న మమకారం భరద్వాజుడంతటి తపస్విని ఆత్మహత్యకు పురికొల్పింది. అందుకే అహంకారమమకారాలుండరాదంటుంది వేదాంతం. వివేకవంతునికి మహాభారతం విజ్ఞాన ఖనే.

**- రాచమడుగు శ్రీనివాసులు.**

# పిల్లల ముందు పరుష పదజాలం వద్దు !

ప్రస్తుతం టివిలు, సామాజిక మాధ్యమాల వల్ల సమాజంలో చోటుచేసుకునే ప్రతి సంఘటన గురించి పిల్లలు సైతం తెలిసిపోతోంది. ఈ క్రమంలో ఎటువంటి పరిస్థితుల్లోనైనా సరే మహిళలపైన పురుషుల తన బలాన్ని ప్రదర్శించడం తప్పు అనే సంకేతాన్ని పిల్లలకు చేరేలా చేయాలే తప్ప జరిగిన ఘటనల్లో పురుషుడి పాత్ర తగ్గించి మహిళలని మాత్రమే బాధ్యురాలిని చేయకూడదు. అలాగే అబ్బాయిలు చేసే పనిని అమ్మాయిలు చేస్తున్నప్పుడు కూడా అది అబ్బాయిల పని నీకెందుకు? అమ్మాయిలెవరైనా ఇలా చేస్తారా? అంటూ వేరు చేసి కించపరిచేలా మాట్లాడకూడదు.

**.సానుకూల పదజాలంతోనే...** పది చేతి దెబ్బల కంటే ఒక్క మాట గుండెను పగిలేలా చేయగలదు. కొంతమంది తల్లిదండ్రులు పిల్లల ముందే పరుష పదజాలాన్ని ప్రయోగిస్తుండడం నేటి సమాజంలో భాగమైపోయింది. ఆడ, మగ మధ్య వ్యత్యాసం ఉందని అపోహపడడానికి, పరుషుడంటే బలవంతుడు అనే బీజం పిల్లల నరనరాల్లో నాటుకుపోవడానికి తల్లిదండ్రులు ఉపయోగించే పురుష పదజాలమై కారణమవుతుంది. అందుకే ఇటువంటి విషయాల్లో ముందు తల్లిదండ్రులకు శిక్షణ అవసరం అంటున్నారు మానసిక నిపుణులు. ముందు మనం మాట్లాడే మాటలు సానుకూలంగా ఉంటే.. చేతలు కూడా సానుకూలంగా మారతాయనే సత్యాన్ని తల్లింద్రులు అర్థం చేసుకోవాలి.




**ప్రతికూల ధోరణులకుదూరంగా. ...**

పిల్లలకు ఇంట్లో సానుకూల వాతావరణాన్ని ఏర్పరచడం ఎంత అవసరమో బయట నుంచి వారు ఎటువంటి ప్రతికూల ధోరణులను అలవర్చుకోకుండా ఊడడం కూడా అంతే అవసరం. ప్రత్యేకించి సినిమాలు, కొన్ని రకాల టివి షోలు, స్నేహితుల ప్రభావం వల్ల పిల్లలు నెగెటివిటీకి ఎక్కువ ఆకిర్షితులయ్యే ప్రమాదం ఉంటుంది. ప్రతి అంశంలోనూ మంచి, చెడుకి మధ్య ఉన్న వ్యత్యాసాన్ని గ్రహించేలా పిల్లలకు శిక్షణ ఇవ్వాలి. ▫

# ఐపిఎల్‌లో.. కాస్ట్‌లీ స్టార్లు ఫెయిల్యూర్


గ్లెన్ మాక్స్‌వెల్


రిషబ్ పంత్


మహమ్మద్ షమీ


రచిన్ రవీంద్ర

## రూ.కోట్లతో కొన్నా ఫలితం సున్నా చెత్త ప్రదర్శన చేసిన టాప్ 5 ప్లేయర్లు

**న్యూఢిల్లీ:** ఐపిఎల్ 18వ సీజన్ ఇప్పుడు చివరి దశకు చేరుకుంది. అభిమానులు ఇప్పటివరకు చాలా ఉత్తేజకరమైన మ్యాచ్‌లను చూశారు. చాలా మంది అన్‌క్యాప్డ్ ప్లేయర్లు తమ పేలుడు ఆటతో అందరి హృదయాలను గెలుచుకున్నారు. క్రికెట్ ప్రేమికులు అద్భుతమైన ప్రదర్శనను ఆశించిన చాలా మంది ఆటగాళ్ళు ఉన్నారు. కానీ వారు ఆ అంచనాలను చేరుకోలేకపోయారు. ఐపిఎల్ 2025కి ముందుజరిగిన మెగావేలంలో భారీ ధరకు అమ్ముడు పోయిన కొంతమంది స్టార్ ఆటగాళ్లు మైదానంలో ఫెయిల్ అయ్యారు. వీరు తమ టీమ్స్‌కు భారంగామారిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ఈజాబితాలో ఉన్న టాప్ 5 టీమిం డియా క్రికెటర్స్ కూడా ఉన్నారు. 65 మ్యాచ్‌ల తర్వాత ఈ ఐపీఎల్‌లో అత్యంత చెత్త ప్రదర్శనగా నిలిచిన ఐదుగురు ఆటగాళ్లలో రిషబ్ పంత్ ఒకడు. ఈ ఐపిఎల్ ప్రారంభానికి ముందు, అందరి దృష్టి టీం ఇండియా ఆశాజనక వికెట్ కీపర్ రిషబ్ పంత్ పైనే ఉంది. పంత్ కోసం అన్ని జట్ల మధ్య పోటీ నెలకొంది. కానీ లక్నో సూపర్ జెయింట్స్ జట్టు రికార్డు స్థాయిలో రూ.27 కోట్లకు వేలం వేయడం ద్వారా అతనిని తమ ఫ్లీట్‌లో చేర్చుకోవడంలో విజయవంతమైంది. కానీ మైదానంలో ప్రదర్శన విషయానికి వస్తే, పంత్ అందరినీ తీవ్రంగా నిరాశ పరిచాడు. రిషబ్ పంత్ లాగే, ఆస్ట్రేలియా బ్యాట్స్‌మన్ గ్లెన్ మాక్స్‌వెల్ కూడా ఈ ఏడాది అత్యంత చెత్తగా ఆడాడు. వేలంలో గ్లెన్‌మాక్స్వెల్‌పై నమ్మకం ఉంచి, పంజాబ్ కింగ్స్ ఫ్రాంచైజీ రూ.4.20 కోట్లకుకొన్నది. కానీ అతను బ్యాటింగ్, బౌలింగ్ రెండింటిలోనూ ఘోరంగా విఫలమయ్యాడు. గాయం కారణంగా వైదొలగడానికి ముందు అతను తన జట్టు తరపున మొత్తం ఏడు మ్యాచ్‌లు ఆడాడు. మహ్మద్ షమీ గాయం తర్వాత తిరిగి వచ్చిన టీం ఇండియా స్టార్ ఫాస్ట్ బౌలర్ మహ్మద్ షమీకి ఈ ఐపిఎల్ 18వ సీజన్ ప్రత్యేకం అంటూ ఏమీ లేదు. సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు తరపున తొమ్మిది మ్యాచ్‌ల్లో పాల్గొన్నాడు. అతను తొమ్మిది ఇన్నింగ్స్‌లో 56.16 సగటుతో ఆరు విజయాలు మాత్రమే సాధించాడు. ఇక గతేడాదిఅద్భుతమైన బ్యాటింగ్‌తో అందరి హృదయాలను గెలుచుకున్న ఆస్ట్రేలియా యువ బ్యాట్స్‌మన్ జేక్ ఫ్రేజర్ మెక్‌గుర్క్ బ్యాట్ కూడా ఈ ఏడాది మాత్రం రాణించలేకపోయాడు. ప్రస్తుత ఐపిఎల్‌లో అతను తన ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు తరపున మొత్తం ఆరు మ్యాచ్‌ల్లో పాల్గొ న్నాడు. అతను ఆరుఇన్నింగ్స్‌లో 9.17 సగటుతో 55 పరుగులు మాత్రమే చేయగలిగాడు. కాగా ఈఏడాది న్యూజిలాండ్ క్రికెట్ జట్టు ఆశాజనక ఆట గాడు రచిన్‌రవీంద్ర ప్రదర్శన కూడా అంతగా లేదనే చెప్పవచ్చు. అతను చెన్నై సూపర్ కింగ్స్ తరపున ఎనిమిదిమ్యాచ్‌ల్లో ఆడాడు. ఎనిమిది ఇన్నింగ్స్‌లో 27.29 సగటుతో 191 పరుగులు మాత్రమే చేయగలిగాడు.



# ఫార్ములా రేస్ విజేత కుష్ మైనీ

## చరిత్ర సృష్టించిన ఇండియన్

**న్యూఢిల్లీ:** ఫార్ములా ఎఫ్ 2 రేస్-2025 చరిత్రలో తొలిసారి భారతీయుడు చరిత్ర సృష్టించాడు. 25 ఏళ్ల భారత యంగ్ రేసర్ కుష్ మైనీ విజేతగా నిలిచాడు. ఫార్ములా ఎఫ్ 2 స్ప్రింట్ రేసింగ్‌లో విజయం సాధించిన తొలి భారతీయుడిగా రికార్డులకెక్కాడు. మొనాకోలోని కోట్ డి అజుర్‌లో భారత్ కాలమానం ప్రకారం సోమవారం జామున జరిగిన ఈ స్ప్రింట్ రేసులో కుష్ తొలి స్థానంలో నిలిచాడు. దీంతో, మొనాకోలో టాప్‌లో నిలిచిన ఏకైక భారతీయ రేసర్‌గా అరుదైన ఘనత సాధించాడు. ఫార్ములా 2 యొక్క రివర్స్‌గ్రిడ్ నియమం ద్వారా మైనీ స్ప్రింట్ రేసును పోల్ పొజిషన్ నుండి రైడ్ ప్రారంభించి, దాదాపు 30 ల్యాప్‌ల్లో లీడ్‌లో కొనసాగాడు. తన ప్రత్యర్థి గాబ్రియేల్ మినీ నుంచి తీవ్ర పోటీ ఎదురైనప్పటికీ కుష్ నిలకడగా రాణించి, రేసు పూర్తి చేశాడు. అతడు 44:57.63 నిమిషాల్లోనే రైడ్ కంప్లీట్ చేశాడు. ఇక తన విజయం పట్ల కుష్ సంతోషం వ్యక్తం చేశాడు. తనకు మద్దతుగా నిలిచి వారందరికీ ధన్యవాదాలు తెలిపాడు. ఇక ఈ తాజా విజయంతో కుష్ తదుపరి ఫీచర్ పి-10 రేసుకు కూడా అర్హత సాధించాడు. కాగా 2024లో బుడాపెస్ట్ స్ప్రింట్ రేస్‌లో కుష్ మైనీ తన తొలి విజయాన్ని సాధించాడు. అతని విజయం ఎఫ్2 స్ప్రింట్ ఫార్మాట్‌లో అతని మూడవ ప్రచారాన్ని సూచిస్తుంది. ఎంపి మోటార్‌స్పోర్ట్‌తో 2022 ఎఫ్‌ఐఎ ఫార్ములా 3 డ్రైవర్స్ ఛాంపియన్‌షిప్‌లో 13వ స్థానంలో నిలిచిన తర్వాత ఈ భారత డ్రైవర్ ఫార్ములా 2కి చేరుకున్నాడు. అతని సింగిల్ సీటర్ ప్రయాణం 2016లో ఇటాలియన్ ఎఫ్4తో ప్రారంభమైంది, ఆ తర్వాత 2018లో బ్రిటిష్ ఎఫ్3లో మూడవ స్థానంలో నిలిచింది మరియు 2020లో రన్నరప్‌గా నిలిచింది. ఈ మార్గంలో, మైనీ ఎఫ్3 ఆసియా సిరీస్‌లో కూడా అనుభవాన్ని పొందాడు.

# ఫోర్ నేషన్స్ హాకీ టోర్నీలో.. భారత్ మహిళా టీమ్‌కే రెండో మ్యాచ్

## ఉరుగ్వేపై 3-2 తేడాతో విజయం



**న్యూఢిల్లీ:** నాలుగు దేశాల జూనియర్ మహిళల హాకీలో భారత్ దూసుకుపోతోంది. ఫోర్ నేషన్స్ టోర్నమెంట్‌లో భారత్ జూనియర్ మహిళల హాకీ జట్టు తన రెండో మ్యాచ్‌లో ఉరుగ్వేపై 3-2 తేడాతో విజయం సాధించింది. అర్జెంటీనాలోని రోసారి యోలా జరిగిన ఈ మ్యాచ్‌లో కనికా డబుల్ గోల్స్ సాధించింది. కనికా (46వ నిముషం, 50వ నిముషం) సోనమ్ (21వ నిముషం) భారత్ తరపున గోల్ చేయగా, మిలాగ్రోస్ సీగల్ (3 నిముషం), అగస్టినా మారి (24 నిముషం) ఉరుగ్వే తరపున గోల్స్ చేశారు. ఆట ప్రారంభం నుంచి మూడో నిమిషంలోనే మిలాగ్రోస్ సీగల్ పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలిచడంతో ఉరుగ్వే తొలి ఆధిక్యంలో నిలిచింది. రెండవ క్వార్టర్‌లో, 21వ నిమిషంలో సోనమ్ పెనాల్టీ కార్నర్‌ద్వారా గోల్ చేయడంతో భారతదేశం ఈక్వలైజర్‌ను సాధించింది. అయితే, కేవలం మూడు నిమిషాల తర్వాత, అగస్టినా మారి పెనాల్టీ కార్నర్ ద్వారా గోల్ చేయడంతో ఉరుగ్వే తిరిగి ఆధిక్యంలోకి వెళ్లింది. కానీ చివరి దశలో కనికా సివాచ్ కీలకమైన బ్రేస్ గోల్స్ చేసి భారత్ విజయం సాధించడంలో సహాయపడింది. ఆమె మొదట 46వ నిమిషంలో పెనాల్టీ కార్నర్ ద్వారా గోల్‌చేసింది, ఆ తర్వాత 50వ నిమిషంలో నిర్ణయా త్మక ఫీల్డ్ గోల్ చేసి విజయాన్ని ఖరారు చేసింది. కాగా భారత్ జూనియర్ మహిళల హాకీ జట్టు తన తదుపరి మ్యాచ్‌లో ఈ నెల 27వ తేదీన ఆతిథ్య అర్జెంటీనాతో తలపడనుంది.

# క్వలాండర్స్‌కు పాక్ సూపర్ లీగ్ టైటిల్

## 6 వికెట్ల తేడాతో గ్లాడియేటర్స్ ఓటమి



**న్యూఢిల్లీ:** జింబాబ్వే ఆల్ రౌండర్ సికందర్ రాజా స్టన్నింగ్ ఆటను ప్రదర్శించాడు. పాకిస్థాన్ సూపర్ లీగ్‌లో లాహోర్ క్వలాండర్స్ జట్టు తరపున అతను వీరవిహారం చేశాడు. కేవలం 7 బంతుల్లో 22 రన్స్ చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. వాస్తవానికి పిఎస్ఎల్ ఫైనల్ మ్యాచ్ కోసం టాస్ వేయడానికి 10 నిమిషాల ముందే అతను లాహోర్ స్టేడియం చేరుకున్నాడు. ఇంగ్లండ్‌తో జరిగిన ఏకైక టెస్టు మ్యాచ్‌లో ఆడిన సికందర్ రాజా బర్మింగ్‌హామ్ నుండి ఆగమేఘాల మీద లాహోర్ చేరుకుని లాహోర్ జట్టుకు టైటిల్ అందించాడు. పాకిస్థాన్ సూపర్ లీగ్ ఫైనల్లో ఫస్ట్ బ్యాటింగ్ చేసిన క్వెట్టా గ్లాడియేటర్స్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 201 రన్స్ చేసింది. ఆ జట్టులో నవాజ్ 76 రన్స్ చేశాడు. ఆ తర్వాత భారీ టార్గెట్‌తో బరిలోకి దిగిన లాహోర్ జట్టుకు మరో బంతి మిగిలి ఉండగా విజయాన్ని అందుకున్నది. లాహోర్ టీమ్‌లో పెరేరా 62, నహీమ్ 46, షఫీక్ 41, రాజా 22 రన్స్ చేశారు. ఆరు వికెట్ల తేడాతో లాహోర్ గెలిచింది. ఈ మ్యాచ్‌లో సికందర్ రాజా స్పెషల్ అట్రాక్షన్‌గా నిలిచాడు. 24 గంటల క్రితం ఇంగ్లండ్‌తో జరిగిన టెస్టులో ఆడిన రాజా ఆ మ్యాచ్‌లో 25 ఓవర్లు బౌలింగ్ చేశాడు. ఆ తర్వాత 20 ఓవర్ల వరకు బ్యాటింగ్ చేశాడు. ఆ మ్యాచ్‌లో జింబాబ్వే ఓటమి పాలైంది. కానీ లాహోర్‌లో జరుగుతున్న పీఎస్ఎల్ ఫైనల్ మ్యాచ్‌తో 3 ఓవర్లలో 47 రన్స్ అవసరమైన దశలో బ్యాటింగ్‌కు దిగిన సికందర్ రాజా బ్రేవ్ ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. చివరకు 3 బంతుల్లో 8 రన్స్ అవసరమైన టైంలో రెండు బౌండరీలు కొట్టి జట్టుకు థ్రిల్లింగ్ విక్టరీ అందించాడు. దీంతో లాహోర్ మూడోసారి టైటిల్ చేజిక్కించుకున్నది.

# వెస్టిండీస్ చేతిలో ఐర్లాండ్ చిత్తు

## మూడో వన్డే సిరీస్ సమం



**న్యూఢిల్లీ:** ఐర్లాండ్‌తో జరిగిన మూడో వన్డే సిరీస్‌ను వెస్టిండీస్ సమం చేసింది. మూడో వన్డేలో డక్ లూయిస్ పద్ధతిన 197 పరుగుల తేడాతో వెస్టిండీస్ ఘన విజయం సాధించింది. దీంతో మూడు వన్డేల సిరీస్ 1-1తో సమమైంది. డబ్లిన్ వేదికగా సోమవారం జరిగిన ఈ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్లు నష్టానికి 385 పరుగుల భారీ స్కోర్ నమోదు చేసింది. విండీస్ ఇన్నింగ్స్‌లో ఫస్ట్ డౌన్ బ్యాటర్ కిస్ కార్టీ అద్భుత సెంచరీతో చెలరేగాడు. ఈ మ్యాచ్‌లో 142 బంతులు ఎదుర్కొన్న కార్టీ 15 ఫోర్లు, 8 సిక్స్‌లతో 170 పరుగులు చేశాడు. వెస్టిండీస్ బ్యాటర్లలో కార్టీతో పాటు, కెప్టెన్ షాయ్ హోప్ (75), జస్టిన్ గ్రీవ్స్ (50) హాఫ్ సెంచరీలతో రాణించారు. ఐరిష్ బౌలర్లలో బారీ మెక్‌కార్తీ 3 వికెట్లు పడగొట్టగా, లైమ్ మెక్‌కార్తీ 2, మెక్‌బ్రైన్, డకిరల్ తలా వికెట్ సాధించారు. అనంతరం వర్షం కారణంగా 46 ఓవర్లలో ఐర్లాండ్ లక్ష్యాన్ని 365గా నిర్ణయించారు. భారీ లక్ష్య ఛేదనలో ఐర్లాండ్ 29.5 ఓవర్లలో 165 పరుగులకే కుప్పకూలింది. ఐర్లాండ్ బ్యాటర్లలో కేడ్ కార్మైకేల్ (48) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. విండీస్ బౌలర్లలో జైడన్ సీల్స్ 3 వికెట్లు పడగొట్టి ఐర్లాండ్‌ను దెబ్బతీయగా, జోషఫ్, గ్రీవ్స్, ఛేజ్ తలా వికెట్ సాధించారు.

# వాణిజ్యం

## ఇండియన్ స్టార్టప్‌తో యమహా జత..

**ముంబై, మే 26:** యమహా కంపెనీ త్వరలో రివర్ ఇండి ఆధారంగా సరసమైన ఎలక్ట్రిక్ స్కూటర్ మార్కెట్‌లో విడుదల చేసేందుకు సిద్ధంగా ఉందని నిపుణులు చెబుతున్నారు. రివర్ ఇండి ఈవీ స్కూటర్ మాదిరిగానే బ్యాటరీ నిర్వహణ వ్యవస్థ, పవర్ ట్రెయిన్‌ను ఉపయోగిస్తుందని పలునివేదికల ద్వారా స్పష్టమైంది. జపాన్‌కు చెందిన యమహా మోటార్ కంపెనీ ఫిబ్రవరి 2024లో రివర్ ఇండికంపెనీ సుమారు 40 మిలియన్లడాలర్ల పెట్టుబడి పెట్టింది. రివర్ ఇండీ భాగస్వామ్యంతో కొత్త యమహా ఆర్‌వై01 ఎలక్ట్రిక్ స్కూటర్ ఈ పండుగ సీజన్‌తో ఉత్పత్తి ప్రారంభించి ఈ సంవత్సరం చివరినాటికి లాంచ్ అవుతుందని భావిస్తు న్నారు. ఈ కొత్త ఈవీ భారతదేశం, అమెరికా, యూరప్లోని యమహా గ్లోబల్ ఇంజనీరింగ్ బృందాలు అభివృద్ధి చేస్తున్నాయి. యమహా డిజైన్ మరియు బ్రాండ్ ఎథోస్‌తో వచ్చే ఈ స్కూటర్ లాంచ్‌అయినా ఇంజనీరింగ్, టెస్టింగ్, పరిశోధన, అభివృద్ధి, అన్నీ రివర్ కంపెనీ ద్వారా నిర్వహిస్తారు.

## లాభాల్లో ముగిసిన స్టాక్ సూచీలు..



**ముంబై, మే 26:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిశాయి. ముఖ్యంగా ఐటీ, ఆటో, మెటల్ స్టాక్స్ అండతో సూచీలు వరుసగా రెండో ట్రేడింగ్ సెషన్‌లోనూ లాభపడ్డాయి. ఈయూతో వాణిజ్య చర్చల గడువును జులై 9 వరకు పొడిగిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించడంతో 50 శాతం టారిఫ్‌ల అమలు వాయిదా పడింది. తాత్కాలికంగా అనిశ్చితులు చల్లారడంతో ఆసియా మార్కెట్లతో పాటు మన మార్కెట్లూ రాణించాయి. నిఫ్టీ 25 వేల మార్కు ఎగువన ముగిసింది.

సెన్సెక్స్ ఉదయం 81,928.95 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా అదే జోరును కొనసాగించింది. ఇంట్రాడేలో 82,492.24 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 455.37 పాయింట్ల లాభంతో 82,176.45 వద్ద ముగిసింది. నిఫ్టీ 148 పాయింట్ల లాభంతో 25,001 పాయింట్ల వద్ద స్థిరపడింది. డాలరు తో రూపాయి మారకం విలువ 35 పైసలు బలపడి 85.10గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో మహీంద్రా అండ్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టాటా మోటార్స్, నెస్లే ఇండియా, ఐటీసీ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. ఎటర్నల్, అల్ట్రాటెక్ సిమెంట్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, సన్‌ఫార్మా, ఎన్టీపీసీ షేర్లు నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 64.75 డాలర్లు వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 3,332 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

**ముంబై, మే 26:** డాలర్‌తో పోలిస్తేరూపాయి విలువ 40పైసలు పెరిగింది. కరెన్సీ 85.02 వద్ద ప్రారంభమై ప్రారంభ ట్రేడింగ్ లో 84.98ని తాకింది. దీనికి డాలర్ విలువ పతనం, ఆసియా కరెన్సీలలో, ముఖ్యంగా చైనీస్ యువాన్‌లో ర్యాలీ మద్దతు ఇవ్వడంతో రూపాయి ధర పెరి గింది. ఇది ఏడు నెలల గరిష్ట స్థాయికి చేరుకుంది. సోమవారం (మే 26)అమెరికా డాలర్‌తో పోలిస్తే భారత రూపాయి విలువ 40 పైసలు బలపడి 85.05 వద్ద ఇస్తూనే ఉంది. శుక్రవారం (మే 23) రూ.1,794 కోట్ల నికర ఈక్విటీ కొనుగోళ్లతో బల మైన ఎఫ్‌ఐఐ ఇన్‌ఫ్లోలు భారత మార్కెట్లలో పెరుగుతున్న విశ్వాసాన్ని ప్రతిబిం బిస్తున్నాయి. ప్రపంచ సంకేతాలు, స్థానిక స్థూల డేటా ద్వారా ఈ వారం రూపాయి 84.9085.30 మధ్యలో ఉంటుందని కరెన్సీ వ్యాపారులు భావిస్తు న్నారు. ఏప్రిల్ ఐఐపి, క్యూ1 జిడిపి సంఖ్యలతో సహా కీలకమైన దేశీయ డేటా పాయింట్లు ఈ వారం చివరిలో రానున్నాయి. ఇవి

# డాలర్ డీలా..రూపాయి పైపైకి

ప్రారంభమైంది. డాలర్‌లో విస్తృత బలహీనత దేశీయ ఈక్విటీలు బలంగా ఉండటం వంటి కారణాలతో శుక్రవారం (మే 23) నుండి లాభాల వైపు రూపాయి ప్రయాణించింది. భారత కరెన్సీ 85.02 వద్ద ప్రారంభమై ప్రారంభ ట్రేడింగ్‌లో 84.98ని తాకింది. దీనికి డాలర్ విలువ పతనం, ఆసియా కరెన్సీలలో, ముఖ్యం గా చైనీస్ యువాన్‌లో మార్పులతో రూపాయి విలువ పెరగింది. ఇది ఏడునెలల గరిష్ట స్థాయికి చేరుకుంది. రూపాయి విలువను ఏది నడిపిస్తోంది? ప్రపంచ ఆర్థిక ఆందోళనలు, అమెరికా వాణిజ్యంలో హెచ్చుతగ్గులు కారణంగా డాలర్ ఇండెక్స్ 0.34శాతం తగ్గి 98.67కి చేరుకుంది. డాలర్ విలువ తగ్గడంతో ఆసియా కరెన్సీలు అన్ని చోట్ల లాభపడ్డాయి. చైనీస్ యువాన్ డాలర్‌కు 7.1650కి బలపడి ప్రాంతీయ సెంటిమెంట్‌ను పెంచడంలో సహాయపడింది. ప్రభు త్వానికి ఆర్‌బిఐ రికార్డు స్థాయిలో రూ.2.11 లక్షల కోట్ల డివిడెండ్ ఆర్థిక ఒత్తిడిని తగ్గించడం ద్వారా రూపాయికి మద్దతు స్వల్పకాలిక సెంటిమెంట్‌ను రూపొందించవచ్చు. శుక్రవారం (మే 23) మార్కెట్ పుంజుకున్నప్పటికీ, ఈ నెలలో ఆసియా కరెన్సీలలో రూపాయి బలహీనమైన వాటిలో ఒకటిగా ఉంది. కొరియన్ వోన్, థాయ్ బాట్, ఇండోనేషియా రూపాయి బలమైన లాభాలను నమోదు చేశాయి. ఇక భారతదేశం జపాన్‌ను అధిగమించి ప్రపంచంలో నాల్గవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించింది. త్వరలోనే జర్మనీని అధిగమించి మూడవ స్థానాన్ని కూడా పొందే అవకాశం ఉందని నీతీ అయోగ్ సీఈఓ బీవీఆర్ సుబ్ర మణ్యం తెలిపారు. నీతీ అయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ 10వ సమా వేశం అనంతరం ఆయన మీడియా సమావేశంలో భారత ఆర్థిక పురోగతిపై పలు ఆసక్తికర విషయాలు వెల్లడించారు. ఇప్పుడు ప్రపంచంలోమనంనాల్గవ అతిపెద్ద ఆర్థికవ్యవస్థ. భారత్ 4 లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థ. భారతదేశం జపాన్‌కంటే పెద్దది. ప్రస్తుతం అమెరికా, చైనా, జర్మనీ మాత్రమే మనకంటే ముందు ఉన్నాయి.







భారతీయ ప్రమాణాలపై
ఓ సరికొత్త
సమాచార వేదిక..!
వినియోగదారులకు సమాచారం,
పరిశ్రమలకు సాధికారత అందించే లక్ష్యంతో...

వాచ్ చేయండి
@IndianStandard
కొత్త బులెటిన్, ప్రతీ శుక్రవారం

విశ్వవ్యాప్తంగా గుర్తింపు పొందేందుకు, వికసిత భారత లక్ష్యాన్ని చేరుకునేందుకు మొదటి అడుగు మన భారతీయ ప్రమాణాలు, నాణ్యతపై అవగాహన కలిగి ఉండటమే. దీన్ని సాకారం చేసేందుకు, జాతీయ ప్రమాణాల సంస్థ.. బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్, "స్టాండర్డ్స్ వాచ్" పేరిట ఓ వారపు వార్తల బులెటిన్‌ను అందుబాటులోకి తెచ్చింది. యూట్యూబ్‌లో @ఇండియన్ స్టాండర్డ్స్ ఛానల్ ద్వారా ప్రతీ శుక్రవారం వార్తల సమాహారాన్ని మీ ముందుకు తేనుంది.
ఫాలో చేయండి, సబ్‌స్క్రైబ్ చేయండి - నలుగురితో పంచుకోండి!

బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్, హైదరాబాద్ శాఖా కార్యాలయం:
జెడ్‌టీఎస్-ఎన్ఎఫ్‌సీ రోడ్, హెచ్‌బీ కాలనీ, మౌలాలీ, హైదరాబాద్, తెలంగాణ 500040, +9154843230/31/32/33
Follow us on: @Indianstandards | Website: www.bis.gov.in


Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.